Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 250 మేడ్చల్ మల్కాజ్‌గిరి 29 సెప్టెంబర్ 2023 శుక్రవారం పేజీలు : 4

## ఎన్‌డీఏ పతనం ప్రారంభమైంది..

చెన్నై : ప్రతిపక్షాలతో కూడిన 'ఇండియా' కూటమి ఏర్పాడ్డక.. 37 పార్టీలతో కూటమి ఏర్పాటు చేసుకున్నట్లు ఆర్భాటంగా ప్రకటించుకున్న ఎన్‌డీఏ పతనం ప్రారంభమైందని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ అన్నారు. స్థానిక టి.నగర్‌లో వున్న పార్టీ ప్రధాన కార్యాలయంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ముత్తరసన్ తదితరులతో కలిసి నారాయణ విలేకరులతో మాట్లాడుతూ.. ఎన్‌డీఏలోని 37 పార్టీల్లో 17 లెటర్‌ప్యాడ్ పార్టీలేనని, ప్రధాన పార్టీల్లో ఒకటిగా ఉన్న అన్నాడీఎంకే ఇప్పుడు బయటకు రావడంతో ఆ కూటమి పతనం తథ్యమని తేలిపోయిందన్నారు. మహిళా బిల్లును కూడా పార్లమెంటులో తప్పనిసరి పరిస్థితుల్లో పెట్టారే తప్ప, ఆ బిల్లుపై బీజేపీకి చిత్తశుద్ధి లేదన్నారు. ఎప్పుడో అమలయ్యేదానికి ఇప్పుడెందుకు బిల్లు తెచ్చారని ప్రశ్నించారు. డీలిమిటేషన్ జరిగితే ఉత్తర-దక్షిణ భారతాలుగా దేశం చీలిపోయే ప్రమాదముందని హెచ్చరించారు.




# వాతావరణం వేడెక్కుతోంది..!

## ఎన్నికలకు వడివడిగా అడుగులు!!

హైదరాబాద్ : తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల కసరత్తు వేగం పెరిగింది. ఇటు పార్టీలు అభ్యర్థుల జాబితా ప్రకటనకు సిద్ధం అవుతున్నాయి. అటు ఎన్నికల సంఘం షెడ్యూల్..ఎన్నికల ఏర్పాట్లు పైన కార్యాచరణ మొదలు పెట్టింది. ఇప్పటికే తెలంగాణలో ఎన్నికల దిశగా తాత్కాలిక షెడ్యూల్ ను సిద్ధం చేసుకుంది. ఈ మేరకు కార్యక్రమాలకు గడువు నిర్దేశించుకున్నారు. కొన్నిరోజులు అటుఇటుగా ఇదే షెడ్యూల్‌తో అసెంబ్లీ ఎన్నికలు జరిగే అవకాశాలున్నాయి. ఎన్నికల కసరత్తు:ఎన్నికల కసరత్తులో భాగంగా అధికారులు ఒక షెడ్యూల్ సిద్ధం చేసుకున్నారు. ఈ మేరకు ఎన్నికల నిర్వహణ కార్యాచరణ వేగవంతం చేసారు. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం 2018లో జరిగిన సాధారణ ఎన్నికల షెడ్యూల్ నే ఇప్పుడు రానున్న ఎన్నికల కోసం తమ కార్యక్రమాల క్యాలెండర్ సిద్ధం చేస్తున్నారు. వాస్తవానికి తెలంగాణతోసహా ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, రాజస్తాన్, మిజోరం రాష్ట్రాల శాసనసభ ఎన్నికల నిర్వహణకు అక్టోబర్ తొలివారం లేదా ఆ తర్వాత ఎప్పుడైనా కేంద్ర ఎన్నికల సంఘం ఎన్నికల షెడ్యూల్ ప్రకటించే అవకాశముంది. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల నిర్వహణ సంసిద్ధతను పరిశీలించడానికి చీఫ్ ఎలక్షన్ కమిషనర్ (సీఈసీ) రాజీవ్‌కుమార్ నేతృత్వంలో కేంద్ర ఎన్నికలసంఘం ఫుల్ బెంచ్ అక్టోబర్ 3 నుంచి 5వ తేదీ వరకు రాష్ట్రంలో పర్యటిస్తుంది.

**షెడ్యూల్ దిశగా:** సీఈసీ అధికారుల పర్యటన తరువాత వాస్తవ ఎన్నికల షెడ్యూల్ ప్రకటిస్తారు. నిర్దిష్ట తేదీలతో వచ్చే అక్టోబర్ టు డిసెంబర్ వరకు రోజువారీగా చేయాల్సిన కార్యాక్రమాలతో ఎన్నికల సంఘం ఓ కేలండర్ రూపొందించింది. ఇప్పటికే ఈవీఎంలు, వీవీప్యాట్‌లకు ప్రథమస్థాయి తనిఖీలు పూర్తయ్యాయి. ఎన్నికల సామగ్రి సమీకరణ, బ్యాలెట్ పత్రాల ముద్రణకు ప్రింటింగ్ ప్రెస్ ఎంపిక, స్ట్రాంగ్ రూమ్స్, కౌంటింగ్ కేంద్రాల పరిశీలన .. నిర్ధారణ, దర్యాప్తు సంస్థల నోడల్ అధికారులు.. సహాయ వ్యయ పరిశీలకులు.. వ్యయ పర్యవేక్షణ బృందాలు..రిటర్నింగ్ అధికారులు..సెక్టార్ అధికారులకు వేర్వేరుగా శిక్షణ, జిల్లాలకు నిధుల కేటాయింపు పైన నిర్ణయం తీసుకోనున్నారు అభ్యర్థుల ఎన్నికల వ్యయానికి సంబంధించిన ధరల పరిశీలన టీమ్‌ల ఏర్పాటు తదితర పనులన్నీ వచ్చే అక్టోబర్‌నెలలోగా పూర్తి చేయాలని సీఈఓ కార్యాలయం నిర్దేశించుకుంది.

**కౌంట్ డౌన్ షురూ:** నవంబర్‌లో వివిధ స్థాయిల్లోని పోలీసు అధికారులకు శిక్షణ ఇవ్వనుంది. పోలింగ్ కేంద్రాల ప్రకటనతో పాటుగా వికలాంగులు..80 ఏళ్లకు పైబడిన వయో వృద్ధులైన ఓటర్లకు ఇంటి నుంచే ఓటు హక్కు కల్పించడానికి ఫారం 12డీ దరఖాస్తుల స్వీకరణ ప్రారంభిస్తారు. సీ-విజిల్ ద్వారా ఎన్నికల కోడ్ ఉల్లంఘన ఫిర్యాదుల స్వీకరణ.. ఓటర్ల జాబితా ప్రకటన, పోలింగ్..కౌంటింగ్ ఏజెంట్ల నియామకం.. బ్యాలెట్ పత్రాల ముద్రణ..పోస్టల్ బ్యాలెట్ల పంపిణీ... స్వీకరణ తదితరాలన్నీ పూర్తి చేయాలని షెడ్యూల్ గా నిర్ణయించుకున్నారు. కేంద్రంలో జమిలి ఎన్నికల పైన కొంత కాలంగా ప్రచారం సాగినా..ఇప్పుడు అటువంటి ప్రతిపాదన ఇప్పట్లో అమలు కాదని తేలటంతో ఇక ఎన్నికల షెడ్యూల్ మరో 10-15 రోజుల్లో విడుదలయ్యే అవకాశం కనిపిస్తోంది.

# ఆ మంత్రులకు ఎదురుగాలి వీస్తోందా ?




హైదరాబాద్ : కేసీయార్ మంత్రివర్గంలోని కొందరికి ఎదురుగాలి వీస్తోందని సమాచారం. మత్రివర్గంలోని ఏడుగురు మంత్రులపై పార్టీలోనే తీవ్ర వ్యతిరేకత ఉందని దీనికి అదనంగా జనాల్లో కూడా వ్యతిరేకత తోడైందని కేసీయార్ కు థర్డ్ పార్టీ నివేదిక అందినట్లు పార్టీలో టాక్. ఈ మంత్రులకు పార్టీ నేతల నుండి ఏమాత్రం సహకారం అందటంలేదని సమాచారం. సబితా ఇంద్రారెడ్డి, జగదీష్ రెడ్డి, ఎర్రబెల్లి దయాకరరావు, గంగుల కమలాకర్, వేముల ప్రశాంత్ రెడ్డి, మల్లారెడ్డి, తలసాని శ్రీనివాస్ కు బాగా ఎదురుగాలి ఉన్నట్లు తెలుస్తోంది. పార్టీలోని పరిస్థితులతో పాటు జనాల మనోభావలను గమనిస్తుంటే వీళ్ళ గెలుపు అనుమానంగానే ఉందట. జనాల్లో కావచ్చు లేదా పార్టీలో కూడా వీళ్ళపై కొంత అసంతృప్తి ఉందని కేసీయార్ ముందే ఊహించారు. అందుకనే నేతలు కాదన్నా వీళ్ళకే టికెట్లు ఇచ్చారు. అయితే కేసీయార్ ఊహించినదానికన్నా వ్యతిరేకత చాలా ఎక్కువగా ఉన్నట్లు తాజా రిపోర్టులు అందింది. ఇంటెలిజెన్స్ రిపోర్టులు కూడా మంత్రులకు గెలుపు కష్టమే అన్నట్లుగా నివేదికలు ఇచ్చిందిట. దీని ఆధారంగానే మంత్రులతో కేసీయార్ ప్రత్యేకంగా మాట్లాడి జాగ్రత్తలు చెప్పినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. సంక్షేమపథకాలు అమలుచేస్తున్నా, జిల్లాల్లో మంత్రులే సుప్రింలుగా ఉన్నా ఎందుకింత వ్యతిరేకతను ఎదుర్కొంటున్నారన్నది అర్థంకావటంలేదు. పార్టీవర్గాల సమాచరం ఏమిటంటే అపరిమితమైన అధికారాలు చాలామంది మంత్రుల్లో లెక్కలేనితనం పెరిగిపోయిందట. మద్దతుదారుల్లో కొందరిని మాత్రమే చేరదీయటం, పార్టీలో బాగా కష్టపడే వారిని దూరంగా పెట్టేయటం, పనులు జరగకుండా చూడటం లాంటి అనేక చర్యలతో పార్టీలోనే వీళ్ళపై తీవ్రస్థాయిలో అసంతృప్తులు పెరిగిపోయినట్లు సమాచారం. మంత్రుల స్థానంలో టికెట్లు దక్కించుకోవాలని పోటీపడిన మాజీఎంఎల్‌ఏలు, గట్టినేతల వల్లే మంత్రులకు బాగా ఇబ్బందులు ఎదురవుతున్నట్లు పార్టీవర్గాలు చెబుతున్నాయి. సబితకు వ్యతిరేకంగా తీగల కృష్ణారెడ్డి, జగదీష్ రెడ్డికి వ్యతిరకంగా దామోదర్ రెడ్డి, పాటేల్ రమేష్ రెడ్డి, ఎర్రబెల్లికి వ్యతిరేకంగా పార్టీలోని వ్యతిరకుతలతో పాటు కాంగ్రెస్ నేత ఝాన్సీరెడ్డి, గంగులకు వ్యతిరేకంగా మాజీ, ప్రస్తుత మేయర్లు రవీందర్ సింగ్, సునీల్ రావుతో పాటు కాంగ్రెస్ నుండి బలమైన నేతలు చాలెంజులు విసురుతున్నారు. తలసాని, వేముల, మల్లారెడ్డికి కూడా సొంతపార్టీతో పాటు కాంగ్రెస్ లో బలమైన నేతలతో తలనొప్పులు పెరిగిపోతున్నాయట. చివరకు ఏమవుతుందో ఏమో.




## హాట్‌హాట్‌గా బీజేపీ పదాధికారుల సమావేశం.. కిషన్‌రెడ్డిపై నేతల ఫైర్

హైదరాబాద్ : బీజేపీ పదాధికారుల సమావేశం గత రాత్రి జరిగింది. ఈ సమావేశం హాట్‌హాట్‌గా జరిగినట్టు సమాచారం. పదాధికారుల సమావేశంలో కేంద్ర మంత్రి, రాష్ట్ర బీజేపీ చీఫ్ అయిన కిషన్ రెడ్డిపై పలువురు నేతలు ఫైర్ అయ్యారు. పార్టీ ఏం చేస్తుందో.. ఎన్నికలను ఎలా ఎదుర్కొంటోందో తమకు అర్థం కావడం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలుస్తోంది. పార్టీని నమ్ముకుని నియోజకవర్గాల్లో డబ్బులు ఖర్చు పెట్టుకుంటున్నామని.. మనం మాత్రం ఆఫీసుల్లో కూర్చుని మీటింగులు పెట్టుకుంటున్నామన్నారు. అయితే పార్టీ మీటింగ్‌లో నెగిటివ్ గా మాట్లాడడం సరి కాదని కిషన్ రెడ్డి వారించే ప్రయత్నం చేసినట్టు తెలుస్తోంది. బీజేపీలో చేరి పదేళ్ళు అవుతుందని.. ఎలా మాట్లాడాలో తనకు తెలియదా? అంటూ పార్టీ కీలక నేత సంకినేని వెంకటేశ్వరరావు ఫైర్ అయ్యారు.
వరంగల్ నరేంద్ర మోదీ సభకు, ఖమ్మం అమిత్ షా సభకు పెద్దగా జనం రాలేదని నేతలు పేర్కొన్నట్టు సమాచారం. అక్టోబర్ 1, 3న జరగనున్న ప్రధాని మోదీ సభలకైనా.. భారీగా జనాల్ని తరలించాలని కిషన్ రెడ్డిని కోరారు. రాష్ట్ర కార్యాలయంలో తమను ప్రెస్ మీట్‌లు పెట్టనీయడం లేదని అధికార ప్రతినిధులు తెలిపారు. అధికార ప్రతినిధులుగా తమ రోల్ ఏంటో తెలుపాలని బీజేపీ నేతలు కోరారు.

# మధ్య తరగతిపై ధరల మోత!



**విలవిల్లాడుతున్న సామాన్యుడు - 8 ఏండ్లలో 60-75% పెరిగిన రేట్లు**
**పరుగులు తీస్తున్న పెట్రోల్, డీజిల్ - రెండింతలు పెరిగిన ఇంటి ఖర్చులు**
**అడుగంటుతున్న ప్రజల ఆదాయాలు - జనాల్లో పడిపోతున్న కొనుగోలు శక్తి**

హైదరాబాద్ : కేంద్రంలోని మోదీ సర్కారు అవలంబిస్తున్న ఆర్థిక విధానాలతో నిత్యావసరాలు మొదలు పెట్రోల్ రేట్ల దాకా అన్నీ ఆకాశాన్ని తాకుతున్నాయి. ఈ ప్రభావం ఎక్కువగా మధ్యతరగతి మీదే పడుతున్నది. ఫలితంగా సగటు పౌరుడు రోజురోజుకు పేదరికంలోకి జారుకొంటున్నాడు. కేంద్ర వాణిజ్య వ్యవహారాల శాఖ, కేంద్ర ఆర్థిక శాఖ, కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ, తదితర శాఖలు వెల్లడిస్తున్న గణాంకాలే ఉదాహరణే ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. దేశ జనాభాలో మధ్య తరగతి జనాభా.. 29 శాతం. జాతీయ ఆదాయంలో వారిదే 79 శాతం వాటా. దేశీయ వస్తు ఉత్పత్తుల వినియోగదారుల్లో 70 శాతం వారే ఉన్నారు. అంటే.. దేశ ప్రగతిలో వారి పాత్ర ఎంత కీలకమో అర్థం చేసుకోవచ్చు. కేంద్ర అసమర్థ విధానాల ఫలితంగా ఇప్పుడు దేశంలోని మధ్యతరగతి కొనుగోలు శక్తి నానాటికీ దిగజారిపోతున్నది. నలుగురు కుటుంబసభ్యుల సగటు ఖర్చు ఎనిమిదేండ్లలో రెండింతలైంది. నిత్యావసర సరుకులు, రవాణా ఖర్చులు, విద్య, వైద్యం, అద్దె.. ఇలా అన్ని ఖర్చులూ డబుల్ అయ్యాయి. అదే స్థాయిలో ఆదాయం పెరగకపోవటం, సబ్సిడీల్లో కేంద్రం కోతలు విధించటంతో కుటుంబ అవసరాలను కూడా తీర్చుకోలేని దుస్థితికి మధ్యతరగతి ప్రజలు చేరుకొన్నారు. కొనుగోలు శక్తిని కోల్పోతూ క్రమంగా పేదరికంలోకి జారుతున్నారు. కరోనా కూడా తోడవ్వటంతో మధ్యతరగతి బడ్జెట్ తారుమారైంది. దేశంలో ఏడాది కాలంలో ఏకంగా 36 లక్షల మంది పేదరికంలోకి చేరినట్టు సర్వేలు వెల్లడిస్తున్నాయి. గతంలో జీతంలో కనీసం 10 శాతం పొదుపు చేసే అవకాశం ఉండగా, ప్రస్తుతం అప్పులతో నెట్టుకు రావాల్సిన దుస్థితి తలెత్తింది.

**బీజేపీ అసమర్థ ఆర్థిక విధానాలు, సబ్సిడీల్లో కోతలు :** డీజిల్, పెట్రోల్ ధరలు పెరిగి, సరుకు రవాణా ఖర్చు లు పెరిగాయి. దాని ప్రభావం నిత్యావసర సరుకుల ధరలపై పడుతున్నది. ద్రవ్యోల్బణం రేటు తగ్గుతున్నా సరుకుల ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. నిత్యావసర సరుకుల ఎగుమతులపై ఆంక్షలను ఎత్తివేయడం, దిగుమతులపై భారీగా సుంకాలను విధి ంచడం. దేశంలో పప్పులు, నూనె గింజలు మినహాయించి మిగతా అన్ని రకాల వస్తువులు సమృద్ధిగా ఉన్నాయి. అయినా విదేశీ మారక ద్రవ్యం పెంచుకొనేందుకు కేంద్రం వాటి ఎగుమతులను ప్రోత్సహిస్తున్నది. ఫలితంగా దేశీయంగా వాటి ధర పెరుగుతున్నది. దిగుమతులపై సుంకాలు విధించటంతో పప్పులు, నూనెల రేట్లు ఆకాశాన్నంటుతున్నాయి. బీజేపీ ప్రభుత్వం ఆహార సబ్సిడీల్లో కోతలు విధిస్తున్నది. 2022-23 బడ్జెట్‌లో ఆహార సబ్సిడీలో 28 శాతం, ఎరువుల సబ్సిడీలో 25 శాతం, ఇంధన సబ్సిడీలో సుమారు 11 శాతం మేర కోత విధించింది. నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతుంటే.. విలా స వస్తువులు, ఇంటర్నెట్ డాటా ధరలు తగ్గుతుండ డం కేంద్ర అసమర్థ ఆర్థిక విధానానికి నిదర్శనం.

**ఇవే విధానాలు కొనసాగితే శ్రీలంక లాంటి పరిస్థితే :** కేంద్ర విధాన వైఫల్యాల వల్లే నిత్యావసర సరుకులు పెరుగుతున్నా యి. ప్రజల కొనుగోలు శక్తిని పెంచేందుకు ఉద్దీపన ప్యాకేజీలు లేవు. ఎఫ్‌సీఐలో 86 మిలియ న్ టన్నుల ధాన్యం నిల్వలు ఉన్నాయి. పప్పులు, నూనెగింజలు మినహా ఇతర పంటలన్నీ దేశీయ అవసరాలకు మించి ఉన్నా యి. అయినా కేంద్రం నిర్వహణ లేమీతో ధరలు పెరిగిపోతున్నాయి. ఇవే విధానాలు కొనసాగితే దేశం శ్రీలంకలా మారినా ఆశ్చర్యపోనక్కర్లేదు. **- డీ పాపారావు, ఆర్థికవేత్త**

**ట్రాన్స్‌పోర్టు ఖర్చులువిపరీతంగా పెరిగాయి :** పెట్రోల్, డీజిల్ ధరలు పెరగటం వల్ల ట్రాన్స్‌పోర్టు ఖర్చులు విపరీతంగా పెరిగిపోయాయి. ఫలితంగా నిత్యావసర సరుకుల ధరలు పెరిగిపోతున్నాయి. రవాణా ఖర్చులు తగ్గితే ఆటోమెటిక్‌గా సరుకుల ధరలు తగ్గుతాయి.

**- నవీన్,కిరాణ వ్యాపారి, ఎర్రగడ్డ**

# సంపాదకీయం

## అసలు కెనడాలో సిక్కులకు ఎందుకంత ప్రాధాన్యత!

తమ దేశ పౌరుడు, ఖలిస్తాన్ టైగర్ ఫోర్స్ నేత హరదీప్ సింగ్ నిజ్జర్ ను భారత ప్రభుత్వ ఏజెంట్లు చంపారంటూ కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో చేసిన తీవ్ర ఆరోపణలు రెండు దేశాల మధ్య తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసిన సంగతి తెలిసిందే. అంతేకాకుండా కెనడా ప్రధాని ట్రూడో.. ఆ దేశంలో భారత దౌత్యవేత్తను దేశం నుంచి బహిష్కరించారు. దీనికి దీటుగా ప్రతిస్పందించిన భారత్.. మనదేశంలోని కెనడా దౌత్యవేత్తను కూడా దేశం నుంచి బహిష్కరించింది. అంతేకాకుండా కెనడియన్లకు వీసాల జారీని నిలిపేసింది. అయినా జస్టిన్ ట్రూడో వెనక్కి తగ్గడం లేదు. భారత్ పైన హత్య ఆరోపణలను చేస్తూనే ఉన్నారు. తాము చేసే దర్యాప్తులో భారత్ కూడా పాలుపంచుకోవాలని.. తమ దర్యాప్తుకు సహకరించాలని ట్రూడో కోరుతున్నారు. అంతేకాకుండా కెనడా మిత్ర దేశాలైన అమెరికా, ఫ్రాన్స్, బ్రిటన్, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా తదితర దేశాల అధినేతలు, ప్రధానులకు కూడా భారత్ పైన ఆయన ఫిర్యాదులు చేశారు. ఈ విషయంలో భారత్ పై ఒత్తిడి తీసుకురావాలని కోరుతున్నారు. ఈ నేపథ్యంలో కెనడా ప్రధాని సిక్కులకు ఎందుకంత ప్రాధాన్యం ఇస్తున్నారనే విషయం ప్రాధాన్యత సంతరించుకుంది. కెనడాతో పోలిస్తే అన్నింటా ముందున్న భారత్ పైకే కాలు దువ్వుతున్న ట్రూడో సిక్కులను ఎందుకు నెత్తినపెట్టుకుంటున్నారనే అంశం ఆసక్తి రేపుతోంది. ప్రపంచంలో విస్తీర్ణంపరంగా రష్యా తర్వాత రెండో అతిపెద్ద దేశమైన కెనడాలో 2021 జనాభా లెక్కల ప్రకారం.. 3.70 కోట్ల జనాభా మాత్రమే ఉంది. ఇందులో 16 లక్షల మంది భారతీయులే. 1970వ దశకం నుంచి కెనడాకు పెద్ద ఎత్తున భారతీయులు ఉద్యోగులు, చదువుల నిమిత్తం వలసపోయారు. ఆ తర్వాతే అక్కడే కెనడా పౌరసత్వం పొందారు. అంటే వారు భారత పౌరసత్వాన్ని వదులుకుని కెనడా పౌరులుగా నిలిచిపోయారు. కెనడా జనాభాలో దాదాపు 4 శాతం భారతీయులేనని తెలుస్తోంది. ఇక కెనడా భారతీయ జనాభాలో సిక్కులు 7,70,000 మందిగా ఉన్నారు. ముఖ్యంగా గత 20 ఏళ్ల నుంచి కెనడాలో సిక్కు జనాభా ఒక్కసారిగా రెండింతలు పెరిగింది. ఉన్నత విద్య, ఉద్యోగాల నిమిత్తం హరియాణా, పంజాబ్ నుంచి పెద్ద ఎత్తున కెనడాకు వలస వెళ్లి అక్కడే సెటిల్ అవుతున్నారు. ఈ నేపథ్యంలో కెనడాలో రాజకీయంగానూ సిక్కులు ప్రభావం చూపుతున్నారు. కెనడా పార్లమెంటులో 18 మంది సిక్కు ఎంపీలు ఉండటం గమనార్హం. ఈ 18 మంది ప్రస్తుతం ప్రధాని జస్టిన్ ట్రూడో ప్రభుత్వానికి మద్దతు ఇస్తున్నారు. అందుకే జస్టిన్ ట్రూడో సిక్కులను వెనకేసుకొస్తున్నారు. జస్టిన్ ట్రూడో 2015 అధికారంలోకి వచ్చిన నాటి నుంచి సిక్కులకు మరింత ప్రాధాన్యత పెరిగిపోయింది. సిక్కు వర్గం నుంచే కేవలం నలుగురు మంత్రులను నియమించారు. అత్యధికంగా సిక్కు వర్గం నుంచే నలుగురు మంత్రులు ఉండటం గమనార్హం. కెనడా జనాభాలో క్రిస్టియన్స్, ముస్లిం, హిందువుల తర్వాత సిక్కులు నాలుగో పెద్ద సమూహంగా ఉన్నారు. సిక్కులు ప్రధానంగా ఒంటారియో, బ్రిటీష్ కొలంబియా, అల్బెర్టాల్లో కేంద్రీకృతమై ఉన్నారు. పంజాబీ భాష కెనడాలో మూడో పాపులర్ భాషగా ఉండటం విశేషం. ముఖ్యంగా కెనడా నిర్మాణ రంగం, రవాణా, బ్యాంకింగ్ రంగాలలో సిక్కులు కెనడా ఆర్థికాభివృద్ధికి విశేష కృషి చేస్తున్నారు. చాలా మంది సిక్కులు హోటల్, రెస్టారెంట్, గ్యాస్ స్టేషన్ వ్యాపారాలను నిర్వహిస్తున్నారు. 1980లో కెనడాలో కేవలం 35 వేల మంది సిక్కులు మాత్రమే పౌరసత్వం పొందగా ప్రస్తుతం వారి సంఖ్య 4.15 లక్షల మంది శాశ్వత నివాసాన్ని పొందారు. సిక్కులు కెనడాలో ఇంతగా గుర్తింపు తెచ్చుకోవడానికి వారి గురుద్వారాలే కారణమని అంటున్నారు. గురుద్వారాల ద్వారా పెద్ద ఎత్తున సిక్కులు ఫండ్లు వసూలు చేస్తున్నారని చెబుతున్నారు. వాటిని పార్లమెంటు ఎన్నికల సమయంలో ఖర్చు పెడుతున్నారు. ఎన్నికల్లో బరిలోకి దిగి విజయాలు సాధిస్తున్నారు. దీంతో మద్దతు అవసరమైనప్పుడు ప్రధాన పార్టీలు సిక్కుల మద్దతును కోరుతున్నాయి. దీంతో వారికి ప్రాధాన్యత పెరిగిపోయింది.

# అడవిపై గొడ్డలి వేటు..!



భూపాలపల్లి : దట్టమైన పచ్చని అడవులు నరికివేతకు గురవుతున్నాయి. దట్టమైన అటవీ ప్రాంతంగా పేరొందిన జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని విలువైన అడవులు ఆనవాళ్లు లేకుండా పోయే ప్రమాదంలో పడ్డాయి. మొక్కల పెంపకంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతుంటే జిల్లాలో అందుకు భిన్నంగా కనపడుతోంది. అడవుల రక్షణలో శ్రద్ధ చూపకపోవడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. విలువైన టేకు, పెద్దేగి, జిట్రేగి తదితర కలపను కొందరు గుడిసెవాసులు బాహటంగా నరికివేస్తూ, ప్రభుత్వ భూముల్లో గుడిసెలు ఏర్పాటు చేసుకుంటున్నారు. గుడిసెలు వేసుకునేందుకు అనుకూలంగా ఉండే విధంగా చిన్న చిన్న కర్రలను ద్విచక్రవాహనాలు, ఆటోల ద్వారా అడవుల్లో నుంచి దాటిస్తున్నారు. కేటికే 6వ గని సమీపంలోని ప్రభుత్వ భూమి, పాత ఎర్రచెరువు శిఖం భూముల్లో సుమారుగా నాలుగు వేల వరకు గుడిసెలు వెలిశాయి. ఈ గుడిసెలన్నీ కర్రలతోనే ఏర్పాటు చేసుకున్నారు.

సోలార్ ప్లాంటేషన్ సమీప అడవుల్లో నుంచే భూపాలపల్లికి కూతవేటు దూరంలోనే మల్లంపెల్లి అటవీ బీట్‌లో దాదాపుగా 20 హెక్టారులకు పైగా విస్తీర్ణంలో అటవీ ప్లాంటేషన్‌లో గత 16 ఏళ్ల క్రితం నుంచి టేకు, జిట్రేగి, పెద్దేగి తదితర రకాల చెట్లను పెంచుతున్నారు. చెట్లు ఏపుగా పెరగడానికి వాటి చుట్టూ చిన్న చిన్న ముళ్ల పొదలు లేకుండా చేసి, నీటి నిల్వ కోసం కాంటూరు కందకాలు కూడా అటవీ అధికారులు తవ్వించారు. విలువైన టేకు చెట్లను కొందరు స్మగ్లర్లు రంపపు కోత యంత్రాల ద్వారా రాత్రి పూట నరికి వేస్తున్నారు. తాజాగా భూపాలపల్లి సమీపంలోని సోలార్ ప్లాంటేషన్ సమీపంలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న డంపింగ్ యార్డు వెనుక భాగంలోని మల్లంపల్లి అటవీ బీట్ పరిధిలో గత నెల రోజులుగా పెద్దఎత్తున చెట్లు నరికివేతకు గురయ్యాయి. కూలీలతో నరికివేస్తున్నా సంబంధిత అటవీ అధికారులు చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. నరికివేతకు గురైన టేకు చెట్ల మొదళ్లపై నంబర్లు వేస్తూ, అటవీ సిబ్బంది చేతులు దులుపుకొంటున్నారు. 17 ఏళ్ల కిందటే ఇదే మల్లంపెల్లి బీట్‌లోనే 12 హెక్టార్లలో సుమారు రూ. 10 లక్షల నిధులతో జామాయిల్ ప్లాంటేషన్ ఏర్పాటు చేశారు. అప్పట్లో వీఎస్ఎస్ ద్వారా జామాయిల్ మొక్కలను పెంచితే, నేడు దాదాపుగా సగానికి పైగా జామాయిల్ చెట్లు నరికివేతకు గురయ్యాయి. మరి కొన్ని చెట్లు ఈదురు గాలులకు విరిగిపోయాయి. లక్షల రూపాయలు వెచ్చించి పెంచిన జామాయిల్ ప్లాంటేషన్‌లో ఏపుగా పెరిగిన వాటిని నరికి వేసి, విక్రయిస్తే అటవీశాఖకు రెట్టింపు ఆదాయం వచ్చేది. ఇప్పటికైనా ఉన్న జామాయిల్ చెట్లు విరిగిపడక ముందే అటవీ అధికారులు నరికి వేసి, విక్రయిస్తే కొంత మేరకైనా అదాయం సమకూరుతుందని వీఎస్ఎస్ సభ్యులు తెలిపారు.

బాధ్యులపై చర్యలు తీసుకుంటాం– నరేశ్, అటవీ క్షేత్రఅధికారి, భూపాలపల్లిమల్లంపెల్లి అటవీ బీట్‌లో గుడిసెల పేరుతో చెట్లు నరికివేతకు గురికాకుండా గత నెలలోనే ప్రత్యేకంగా సిబ్బందిని నియమిఁచి, నిఘా పెట్టాం. అయితే కొందరు గుడిసెవాసులు చిన్న చిన్న కలప దుంగలను తీసుకెళ్లకుండా తమ సిబ్బంది అడ్డుకున్నారు. సమాచారం అందింది. అయినా విచారించి బాధ్యులపై చర్యలు తీసుకుంటాం. అడవుల్లో చెట్లను నరికివేస్తున్నట్లు గాని, కలప అక్రమ రవాణా జరిగితే గ్రామస్థులు సమాచారం ఇవ్వాలి.

'పోడు' ఆశతో చెట్ల నరికివేతఅజాంనగర్–కేశవాపూర్ సమీపంలో ఘటనఅడవుల పరిరక్షణ కోసం ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపేందుకు పోడు హక్కు పత్రాల ఇచ్చేందుకు కసరత్తు చేస్తోంది. మరోవైపు కొన్ని ప్రాంతాల్లోని అడవుల్లో చెట్లపై గొడ్డలి వేటు ఆగడం లేదు. తాజాగా భూపాలపల్లి మండలంలోని ఆజాంనగర్–మహాముత్తారం మండలం కేశవాపూర్ సమీప అడవుల్లో చెట్లను నరికేశారు. పత్రాల ప్రక్రియ కొనసాగుతున్న వేళ పోడు జరగడం అడవులకు రక్షణ లేకుండా పోతోందనే భావన కలుగుతోంది.

కాల్చేందుకు సిద్ధం చేసి..

అజాంనగర్–కేశవాపూర్ మార్గంలోని సమీప అటవీ ప్రాంతంలో తాజాగా పోడు జరిగింది. అధికారులు కూడా సందర్శించి గుర్తించినట్లు తెలుస్తోంది. ఈప్రాంతంలో దాదాపు 30 ఎకరాలకు పైగానే చెట్లను నరికి అలాగే వదిలేశారు. కొన్నిరోజులు ఆగాక మంటలు పెట్టి కాల్చేందుకు సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది. పగలంతా అటవీ అధికారులు ఈ ప్రాంతంలో తిరగాడుతారు. రాత్రిపూటనే అడవుల్లోకి వెళ్లి ఇష్టారీతిన చెట్లను నరికేస్తున్నారు. గతంలోనూ ఈ ప్రాంతంలో అడవులను పోడు చేశారు. అధికారులు కేసులు నమోదుచేసి అవగాహన కల్పించారు. తిరిగి ఇదే ప్రాంతంలో అడవిని నరికారు.

జిల్లాలో పోడు కేసులు నమోదు అవుతున్నా భయంలేకుండా పోడు చేస్తున్నారు. 2005కు ముందు పోడు చేసిన భూముల్లో సాగు చేసుకుంటున్న గిరిజనులు, మూడు తరాలుగా సాగులో ఉన్నవారికి హక్కు పత్రాలకు అర్హులు. ప్రస్తుతం హక్కుపత్రాల కోసం అర్హుల జాబితా తయారవుతోంది. అయితే ప్రభుత్వం మళ్లీ అవకాశం ఇస్తే పోడు భూములకు హక్కులు కలుగుతాయని భావించి పోడు చేస్తున్నట్లు సమాచారం. దీనికి కొందరు అటవీ సిబ్బంది కూడా సహకరిస్తున్నట్లుగా తెలిసింది.

అవగాహన ముఖ్యం

సర్వే ఆరంభం నుంచి జిల్లాలోని భూపాలపల్లి, మహాముత్తారం, మహాదేవపూర్, పలిమెల, కాటారం, మల్హార్, టేకుమట్ల, తదితర మండలాల్లో పోడు సమస్య ఎదురవుతోంది. సర్వే పూర్తయినా సమస్య పరిష్కారం కావడం లేదు. అక్కడక్కడా పోడు జరుగుతూనే ఉంది. అయితే ఆ భూములు తమకే దక్కుతాయనే అపోహ కూడా ఉంటోంది. అడవులను నరికితే ఎలాంటి కేసులు ఉంటాయి, పోడుహక్కులు ఎలా దక్కుతాయి, అడవులను రక్షించడం వల్ల ప్రజలకు కలిగే ప్రయోజనాలు, తదితర అంశాలపై అటవీ ప్రాంతాల వారికి అవగాహన కల్పించాలి.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం– సత్యనారాయణ, ఎఫ్ఆర్వో అజాంనగర్

అటవీ ప్రాంతంలో పరిశీలన చేస్తాం. ఎక్కడెక్కడ చెట్లను నరికారు, ఎంతమేర పోడు జరిగింది అనే వివరాలను సేకరిస్తాం. చెట్లను నరికితే కఠిన చర్యలు తీసకుంటాం. అటవీ ప్రాంత గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టేందుకు ప్రణాళికలు చేస్తున్నాం. అటవీ చట్టాలపై అవగాహన కల్పిస్తాం.

# 'సీతారామా'.. రైతన్నకేదీ ధీమా!



జయశంకర్ : దేవాదుల ప్రాజెక్టుకు సంబంధించిన ప్రధాన రిజర్వాయర్ భూపాలపల్లి మండలంలో ఉంది. వివిధ జిల్లాలకు ఇక్కడి నుంచే నీటిని ఎత్తిపోస్తారు. కానీ, భూపాలపల్లి మండలానికి ఎలాంటి ప్రయోజనం కలగడం లేదు.. ఈ నేపథ్యంలో భూపాలపల్లి, మహాముత్తారం మండలాలకు సాగునీరు అందించడానికి భూపాలపల్లి మండలం గొల్లబుద్ధారంలో సీతారామ ఎత్తిపోతల పథకానికి శ్రీకారం చుట్టారు. దాదాపు ఐదేళ్లు అవుతున్నా పథకం పనులు పూర్తికాలేదు. దీంతో రైతులు సాగునీటికి ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంటోంది.

5 వేల ఎకరాలు లక్ష్యంగా..

ఈ ఎత్తిపోతల పథకం ద్వారా భూపాలపల్లి మండలంలోని గొల్లబుద్ధారం, దూదేకులపల్లి, దీక్షకుంట, మహాముత్తారం మండలంలోని గండికామారం గ్రామాల్లోని 5 వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు లక్ష్యం పెట్టుకున్నారు. 2019లో రూ.64 కోట్ల అంచనా వ్యయంతో పనులు ప్రారంభించారు. కానీ, ఇప్పటికీ కొనసాగుతున్నాయి. గొల్లబుద్ధారంలోని భీంఘన్‌పూర్ రిజర్వాయర్ వద్ద నిర్మిస్తున్న పంప్‌హౌస్‌లో 7 మోటార్ల ద్వారా ఆయా గ్రామాలకు నీటిని పంపింగ్ చేయాల్సి ఉంటుంది. గండికామారం, గొల్లబుద్ధారం గ్రామాలకు మూడు పంపులు, దీక్షకుంట, కొత్త తండా గ్రామాలకు రెండు పంపులు, దీక్షకుంట, గొల్లబుద్ధారం రెండు పంపుల ద్వారా 0.5 టీఎంసీల సాగునీటిని పంపిణీ చేస్తారు. ఇందుకోసం 9 కి.మీ మేర ప్రధాన పంపులైను నిర్మాణం పూర్తి చేశారు. పైప్‌లైన్ ద్వారా పొలాలకు సాగునీటిని మళ్లించేందుకు ప్రతి 250–300 మీటర్ల దూరంలో డెలివరీ సిస్టర్న్‌లను ఏర్పాటు చేశారు.

అటవీ అనుమతులు రాక..

ప్రధాన పైప్‌లైన్‌తో పాటు ఆయా గ్రామాల్లో 10 కుంటలకు నీటిని తరలించేందుకు మరో 25 కిలోమీటర్ల పైప్‌లైన్, గ్రావిటీ కాల్వలు నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఇందులో 7 కి.మీ మేర పైప్‌లైన్, 6 కి.మీ మేర గ్రావిటీ కాల్వలు పూర్తయ్యాయి. మిగిలిన 10 కి.మీ మేర పైప్‌లైన్ నిర్మాణం ఆగిపోయింది. అటవీ అనుమతులు రాకపోవడంతో పనులు నిలిచిపోయాయి. పనులు వెంటనే పూర్తిచేసి వచ్చే సీజన్‌కైనా సాగునీరు అందుతుందని రైతులు అంటున్నారు.

ప్రస్తుత పరిస్థితి.. పంప్‌హౌస్‌లో మోటార్ల బిగింపు పనులు పూర్తయ్యాయి. కంట్రోల్ రూం ప్యానళ్ల బిగింపు పనులు కొనసాగుతున్నాయి.

పంప్‌హౌస్‌లో చేరిన పూడికను తొలగిస్తున్నారు. ఇంజినీర్ల భవనం పూర్తికావస్తోంది. 11 కేవీ ఉప కేంద్రంలో నియంత్రికలు బిగించారు. విద్యుత్తు లైన్లను ఏర్పాటు చేయాల్సి ఉంది.

10 కిలోమీటర్ల మేర పైప్‌లైన్ నిర్మించాల్సి ఉంది.

సాగునీటిని అందించాలి.. –భూక్య మామ్‌జీ నాయక్, రైతు దీక్షకుంట

సీతారామ ఎత్తిపోతల పథకం పనులు పూర్తిచేసి సాగునీటిని అందించాలి. పథకం నీటికోసం రైతులు ఎదురుచూస్తున్నారు. దీక్షకుంట, శనిగలకుంట, దూదేకులపల్లి, గండికామారంలో నాలుగు కుంటలను నింపేందుకు అవకాశం ఉంది. ప్రాజెక్టును త్వరితగతిన పూర్తిచేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. జూన్ కల్లా పూర్తిచేస్తాం –రాజయ్య, సీతారామ ఎత్తిపోతల పథకం

ఎత్తిపోతల పథకం పనులను కరోనా కారణంగా రెండేళ్లు చేయలేకపోయాం. తర్వాత వేగవంతం చేశాం. దాదాపు చివరి దశకు వచ్చాయి. అటవీ అనుమతులు రాక పైప్‌లైన్ నిర్మాణం జాప్యమైంది. అటవీ అనుమతుల ప్రక్రియ పూర్తికావచ్చింది. వచ్చే జూన్ కల్లా పనులను పూర్తి చేసి పథకం అందుబాటులోకి తెస్తాం.

# కొత్త మార్గంలో కార్గో!

వరంగల్ : కొవిడ్ నుంచి ఆర్టీసీ తన నష్టాలను పూడ్చుకునేందుకు రకరకాల ప్రయత్నాలు చేస్తోంది. దీనిలో భాగంగానే 2020 జూన్‌లో కార్గో పార్శిల్ సేవలను ప్రారంభించింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 9 డిపోల పరిధిలో 11 చోట్ల ఈ సేవలకు శ్రీకారం చుట్టింది. ప్రారంభించిన తొలినాళ్లలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రోజుకు రూ. 5వేల నుంచి రూ. 6 వేల వరకు ఆదాయం వచ్చేది. ప్రస్తుతం రూ. 1.50లక్షల నుంచి రూ. 1.60 లక్షలకు పైగా ప్రతిరోజూ సమకూరుతోంది. డిపో పరిధిలో ఒక మార్కెటింగ్ ఎగ్జిక్యూటీవ్ అధికారితో పాటు ఆర్టీసీ పొరుగు సేవల సిబ్బందిని ఈ సేవల కోసం ప్రత్యేకంగా నియమించారు. ఇటీవల కార్గోను లాజిస్టిక్‌గా మార్చిన అధికారులు దీనిని ప్రైవేటు ఏజెంట్లకు అప్పగించేందుకు రంగం సిద్ధం చేసినట్లు సమాచారం.

ఆర్టీసీ అధికారుల పర్యవేక్షణ

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని భూపాలపల్లి, జనగామ, మహబూబాబాద్, నర్సంపేట, తొర్రూరు, పరకాల, ములుగు ప్రాంతాల్లోని కార్గోలను కమీషన్ బేసిక్‌పై ఇప్పటికే ప్రైవేటు వ్యక్తులకు అప్పగించారు. అత్యధిక ఆదాయం వచ్చే హనుమకొండ, వరంగల్ కేంద్రాలను ఆర్టీసీ నిర్వహిస్తోంది. త్వరలోనే వీటిని కూడా ప్రైవేటు వారికి అప్పగించేందుకు రంగం సిద్ధం చేసినట్లు తెలిసింది. ఏజెంట్లకు అప్పగిస్తే ఇప్పుడున్న ఆదాయానికంటే మరింత ఎక్కువగా వచ్చే అవకాశం ఉందని ఆర్టీసీ



లెక్కలేస్తోంది. ఏజెంట్లకు అప్పగించడం వలన సిబ్బందిని వారే నియమించుకుంటారు. వీరిపై ఆర్టీసీకి చెందిన మార్కెటింగ్ అధికారి పర్యవేక్షణ చేస్తారు.

అధిక ఆదాయం వస్తుందనీ..

లాజిస్టిక్ కేంద్రాలను ప్రైవేటు వ్యక్తులకు 12 శాతం కమీషన్‌పై అప్పగించనున్నట్లు సమాచారం. దీనికి తోడు కేంద్రం నిర్వహణకు అద్దె చెల్లించడంతో పాటు పార్శిళ్ల ద్వారా వచ్చే ఆదాయంలోనూ ఆర్టీసీకి వాటా వస్తుందని అధికారులు చెబుతున్నారు. కరోనా సమయంలో బస్సులు సరిగా నడవలేని సమయంలో ఆర్టీసీ సిబ్బందిని కార్గో సేవలకు వినియోగించామని, ప్రస్తుతం వందశాతం బస్సులు నడుస్తుండడంతో.. తిరిగి వారి విధులనే కేటాయిస్తున్నామని పేర్కొంటున్నారు. అత్యధికంగా ఆదాయం వచ్చే కేంద్రాలను ప్రైవేటుకు అప్పగించడం సమంజసం కాదని సిబ్బంది ఆరోపిస్తున్నారు.

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే..– ఎం.వేణుగోపాల్, ఏటీఎం, లాజిస్టిక్ వరంగల్ రీజియన్ అధికారి

ఇప్పటికే హనుమకొండ, వరంగల్ మినహా అన్నికేంద్రాలు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే ప్రైవేటుకు అప్పగించాం. కొవిడ్ సమయంలో ఆర్టీసీ బస్సులు పూర్తిస్థాయిలో నడపకపోవడంతో.. సిబ్బందిని కార్గో సేవలకు ఉపయోగించాం. ప్రస్తుతం బస్సులు పూర్తిస్థాయిలో నడుస్తున్నాయి. లాజిస్టిక్ కేంద్రాలు ఇతరులకు అప్పగించడం వలన కార్యాలయాలకు అద్దెతో పాటు ఇతర ఆదాయం వచ్చే అవకాశం ఉంది. ప్రైవేటుకు అప్పగించినా పూర్తిస్థాయిలో ఆర్టీసీ అధికారులే పర్యవేక్షిస్తారు.

# పది పరీక్షలకు ఈసారీ ప్రయాసే..

వరంగల్ : కన్నాయిగూడెం మండలానికి చెందిన పదో తరగతి విద్యార్థులకు ఈ ఏడాది కూడా కష్టాలు తప్పేలా లేవు. వార్షిక పరీక్షలు రాయడానికి 30 కి.మీ దూరంలోని ఏటూరునాగారం వెళ్లాల్సిందే. ఈసారి కూడా స్థానికంగా పరీక్ష కేంద్రం ఏర్పాటు చేయలేదు. ఉమ్మడి మండలంగా ఉన్నప్పటి నుంచి ఇలా వ్యయ, ప్రయాసలకు ఓర్చి పరీక్షలు రాయాల్సి వస్తోంది. కన్నాయిగూడెం మండలంగా ఏర్పడి ఏడేళ్లు దాటినా పరిస్థితులు మారడం లేదు. ప్రతి రోజూ అంత దూరం వెళ్లి రావడమే అసలైన పరీక్షగా మారింది.

నాలుగు పాఠశాలలు.. 70 మంది విద్యార్థులు

ముప్పనపల్లి, గూర్రెవుల జడ్పీ ఉన్నత పాఠశాలలు, బుట్టాయిగూడెంలోని కేజీబీవీ, కన్నాయిగూడెం ఆశ్రమ పాఠశాల విద్యార్థులు ప్రతి ఏడాది పదో తరగతి వార్షిక పరీక్షలకు హాజరవుతుంటారు. ఈ ఏడాది నాలుగు పాఠశాలలల నుంచి మొత్తం 70 మంది పరీక్షలకు హాజరుకానున్నారు. పరీక్షలపై దృష్టిపెట్టాల్సిన విద్యార్థులు ఇలా రవాణా, ఖర్చులపై కంగారు పడాల్సి వస్తోంది.

తప్పని ఇబ్బందులు

మండలానికి చెందిన ఆశ్రమ పాఠశాల విద్యార్థులను సంబంధిత ప్రధానోపాధ్యాయులు సొంత ఖర్చులతో ప్రతి రోజు ప్రైవేటు వాహనంలో కేంద్రానికి తీసుకెళ్లి పరీక్ష రాశాక తీసుకురావాల్సి వస్తోంది. మిగతా పాఠశాలల విద్యార్థులు పరీక్షలు అయ్యే వరకు ఏటూరునా



గారంలోనే ఉంటూ రాస్తున్నారు. తల్లిదండ్రులు, బంధువులు రోజు తీసుకెళ్లి తీసుకువస్తారు. ఇలా వ్యయ, ప్రయాసలకు ఓర్చి పరీక్షలు పూర్తి చేయాల్సి వస్తోంది.

ఇవీ నిబంధనలు

పదో తరగతి పరీక్ష కేంద్రం మంజూరు చేయాలంటే పలు నిబంధనలు ఉన్నాయి. విద్యార్థుల సంఖ్య వందకు పైగా ఉండాలి. ప్రశ్నాపత్రాలకు భద్రత కోసం ఏడు కి.మీ లోపు పోలీస్‌స్టేషన్ సౌకర్యం ఉండాలి. ఈ రెండింటిలో ఏది లేకపోయినా కేంద్రం ఏర్పాటుకు అనుమతులు రావు.

మాకు స్థానికంగా పరీక్ష కేంద్రం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు స్పందించి వెంటనే కేంద్రం ఏర్పాటు చేయాలి.

సుమలత, విద్యార్థిని

పరీక్షలు స్థానికంగా నిర్వహించాలని జిల్లా స్థాయి విద్యా అధికారులను గతంలోనే కోరాం. వచ్చి వివరాలను తీసుకుని వెళ్లారు. కానీ ఎలాంటి చర్యలు చేపట్టలేదు.

మల్లయ్య, హెచ్ఎమ్, ముప్పనపల్లి

సొంత ఖర్చులతోనే తీసుకెళ్తాం

– సంతోష్, హెచ్ఎమ్, కన్నాయిగూడెం ప్రతి రోజు పిల్లలను తీసుకెళ్లి పరీక్ష రాయించి తీసుకువస్తాం. రోజు రూ.1000 ఖర్చు అవుతుంది. గతంలో బిల్లులు మంజూరు చేయలేదు. ఈ సారి రవాణా ఖర్చులు చెల్లిస్తామని ఉన్నతాధికారులు తెలిపారు.

# సమస్యలు అనేకం... పరిష్కారం గగనం

గోదావరిఖని : నగరంలో వివిధ సమస్యలతో తాము అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ప్రజలు అంటున్నారు. కనీస మౌలిక వసతులు కల్పించడంలో అధికారులు, పాలకులు దృష్టి సారించడం లేదని ఆరోపిస్తున్నారు. పారిశ్రామిక ప్రాంతంగా పేరుగడించినా క్షేత్రస్థాయిలో అభివృద్ధి పనులు నామమాత్రంగా సాగుతున్నాయని చెబుతున్నారు. పాలకులు, ఉన్నతాధికారులు స్పందించి పరిష్కారానికి చొరవ చూపాలని కోరుతున్నారు.

వరదలా... తాగునీరు

గోదావరిఖని కాకతీయనగర్ ప్రధాన రహదారిలోని నీటి సరఫరా ప్రధాన పైపులైను లీకేజీతో తాగునీరంతా రోడ్డుపై పారుతోంది. ఆయా ప్రాంతాల్లోని వారికి ఇళ్లల్లోని కొళాయిల్లో తాగునీరు సన్నని ధారగా వస్తోంది. లీకేజీ నీటి కారణంగా రహదారి బురదమయం అవుతోంది. నగరపాలక అధికారులు స్పందించి లీకేజీకి మరమ్మతు చేసి తాగునీటి వృథాను అరికట్టాల్సి ఉంది.

మట్టి తొలగించక ఇబ్బందులు

గోదావరిఖని కళ్యాన్‌నగర్‌లోని ఊర్వశి థియేటరు ముందు సీసీ రోడ్డు నిర్మించిన గుత్తేదారు క్యూరింగ్ కోసం వేసిన మట్టి తొలగించకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. వర్షం కురిస్తే రోడ్డంతా బురదమయం అవుతోంది. క్యూరింగ్ పూర్తయ్యాక వెంటనే రోడ్డుపై ఉన్న మట్టిని తొలగించాల్సి ఉండగా గుత్తేదారుతో పాటు నగరపాలక అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివిధ ప్రాంతాలనుంచి కళ్యాన్‌నగర్‌కు వచ్చే వారు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు.



అప్రోచ్ రోడ్డు బురదమయం

అడ్డగుంటపల్లి నుంచి కాకతీయనగర్ మీదుగా రమేశ్‌నగర్ తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రధాన రహదారిలోని వంతెన నిర్మాణానికి ఎంతో కాలం పట్టింది. నిర్మాణం పూర్తయ్యాక అప్రోచు రోడ్డును నిర్మించలేదు. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మొన్నటి వరకు వంతెన నిర్మాణం పనులతో, పనులు పూర్తయ్యాక అప్రోచు రోడ్డు బురదమయం కావడంతో ఆదర్శ పాఠశాలకు పిల్లలను తీసుకెళ్లే బస్సు అటువైపు వెళ్లలేదు. ఆయా ప్రాంతాలకు చెందిన విద్యార్థులు రమేశ్‌నగర్ కూడలి వరకు నడిచి వెళ్లాల్సి వస్తుంది.

మార్కెట్ రోడ్డులో ట్రాఫిక్ కష్టాలు

నగరపాలక కూరగాయల మార్కెట్ రోడ్డులో ప్రతి రోజు ట్రాఫిక్ కష్టాలు తప్పడం లేదు. తెల్లవారు జాముకల్లా వివిధ గ్రామాల నుంచి కూరగాయలను తెచ్చే వాహనాలకు పార్కింగ్ సదుపాయం లేకపోవడంతో మార్కెట్ ప్రహరీ పక్కన రోడ్డుపైనే నిలుపుతున్నారు. మార్కెట్ రోడ్డునకు మరో వైపు ఉన్న చికెన్ సెంటర్లకు కోళ్లను సరఫరా చేసే వాహనాలను అటువైపు నిలుపుతున్నారు. ఈ వాహనాల మధ్యలోంచి బయటకు వెళ్లేందుకు ఇతర వాహనదారులు అవస్థలు పడాల్సి వస్తోంది. మార్కెట్‌లోకి వచ్చే భారీ వాహనాలకు పార్కింగ్ సదుపాయం కల్పిస్తే ఈ సమస్య తీరనుంది.

# ఆఖరి మజిలీలో అవస్థలు

సిరిసిల్ల: ఆఖరి మజిలీలో అవస్థలు తప్పడం లేదు. అంత్యక్రియల్లో ఎలాంటి అడ్డంకులు లేకుండా సాఫీగా నిర్వహించాలనే ఉద్దేశంతో ప్రతీ గ్రామానికి వైకుంఠధామాలను నిర్మించారు. తొలుత ఒక్కో నిర్మాణానికి రూ.9.5 లక్షలు మంజూరు చేశారు. ఈ నిధులు సరిపోవడం లేదని పలుమార్లు జిల్లా పరిషత్తు సమావేశంలో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొచ్చారు. తర్వాత నిర్మాణ వ్యయాన్ని రూ.11.50 లక్షలకు పెంచారు. జిల్లా వ్యాప్తంగా 255 పంచాయతీల్లో రూ.28.01 కోట్లు ఖర్చు చేశారు. పనులు పూర్తయి దాదాపు మూడేళ్లవుతోంది. వీటిలో కొన్నిచోట్ల మాత్రమే అంత్యక్రియలు నిర్వహిస్తున్నారు. సింహభాగం నిరుపయోగంగా మారాయి. వర్షాకాలంలో గ్రామాల్లో అంత్యక్రియల నిర్వహణ అవస్థలు అన్నీ ఇన్నీకావు. కారణం వైకుంఠధామాల నిర్మాణాలు చాలా చోట్ల చెరువు శిఖం.. వాగుల ఒడ్డున నిర్మించారు. వర్షాలు వరదలకు చాలా చోట్ల ప్రారంభించకుండానే పగుళ్లుబారాయి. మరికొన్ని నీళ్లలో మునిగి ఉన్నాయి. కొన్నింటికైతే అక్కడికి వెళ్లేందుకు దారి సౌకర్యం లేదు. నిర్మాణాలు బాగా ఉన్న చోట విద్యుత్తు, నీటి వసతి వంటి సౌకర్యాలు లేవు. దీంతో ఎప్పటి మాదిరిగానే తమ పంట పొలాలు.. ముంపు ప్రాంతం లేని చోట అంత్యక్రియలు నిర్వహిస్తున్నారు.

కొరవడిన ప్రణాళిక మొదటి నుంచి వైకుంఠధామాల నిర్మాణంలో ప్రణాళిక లోపం కనిపిస్తోంది. ప్రభుత్వం నిధులు మంజూరు చేసినపుడే నిర్మాణాలకు అనువైన స్థలాలను సేకరించాలని రెవెన్యూశాఖకు సూచించింది. అవసరమైతే దాతల సాయం తీసుకోవాలని చెప్పారు కానీ.. ప్రభుత్వ స్థలాలుగా ఉన్న చెరువు శిఖం, వాగుల ఒడ్డున చూపించారు. తొలుత నిర్మాణాలకే నిధులు మంజూరు చేశారు. అందులో నీటి వసతి, విద్యుత్తు సౌకర్యాల ఊసేలేదు. తరువాత పంచాయతీల సాధారణ నిధులతో మిగతా పనులు చేయించాలని సూచించారు. పనులు ప్రారంభించే ముందు జలవనరులశాఖ అనుమతులు తీసుకోవాలి. చెరువు శిఖంలో నీటి నిల్వ సామర్థ్యం ఎంతమేరకు ఉంటుంది. నిర్మాణం చేపడితే నీట మునిగే అవకాశాలపై వారిని సూచనలతో నిర్మాణాలు చేపట్టాల్సి ఉంది. ఇవేవీ పట్టించుకోకుండా ఆయా మండలాల రెవెన్యూ అధికారులు ఎక్కడ స్థలాలు చూపిస్తే అక్కడ నిర్మించారు. ముంపు ప్రాంతాలకు ముందస్తుగా పసిగట్టకపోవడంతో వైకుంఠధామాలు నీటిలో మునిగిపోతున్నాయి. నిర్మాణాలు చేసే సమయంలో సంబంధిత ఇంజినీరింగ్ అధికారులూ ఎలాంటి అభ్యంతరం చెప్పకపోవడమూ గమనార్హం. అధికారులు మాత్రం పనులు పూర్తయ్యాయి. వాటినినిర్వహించుకోవాల్సిన బాధ్యత పంచాయతీలపైనే ఉందంటూ సమాధానమిస్తున్నారు. తంగళ్లపల్లి మండలం పద్మానగర్‌లో రూ.9.5 లక్షల వ్యయంతో నిర్మించిన వైకుంఠధామం. దీని పక్కనే పంచాయతీ డంపింగ్‌యార్డు కూడా ఉంది. ఇవి రెండూ పూర్తిగా చెరువు శిఖంలో నిర్మించారు. ఏటా వర్షాకాలం పూర్తయ్యే వరకు ఇలా నీటిలోనే ఉంటాయి. తర్వాత తేరుకున్నా.. ఇక్కడ అంత్యక్రియలు చేయలేని పరిస్థితి. మూడేళ్ల క్రితమే నిర్మాణం పూర్తయినా ఇప్పటికీ ప్రారంభానికి నోచుకోలేదు. వీర్నపల్లి మండలం శాంతినగర్‌లో వైకుంఠధామానికి వెళ్లాలంటే జినిగాలవాగు దాటి వెళ్లాలి. చిన్నపాటి వర్షం కురిసినా వాగు ప్రవహిస్తుంది.

# దడ పుట్టిస్తున్న సన్న బియ్యం!



హుజూరాబాద్: సన్న బియ్యం ధరలకు రెక్కలు రావడం సామాన్య, మధ్య తరగతి ప్రజలకు దడ పుట్టిస్తోంది. కేవలం నాలుగు నెలల వ్యవధిలోనే క్వింటాకు 1,000 నుంచి రూ.1,300 పెరగడం ఆందోళన కలిగిస్తోంది. సన్నరకాల సాగు తక్కువగా ఉండటం వల్లే ధరలు పెరుగుతున్నాయని వ్యాపారులు చెబుతుండగా.. సామాన్యులపై మరింత ఆర్థిక భారం పడి కుటుంబ బడ్జెట్ మార్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఉమ్మడి జిల్లాలో 12.35 లక్షల కుటుంబాలు, 36 లక్షల జనాభా ఉంది. వీరికి నెలకు సగటున సుమారు 23 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం అవసరం. 70 శాతం కుటుంబాలు సన్నరకం బియ్యాన్ని వినియోగిస్తున్నారు. అంటే నెలకు సుమారు 16 లక్షల మెట్రిక్ టన్నుల సన్న బియ్యం అవసరం. గత జనవరి వరకు క్వింటా ధర రూ.3,200 నుంచి రూ.3,400 పలికింది. అదే పాత బియ్యం రూ.4,200 నుంచి రూ.4,500 చొప్పున పలికింది. ఆ తర్వాత నాలుగు నెలల వ్యవధిలోనే కొద్దికొద్దిగా పెరుగుతూ వస్తోంది. ప్రస్తుతం పాత బియ్యం క్వింటా ధర గరిష్ఠంగా రూ.5,500 నుంచి రూ.5,800 పలుకుతోంది. ఈ లెక్కన ప్రజలపై ఏ స్థాయిలో ఆర్థిక భారం పడుతుందో అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికే అన్ని రకాల నిత్యావసర సరకుల ధరలు పెరిగిన నేపథ్యంలో సన్న బియ్యం ధర కూడా పెరగడంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ధరలు దిగిరాకున్నా నిలకడగానైనా ఉంటాయా? అనేది తెలియని పరిస్థితి.. మరోవైపు నిల్వలు తక్కువగా ఉండటంతో రాబోయే రోజుల్లో ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నారు. ఇదే అదనుగా కొందరు వ్యాపారులు సన్న బియ్యానికి కృత్రిమ కొరత సృష్టించి రహస్య గోదాముల్లో నిల్వ చేసినట్లు సమాచారం. 70 శాతం దొడ్డు రకాల సాగు : ఉమ్మడి జిల్లాలో సన్నాల సాగు తగ్గుతోంది. మొత్తం వరి సాగు విస్తీర్ణంలో 70 శాతం దొడ్డు రకాలే సాగు చేస్తుండగా 30 శాతం మాత్రమే బీపీటీ, ఆర్ఎన్ఆర్, హెచ్ఎంటి, జేజీఎల్, వరంగల్ కల్చర్ వంటి సన్న రకాలను పండిస్తున్నారు. దొడ్డు రకాలు పండిస్తే ఎకరాకు రూ.23 వేలు పెట్టుబడి అవుతుండగా 25-28 క్వింటాళ్ల ధాన్యం దిగుబడి వస్తోంది. సన్నాల సాగు ఖర్చు, శ్రమతో కూడుకున్న పని.. పైగా దిగుబడి కూడా తక్కువే. చీడపీడల బెడద అధికం.. సన్నాల సాగుకు ఎకరాకు రూ.30 వేలు పెట్టుబడి పెట్టినా 18-20 క్వింటాళ్లకు మించి దిగుబడి వచ్చే పరిస్థితి లేదు. వీటన్నింటిని భరించి పండించినా సన్నాలకు, దొడ్డు రకాలకు చెల్లించే ప్రభుత్వ మద్దతు ధరలో వ్యత్యాసం ఏమీ లేదు. అందుకే అత్యధిక శాతం రైతులు దొడ్డు రకాల సాగుకే మొగ్గు చూపుతున్నారు. గత యాసంగిలో ప్రభుత్వ రంగ సంస్థల కొనుగోలు కేంద్రాల ద్వారా ఉమ్మడి జిల్లాలో 12,61,030 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించగా అందులో దాదాపు అత్యధికం దొడ్డు రకాలే ఉన్నాయి. రెండేళ్ల క్రితం వరకు సన్నాలు సాగు చేయాలనే ప్రభుత్వ సూచన మేరకు చాలామంది రైతులు పండించారు. దాదాపు మూణ్నాలుగు లక్షల మెట్రిక్ టన్నుల వరకు విక్రయించారు. కానీ దొడ్డు రకాలతో సమానంగా సన్నాలకు మద్దతు ధర చెల్లించడంతో రైతులు ఆలోచనలో పడ్డారు. సన్నాల సాగు తగ్గించి దొడ్డు రకాలకే ప్రాధాన్యమిస్తున్నారు.

ధరల నియంత్రణపై చర్యలేవీ? : ధరల నియంత్రణపై సంబంధిత అధికారుల పర్యవేక్షణ పూర్తిగా కొరవడింది. అందువల్లే వ్యాపారులు ఇష్టారీతిన ధరలు పెంచి నిత్యావసరాలను బహిరంగ మార్కెట్‌లో విక్రయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఉన్నతాధికారులు ప్రతీ నెలా సమీక్ష సమావేశం నిర్వహించి ప్రస్తుతం ఉన్న ధరలు, క్రయ విక్రయాలపై చర్చించాలి. ఒకవేళ ధరలు పెరిగితే కారణాలు ఏమిటనే విషయంపై వ్యాపారులతో చర్చించాలి. వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు తీసుకోవాలి. కానీ ఇవేమీ ఉమ్మడి జిల్లాలో కనిపించకపోవడంతో ధరల పెరుగుదలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. పైగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎలాంటి అనుమతులు లేకుండా రైస్ డిపోలను ఏర్పాటు చేసి అక్రమంగా బియ్యం విక్రయిస్తున్నారు. తూకంలోనూ మోసాలపై అనుమానాలున్నాయి. నియంత్రించాల్సిన ఆయా శాఖల అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండటం వల్లే ధరల నియంత్రణ, తూకంలో వ్యత్యాసాలకు అడ్డుకట్ట పడటం లేదు.

# ప్రగతి పనులకు టెండర్!



జగిత్యాల : రామడుగు మండలం దత్తోజిపేట సమీపంలోని రోడ్డుపై కల్వర్టు నిర్మించడానికి రూ.70 లక్షలు మంజూరయ్యాయి. టెండర్ దిశగా అడుగులు పడకపోవడంతో సమీప గ్రామాల ప్రజలు అవస్థల ప్రయాణాన్ని సాగిస్తున్నారు. అగ్రిమెంట్, టెండర్ల ఏర్పాటు దిశగా ప్రక్రియ కొనసాగినప్పటికీ పనిని తీసుకునేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో ఇక్కడి సమస్య అలాగే ఉంది. ఇటీవల కురిసిన వర్షాలకు పూర్తిగా దెబ్బతిన్న రహదారిపై ఇకనైనా పైపులు వేసి వరద ప్రవాహం వెళ్లే నిర్మాణాన్ని చేపట్టకపోతే ఉన్న దారి ఈ వానాకాలంలో పూర్తిగా కొట్టుకుపోయే ప్రమాదముంది.

పెద్దపల్లి జిల్లా గర్రెపల్లి సమీకృత మార్కెట్ నిర్మాణం కోసం ఈ స్థలాన్ని కేటాయించారు. రూర్బన్ నిధుల నుంచి రూ.15 లక్షలు వెచ్చించాలని భావించారు. ఇదే చోట రూ.60 లక్షల నిర్మాణ వ్యయంతో ఆధునిక ఆడిటోరియాన్ని నిర్మించాలని భావించినా గడచిన రెండేళ్లుగా ఎక్కడి పనులక్కడే అనే విధంగా ఇక్కడి పరిస్థితి మారిపోయింది. టెండర్లు పూర్తయినా అవసరమైన పనుల్ని చేపట్టడంలో జాప్యం వల్ల ఇబ్బంది పెరుగుతోంది. 'పనులు తీసుకుని మొదలు పెట్టకుండా గుత్తేదారులు జాప్యం చేస్తే వారికి నోటీసులు ఇచ్చి కాంట్రాక్టులు రద్దు చేయాలి.. తిరిగి మళ్లీ టెండర్లు పిలవాలి' అని తరచూ నాలుగు జిల్లాల కలెక్టర్లు, ప్రజాప్రతినిధులు సమీక్షల్లో ఆయా శాఖల అధికారుల్ని ఆదేశిస్తున్నారు. అయినా ఉమ్మడి జిల్లాలో ఏ ఒక్కచోట అనుకున్న విధంగా మార్పు కనిపించడం లేదు. కీలకమైన శాఖల్లో పనుల పురోగతి మందగమనంతో సాగుతోంది. చాలా పనులు చేపట్టడానికి గుత్తేదారులు ముందుకు రాకపోవడంతో.. టెండర్లు పూర్తయిన వాటి విషయంలో అధికారులు గుత్తేదారులపై కఠిన చర్యలు తీసుకోవడానికి వెనుకాడుతున్నారు. నాలుగు జిల్లాల పరిధిలో 2017-18 నుంచి 2023-24 ఆర్థిక సంవత్సరం వరకు పనుల విషయంలో విపరీతమైన జాప్యం నెలకొంది. ఏడేళ్ల కాలంలో 13,863 పనులు చేపట్టడానికి గుత్తేదారులు ముందుకు రావడం లేదు. ఇందులో చిన్నా చితక పనులతోపాటు పెద్ద ప్రాజెక్టులు కూడా కొన్ని ఉన్నాయి. ఆర్థిక సంఘం, డీఎంఎఫ్‌టీ. పట్టణ ప్రగతి, నియోజకవర్గ ప్రత్యేక నిధులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్మాణాల కోసం అందిస్తున్న నిధుల చెల్లింపుల్లో జాప్యంతో గుత్తేదారులు పనులు అర్ధంతరంగా ఆపేస్తున్నారు. కొత్తవి చేపట్టడం లేదు.

పారదర్శకత పెరిగినా.. : నాలుగు జిల్లాల పరిధిలో ఎక్కువగా పురపాలిక, పంచాయతీరాజ్, రహదారులు భవనాల శాఖ, జిల్లా గ్రామీణాభివృద్ధి, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, మార్కెటింగ్, నీటి పారుదలశాఖ, దేవాదాయశాఖ, ఎన్‌పీడీసీఎల్‌తోపాటు విద్యాశాఖలో పలురకాల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. భవనాలు, రహదారులతోపాటు ఇతర వసతుల్ని సమకూర్చే విధంగా అభివృద్ధి అక్కున చేరుతోంది. ఈ- టెండరింగ్ విధానాన్ని ఆన్‌లైన్‌లో ప్రవేశ పెట్టినప్పటి నుంచి టెండర్ల ప్రక్రియ పరంగా పారదర్శకత పెరిగింది. టెండర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌లో ప్రతి పనికి సంబంధించిన పనుల కేటాయింపు ఆధారంగా పలువురు గుత్తేదారులు ఆసక్తిని చూపిస్తున్నారు. అంచనా రూపొందించి అగ్రిమెంట్ చేపట్టిన పనులకు టెండర్లను దాఖలు చేసే విషయంలో మొదట్లో ఆసక్తిని చూపిన గుత్తేదారులు కాలక్రమేణా ఆ పనులను పూర్తి చేసే విషయంలో దాటవేత ధోరణిని అనుసరిస్తున్నారు.

చేసిన పనులకు పలు దఫాలుగా అందుకోవాల్సిన బిల్లుల పరంగా గుత్తేదారులు ఇబ్బందులు ఎదురుకోవడం సమస్యని పెంచుతోంది. పైగా ఒక్కో గుత్తేదారు 10 నుంచి 20 పనులను దక్కించుకోవడం, ఏకకాలంలో వాటిని పూర్తిచేయక జాప్యం చేస్తుండటంతో నిర్ణీత కాలంలో ఏ ఒక్కచోటా పనులు పూర్తి కానివి కూడా ఉన్నాయి. ఈ క్రమంలో నిర్మాణ వ్యయం పెరుగుతుందనే సాకుతో అర్ధాంతరంగా పనుల్ని నిలిపి వేస్తున్నారు. అధికారులు పురోగతిలో ఉన్న పనులకు ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లిస్తూ.. పనులు అర్ధంతరంగా ఆపిన గుత్తేదారులపై కఠినంగా వ్యవహరిస్తేనే మంజూరైన నిధులు సద్వినియోగం చేసుకునే వీలుంటుంది.

# నిబంధనలే ప్రాణానికి రక్ష

జగిత్యాల : రోజురోజుకు వాహనాల సంఖ్య పెరిగిపోతోంది.. పట్టణాల్లో రద్దీ పెరిగి ప్రధాన రహదారులు వాహనాలతో నిండిపోతున్నాయి. ఏ వైపు నుంచి వాహనం ఢీ కొడుతుందనే భయం.. క్షేమంగా ఇంటికి చేరామంటే ఊపిరి పీల్చుకోవాల్సిన పరిస్థితి. రహదారి ప్రమాదాల్లో చాలా మంది ప్రాణాలు విడుస్తున్నారు. ఈ నేపథ్యంలో కనీస జాగ్రత్తలతో ప్రాణాలను రక్షించుకోవచ్చని పోలీసులు పేర్కొంటున్నారు.

శిరస్త్రాణం.. శిరస్త్రాణం ధరించి ద్విచక్రవాహనాలు నడిపే వారు చాలా తక్కువగా ఉంటున్నారు. శిరస్త్రాణం లేకుండా వాహనం నడిపేవారికి చలానా విధించడం తగ్గడంతో నిబంధనలు పాటించడం లేదు. రహదారిపై వాహనాలు ఎలా వస్తాయో తెలియని పరిస్థితి ఉండడంతో తప్పనిసరిగా శిరస్త్రాణం ధరించాలని పోలీసులు సూచిస్తున్నారు. ఏదైనా అనుకోని ప్రమాదం జరిగితే ప్రాణం కాపాడుకునే అవకాశం ఉంటుంది.

సీటుబెల్టు.. ఏ పరిస్థితుల్లో ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి. డ్రైవింగ్ లైసెన్స్ ఉండి వాహనం నడపడం వచ్చినా భారీ వాహనాలు నడిపే వారు సీటుబెల్టు ధరించాలి. వాహనం ప్రమాదానికి గురైనప్పుడు డ్రైవర్ తల స్టీరింగ్‌కు తగిలి లేదా ఛాతి భాగం ఒత్తిడికి గురై అక్కడికక్కడే మరణిస్తున్నారు. సీటుబెల్టు ధరిస్తే డ్రైవర్ ముందుకు వెళ్లకుండా ఉండి స్వల్ప గాయాలతో బయటపడే అవకాశం ఉంటుంది.

చరవాణి.. మద్యం తాగడం.. జిల్లాలో ఈ మధ్యకాలంలో జరిగిన ప్రమాదాల్లో అత్యధికంగా మద్యం తాగి వాహనం నడపటం, చరవాణి మాట్లాడుతూ జరిగినవే ఎక్కువ అని పోలీసుల విచారణలో తేలింది. మద్యం తాగి వాహనాలు నడపడం మానుకోవాలి. జిల్లాలో అన్ని ప్రాంతాల్లో పోలీసులు వాహన తనిఖీలు చేపట్టి జరిమానాలు, కేసులు నమోదు చేస్తున్నారు.

రాత్రివేళలో జాగ్రత్తలు..

రాత్రి వేళలో వాహనాలు నడిపేవారు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలి. ముందు వెళ్తున్న వాహనాన్ని గమనించి వేగాన్ని నియంత్రించుకోవాలి. వాహనం నడిపే సమయంలో నిద్ర వస్తే వాహనాన్ని పక్కన నిలుపుకోవాలి. ఏమవుతుంది అనుకుని అలాగే ముందుకు వెళ్తే ప్రమాదం జరిగే అవకాశం ఉంటుంది.

# ఎద్దు గానుగ.. ఉపాధి కానుక

చౌటుప్పల్ : ముగ్గురు మిత్రులు కలిసి చౌటుప్పల్ మండలం కొయ్యలగూడెంలోని జాతీయ రహదారి పక్కన నూనె గానుగలు ప్రారంభించారు. ఈ గానుగలు యంత్రాలతో కాకుండా ఎద్దులతో నడుస్తాయి. వేరుసెనగ, కొబ్బరి, నువ్వులు, ఆముదం నుంచి ఈ గానుగల్లో నూనె తీస్తున్నారు. రోజుకు 30 లీటర్ల నూనె ఉత్పత్తి చేసి అక్కడే వినియోగదారులకు విక్రయిస్తున్నారు. ముడి సరకులను రైతుల నుంచి నేరుగా కొనుగోలు చేస్తున్నారు. తమకు ఉద్యోగం లేదని ఇంట్లో ఖాళీగా కూర్చోకుండా స్వయం ఉపాధి ఏర్పాటు చేసుకొని కుటుంబానికి ఆసరాగా ఉంటున్నారు.

రూ. 15 లక్షల పెట్టుబడి

పీపల్‌పహాడ్ గ్రామానికి చెందిన జనగాం ప్రవీణ్, సింగపంగ రంగయ్య, పంతంగికి చెందిన చేకూరి బాబు నిరుపేద కుటుంబాలకు చెందిన విద్యావంతులైన యువకులు. గతంలో ఉపాధి కోసం ముంబయికి వెళ్లి అక్కడి కేబుల్ కంపెనీలో కూలీలుగా పని చేసేవాళ్లు. కుటుంబానికి దూరంగా ఒకరి కింద కూలీ పని చేస్తూ జీవించే కంటే సొంత ఊళ్లోనే ఏదైనా స్వయం ఉపాధి ఏర్పాటు చేసుకోవాలని ఇంటికి తిరిగొచ్చారు. తమకు మాత్రమే కాకుండా సమాజానికి కూడా ఉపయోగపడే పని



చేయాలని ఆలోచిస్తున్న వీరిని ఎద్దుతో నడిచే చెక్క గానుగ ఆకట్టుకుంది. మహబూబ్‌నగర్ జిల్లా గుండేడి మండలం జక్లక్‌పల్లిలో బసవరాజు చెక్క గానుగలను నిర్వహిస్తున్నారని తెలుసుకుని అక్కడికి వెళ్లారు. అక్కడే రెండు రోజులుండి గానుగతో నూనె తీసే పద్ధతి నేర్చుకుని తిరిగొచ్చారు. మారుమూలనున్న తమ ఊళ్లో గానుగను ఏర్పాటు చేస్తే అమ్మకం కష్టమవుతుందని కొయ్యలగూడెంలో జాతీయ రహదారి పక్కన ఖాళీ స్థలాన్ని అద్దెకు తీసుకున్నారు. ముగ్గురు తమ డబ్బుతో పాటు తమ బంధుమిత్రుల నుంచి డబ్బు సమకూర్చుకుని రూ.15 లక్షలు పోగు చేశారు. ఆ డబ్బుతో షెడ్డు నిర్మాణం చేశారు. రూ.లక్షతో ఎద్దులు కొనుగోలు చేసి, రెండు గానుగలు నెలకొల్పారు.

స్వయం ఉపాధితో సంతృప్తి

ప్రవీణ్, రంగయ్య, బాబు, ఎద్దు గానుగ నిర్వాహకులు

యువతకు ఆదర్శంగా ఉండేలా ప్రజలకు, రైతులకు ఉపయోగపడే వ్యాపారంతో స్వయం ఉపాధి ఏర్పాటు చేసుకోవాలని ఎద్దుతో నడిచే రెండు చెక్క గానుగలను ఏర్పాటు చేశాం. కొబ్బరిని కర్ణాటక నుంచి తెప్పిస్తున్నాం. వేరుసెనగ గింజలు మహబూబ్‌నగర్, నకిరేకల్ రైతుల నుంచి కొంటున్నాం. నువ్వులు భీమవరం నుంచి తెప్పిస్తున్నాం. ఎద్దుతో నడిచే చెక్క గానుగలో 20-25 డిగ్రీల ఉష్ణోగ్రత వద్ద సహజ సిద్ధంగా వేరుసెనగ, స్వచ్ఛమైన కొబ్బరి నూనె ఉత్పత్తి అవుతోంది. ఈ నూనెలు ప్రజలకు ఆరోగ్యాన్నిస్తాయి.

# నీలగిరి సిగలో.. సాంకేతిక సిరి..!

నల్గొండ : నల్గొండ పట్టణంలో నిర్మిస్తున్న ఐటీ టవర్ నిర్మాణం తుది దశకు చేరింది. ఈ భవనాన్ని వచ్చే నెల 2న మంత్రులు కేటీఆర్, జగదీశ్‌రెడ్డి ప్రారంభించనున్నారు. రూ.90 కోట్ల వ్యయంతో మూడెకరాల విస్తీర్ణంలో 1.75 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నల్గొండ - హైదరాబాద్ రహదారి పక్కనే నిర్మిస్తున్న ఈ అత్యాధునిక భవనం పూర్తిగా గ్రీన్ బిల్డింగ్ తరహాలో నిర్మితమవుతోంది. హైదరాబాద్ లాంటి రాజధాని ప్రాంతాల్లోనే కాకుండా నల్గొండ లాంటి ద్వితీయ శ్రేణి పట్టణాల్లోని నిరుద్యోగులకు ఐటీ ఉపాధి సేవలు అందించాలనే లక్ష్యంతో నల్గొండలో ఐటీ టవర్ నిర్మాణానికి 2021 డిసెంబరు 31న మంత్రులు కేటీఆర్, జగదీశ్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. దీనిని తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక, మౌలిక సదుపాయాల సంస్థ (టీఎస్ఐఐసీ) నిర్మిస్తోంది.

ఇప్పటికే తొలి దశలో 17 కంపెనీలు సుమారు 1200 మందికి ఉద్యోగాలు ఇచ్చి తమ కంపెనీల కార్యకలాపాలు ఇక్కడి నుంచి ప్రారంభించేందుకు సిద్ధం అవుతున్నాయి. ప్రస్తుతం ఒక షిఫ్ట్‌లో సుమారు 1200 మంది ఉద్యోగులు పనిచేసేలా ఏర్పాట్లు చేస్తుండగా.. ఏడాదిలో రెండు షిఫ్టులు, ఏడాదిన్నరలో మూడు షిఫ్టులు (రాత్రి కూడా) పనిచేసే విధంగా కంపెనీలతో ప్రభుత్వం ఒప్పందం చేసుకోనుందని తెలిసింది. ఇటీవల నిర్వహించిన జాబ్‌మేళాలో కొంత మంది నిరుద్యోగులను కంపెనీలు ఎంపిక చేసుకోగా... మరికొంత మందిని కళాశాల ప్రాంగణంలోనే ఎంపిక చేసుకున్నాయి. ఇందులో పనిచేసే ఉద్యోగులకు వార్షిక వేతనం రూ.1.25 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు ఇచ్చేందుకు కంపెనీలు ఉద్యోగులతో ఒప్పందం కుదుర్చుకున్నాయి. కంపెనీలు ఎక్కువగా అమెరికాలో పనిచేస్తున్న నల్గొండ ఎన్ఆర్ఐలకే చెందినవి కావడం విశేషం. ఐటీ టవర్ ప్రారంభం అనంతరం మరిన్ని ఐటీ, సాఫ్ట్‌వేర్ కంపెనీలు ఇక్కడి నుంచి వారి కార్యకలాపాలు చేసేందుకు సుముఖంగా ఉన్నట్లు తెలిసింది.

సహజ సిద్ధంగా వెలుతురు వచ్చేలా

రోజంతా సహజసిద్ధంగా వెలుతురూ వచ్చేలా భవనాన్ని జీం5 పద్ధతిలో గ్రీన్ బిల్డింగ్ తరహాలో నిర్మించారు. భవనంలో ఉపయోగించిన నీటిని పూర్తిగా తిరిగి ఉపయోగించేలా 50 వేల లీటర్ల సీవరేజ్ ప్లాంటును నిర్మించారు. భవనంతో పాటూ పనిచేసే ఉద్యోగుల అవసరాలకు పురపాలిక నుంచి నీటిని తీసుకొని, రీ ఫిల్టర్ చేసి భవనంలో పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్న మొక్కలకు అందేలా ప్రణాళిక రూపొందించారు. గ్రౌండ్ ఫ్లోర్‌తో పాటూ రెండో అంతస్థులో ఇంటర్నల్ గార్డెన్‌ను తీర్చిదిద్దుతున్నారు. ఉద్యోగులకు క్యాంటిన్‌ను ఏర్పాటు చేస్తున్నారు. వర్షపు నీటిని పూర్తిగా ఉపయోగించేలా భవనం వెనుక భాగంలో ఇంకుడుగుంత నిర్మిస్తున్నారు. సుమారు మూడెకరాల విస్తీర్ణంలో ఎక్కడ వర్షం పడినా.. ఆ నీరంతా నేరుగా ఆ ఇంకుడుగుంతలోకి వెళ్లేలా ప్లాన్ చేశారు. భవనం మొత్తం సెంట్రల్ ఏసీతో పనిచేసే విధంగా నిర్మిస్తుండగా.. ఇందుకు అధిక విద్యుత్ అవసరం అవుతుంది. దీంతో రానున్న కాలంలో భవన విద్యుత్ అవసరాలను పూర్తిగా సోలార్ ద్వారానే తీర్చుకునే విధంగా త్వరలోనే సోలార్ ప్యానెళ్లను ఏర్పాటు చేయనున్నట్లు సంబంధిత వర్గాలుఇచ్చిన మాట నిలబెట్టుకుంటున్నాం గ్రామీణ ప్రాంతాల్లోని సాంకేతిక విద్య చదివిన వారికి ఇక్కడే ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం అన్ని పట్టణాల్లోనూ ఐటీ టవర్‌లను నిర్మిస్తోంది. ఏడాదిన్నరలోనే అత్యాధునిక భవనం అందుబాటులోకి తీసుకువచ్చాం. తొలి దశలో 1200 మందికి ఉద్యోగాలిచ్చేందుకు కంపెనీలు సిద్ధం అయ్యాయి. ఐటీ టవర్‌ను ప్రారంభోత్సవం చేసి గతంలో ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటున్నాం.

# కుష్ఠు విస్తరిస్తోంది..!

భూపాలపల్లి: అనారోగ్య సమస్యలతో పాటు అంగవైకల్యానికి దారితీసే కుష్ఠు వ్యాధి మళ్లీ విజృంభిస్తోంది.. గతంలో ఈ వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉండగా.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పకడ్బందీ చర్యలు తీసుకోవడంతో వ్యాధి తీవ్రత తగ్గిపోయి బాధితులు తగ్గుతూ వచ్చారు. ఇక అంతరించిపోతుందనుకుంటున్న తరుణంలో మహమ్మారి వేగంగా విస్తరిస్తోంది. గత ఆగస్టులో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వైద్య శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ఇంటింటి సర్వేలో మళ్లీ కుష్ఠు చాపకింద నీరులా విస్తరిస్తున్నట్లు గణాంకాలు తెలుపుతున్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా అనుమానితుల సంఖ్య వేలల్లో ఉంది. వ్యాధి తీవ్రత పెరగక ముందే అనుమానితులకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి అవసరమైన చికిత్స అందించేలా ప్రత్యేక దృష్టి సారిస్తే వ్యాధి నియంత్రణలో ఉండే అవకాశం ఉంది.

**6,868 మంది అనుమానితులు**

ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా గత ఆగస్టులో వైద్యశాఖ ఆధ్వర్యంలో ఇంటింటి సర్వే నిర్వహించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 26.11 లక్షల ఇళ్లను సందర్శించి 35.97 లక్షల మందిని పరీక్షించగా అందులో



6,868 మంది అనుమానితులు ఉన్నట్లు ఇంటింటి సర్వేలో తెలుసుకున్నారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో 276 మంది కుష్ఠు వ్యాధితో బాధపడుతుండగా వారికి కావాల్సిన చికిత్స అందిస్తున్నారు. ఇది ఒకరి నుంచి మరొకరికి సోకే అంటువ్యాధి కావడంతో సమూలంగా నిర్మూలించాలంటే అనుమానితులకు వెంటనే స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి వ్యాధి నిర్ధారణ కాగానే సత్వర చికిత్స అందించి వ్యాధి ప్రబలకుండా చూడాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది.

**లక్షణాలు ఎలా గుర్తిస్తారు..?**

కుష్ఠు వ్యాధికారక క్రిమిని మైక్రోబాక్టీరియం లెప్రే అంటారు. చర్మంపై మచ్చ ఏర్పడి పాలిపోయిన లేక రాగి రంగులో ఉంటుంది. దానిపై ఎలాంటి స్పర్శ ఉండకపోవడంతో పాటు ఆ ప్రదేశంలో చెమట కూడా పట్టదు. శరీరంలో ఏ భాగానికైనా వచ్చే అవకాశాలు ఉంటాయని వైద్యాధికారులు తెలుపుతున్నారు. నిర్లక్ష్యం చేస్తే కాళ్లు, చేతులు అంగవైకల్యం పొందడంతో పాటు ముఖం, చెవి దగ్గర వ్యాధి ప్రభావం ఎక్కువగా కనిపిస్తుందని వైద్యాధికారులు అంటున్నారు. వ్యాధి సోకిన వారికి మచ్చలు రావడంతో పాటు రెండో రకంగా ముఖం, చేతులు, కాళ్లపై బుడిపెలు, జ్వరం, ఒళ్లు, కీళ్ల నొప్పుల లాంటి అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుంది.

**చికిత్స విధానం ఇలా..**

రెండు రకాలుగా చికిత్స అందించేలా విభజించారు. మొదటిది పాసిబేసిలరి(పీబీ).. వ్యక్తి శరీరంలో 1 నుంచి 5 మచ్చల వరకు ఏర్పడటం, ఒక నరానికి మాత్రమే వ్యాధి సోకడం జరుగుతుంది. దీనికి 6 నెలల పాటు చికిత్స అందిస్తారు. ఆరు లేక అంతకంటే ఎక్కువ మచ్చలు ఉండటం, రెండు లేక అంతకంటే ఎక్కువ నరాలకు వ్యాధి సోకితే మల్టీబాసిలరి(ఎంబీ) అంటారు. ఎక్కువ మొత్తంలో మచ్చలు ఉన్నవారు 12 నెలల చికిత్స తీసుకోవాల్సి ఉంటుంది. నరాలకు క్రిమి చేరకముందే పూర్తి చికిత్స అందిస్తే అంగవైకల్యం రాకుండా కాపాడుకోవచ్చు. కుష్ఠు వ్యాధి సోకిన వ్యక్తి వ్యాధి నుంచి పూర్తిగా కోలుకున్నప్పటికీ జీవితాంతం పలు జాగ్రత్తలు పాటించాల్సి ఉంటుంది. వ్యాధి నయమైనా కోల్పోయిన స్పర్శ జ్ఞానం పూర్తిగా రాకపోవచ్చని వైద్యాధికారులు చెబుతున్నారు.

**ఎలాంటి ఆందోళన వద్దు**

ధనసరి శ్రీరామ్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, జయశంకర్ భూపాలపల్లి ఒక వ్యక్తిలో తెల్లని, గోధుమ రంగులో ఎలాంటి స్పర్శలేని మచ్చలు ఉంటే దానిని కుష్ఠు వ్యాధిగా నిర్ధారించే అవకాశం ఉంటుంది. అలాంటి వారు ఎవరైనా ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. అనుమానితులు ఉంటే సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వెళ్తే స్క్రీనింగ్ చేసి అవసరమైన చికిత్స అందిస్తారు. వ్యాధిని బట్టి 6 నెలలు, 12 నెలల చికిత్స ఉంటుంది. కుష్ఠు నివారణకు సంబంధించి అన్ని రకాల వైద్య సేవలు, మందులు అందుబాటులో ఉన్నాయి. మొదటి దశలోనే గుర్తిస్తే త్వరగా నియంత్రించవచ్చు.

# కస్తూర్బా పాఠశాలలో పెరటి తోట

జనగామ : జిల్లాలోని కస్తూర్బా పాఠశాలల్లో పెరటితోటల పెంపకం సాగుతోంది. పాఠశాలల్లో ఖాళీ స్థలాన్ని నిరుపయోగంగా వదిలేయవద్దని, వీలైనన్ని పెరటి తోటలు పెంచాలని అధికారులు కేజీబీవీల ప్రత్యేకాధికారులను ఆదేశించారు. ఖాళీ స్థలంలో నీరు, చెత్త చేరితే దోమలు వృద్ధి చెందుతాయని, విద్యార్థులు అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఉందని చైతన్యపరిచారు. స్పందించిన ప్రత్యేకాధికారులు విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న స్థలాలను శుభ్రం చేశారు. విత్తనాలు చల్లి ఆకుకూరలు, కూరగాయల మొక్కలను పెంచుతున్నారు. ప్రతిరోజూ విద్యార్థినుల కోసం వండే వంటల్లో.. ఈ తోటల్లో పండిన ఆకుకూరలు, కూరగాయలను వినియోగిస్తున్నారు. మరికొన్ని కేజీబీవీల్లో రసాయనాలు వాడకుండా తోటలను పెంచుతున్నారు. ప్రతి రోజూ విద్యార్థులు వంతుల వారీగా పెరటితోటలను సంరక్షిస్తున్నారు. కలుపు మొక్కలను తొలగించి నీరందిస్తున్నారు. లింగాలఘనపురంలోని కస్తూర్బా విద్యాలయం పనితీరు ప్రత్యేకం. ఈ పాఠశాలను రాతి పొరలు అధికంగా ఉన్నచోట నిర్మించారు. మొదట్లో.. ఇక్కడ మొక్కలు బతికే అవకాశం లేదనంటూ అధికారులు, ప్రజలు చేతులెత్తేశారు. ప్రత్యేకాధికారిణి అన్నపూర్ణ చొరవ తీసుకొని.. కొద్దిగా చదునుగా ఉన్న ప్రాంతంలో నాణ్యమైన మట్టి సేకరించి మడులుగా తయారు చేశారు. వంకాయ, బెండ, చుక్కకూర, పాలకూర, తోటకూర లాంటి ఐదు రకాల కూరగాయల విత్తనాలు వేశారు. ఆరు నుంచి పదో తరగతి వరకు చదివే బాలికలకు ఒక్కో రకం మొక్కల పెంపకం, నిర్వహణ బాధ్యతలను అప్పగించారు. పాఠశాలలో బోధన వేళలు ముగిసిన తర్వాత బాలికలు అరగంట సేపు పెరటితోటల్లో గడుపుతున్నారు. మొక్కల తెగుళ్లను, చీడ పీడలను గుర్తించి ప్రత్యేకాధికారికి చెప్పడమే కాక మొక్కల మధ్య పెరిగిన కలుపును తొలగిస్తారు. ప్రతి రోజూ పాఠశాలలోని బోర్డుపై ఆరోజు వండిన కూరగాయలు, ఏ తరగతి విద్యార్థులు సంరక్షించారన్న వివరాలను రాస్తారు. దీంతో బాలికల మధ్య ఆరోగ్యవంతమైన పోటీ నెలకొందని, వారికి కేటాయించిన పెరటితోటలను మరింత శ్రద్ధగా నిర్వహిస్తున్నారని జిల్లా బాలికా విద్యాధికారి గౌసియాబేగం తెలిపారు.

# ఈ- సేవలు భక్తులకు ఉపయుక్తం



భద్రాచలం : భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలోని ప్రసాదాల కౌంటర్‌లో ఎలక్ట్రానిక్ టిక్కెట్లు జారీ చేస్తున్నారు. రెండు రోజుల క్రితం ఈవిధానాన్ని ప్రారంభించగా సోమవారం నుంచి పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకొచ్చారు. ముద్రించిన పుస్తకం నుంచి ఇప్పటివరకు టిక్కెట్లు ఇచ్చేవారు. వీటిని మరో కౌంటర్‌లో అందజేసి కావాల్సిన ప్రసాదాన్ని భక్తులు తీసుకునేవారు. ఇప్పుడు పుస్తకానికి బదులు కంప్యూటర్‌ను సిబ్బంది వినియోగిస్తున్నారు. కల్యాణం లడ్డూ (400 గ్రాములు) ధర రూ.100. చిన్న లడ్డూ (100 గ్రాములు)- రూ.25. పులిహోర (200 గ్రా)- రూ.15. చక్కర పొంగలి (150 గ్రా)- రూ.15. వీటిని ఈ-టిక్కెట్ల ద్వారా సిబ్బంది విక్రయిస్తున్నారు. ప్రసాదం వివరాలను ఇప్పటికే కంప్యూటర్‌లో నిక్షిప్తపరిచారు. బెల్లం లడ్డూ, రవ్వ కేసరి, బెల్లం పొంగలి వంటివాటిని పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచాలని భక్తులు కోరుతున్నారు. ప్రసాదాల విభాగంలో రూ.కోట్ల లావాదేవీలు సాగుతున్నందున నాణ్యతపై ఈఓ రమాదేవి దృష్టి సారించారు.

**ప్రధాన కౌంటర్లలో కంప్యూటర్లు**

రామాలయం ప్రధాన కౌంటర్లలో లావాదేవీలన్నింటినీ ఆన్‌లైన్‌లో నిర్వహించాలని నిర్ణయించారు. ఇప్పటికే ఆయా విభాగాలకు కంప్యూటర్లు అందించారు. విధులు నిర్వర్తించే సిబ్బందికి సాంకేతిక పరిజ్ఞానం తప్పనిసరి అయ్యింది. కొంతమందికి ఈ వ్యవస్థపై అవగాహన ఏర్పడగా మరికొందరు నేర్చుకోవాల్సి ఉంది. పూజలు, సేవలు, విరాళాలు ఇలా అన్నింటినీ ఈ-టిక్కెట్‌ల ద్వారా నిర్వహిస్తే పారదర్శకత పెరుగుతుందని ఆలయాధికారులు భావిస్తున్నారు. ఆన్‌లైన్ విధానం అమల్లోకి వచ్చిన తొలిరోజుల్లో వసతి గదులను బుక్ చేసుకోవడంలో రెండు పద్ధతులు పాటించారు. నేరుగా రాలేని వారు అంతర్జాలంలో బుక్ చేసుకోగా.. కౌంటర్‌కు వచ్చిన వారు రసీదు తీసుకుని వసతి పొందేవారు. ఇప్పుడు నేరుగా వచ్చేవారికీ ఆన్‌లైన్ ద్వారా గదులను సిబ్బంది కేటాయిస్తున్నారు.

**ఈ-హుండీకి ఆదరణ**

బ్యాంకర్ల సాయంతో ఇటీవల ఎలక్ట్రానిక్ హుండీలను ఏర్పాటు చేయడంతో భక్తుల నుంచి ఆదరణ లభిస్తోంది. ప్రత్యేకంగా రూపొందించిన స్టిక్కర్‌ను స్మార్ట్ ఫోన్‌లో స్కాన్ చేసి తోచినంత విరాళాలు ఇచ్చే వెసులుబాటు కల్పించారు. ఫోన్‌పే, గూగుల్‌పే తరహాలో ఈ-హుండీ నుంచి రామయ్యకు కానుకలు అందుతున్నాయి. రామాలయం పేరిట ఉన్న బ్యాంకు ఖాతా నంబర్లను సైతం స్టిక్కర్లపై ముద్రించడంతో దాతలు నేరుగా దాతృత్వాన్ని చాటుకునే అవకాశం ఏర్పడింది. ఇదే క్రమంలో ప్రసాదాల కౌంటర్లు, మరికొన్నిచోట్ల డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించాల్సి ఉంది.

# ఏదో చెప్పారు.. అంతలోనే మరిచారు..!



అశ్వారావుపేట : తెలంగాణ ఆయిల్‌ఫెడ్ అధికారుల అనాలోచన ధోరణితో ఇబ్బందులు ఎదురవుతున్నాయని రైతు సంఘాల ప్రతినిధులు వాపోతున్నారు. ఆయిల్‌పాం బాగా అభివృద్ధి చెందిన ప్రాంతాన్ని వదిలేసి ఇప్పటివరకు సరిగ్గా తోటలు వేయని, ఒక్క పరిశ్రమ ఏర్పాటుకాని ప్రాంతంలో రిఫైనరీని నెలకొల్పాలని అధికారులు నిర్ణయించటంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**ఉభయ జిల్లాలు ముందువరుసలో ఉన్నా..**

ఇప్పటికే అశ్వారావుపేట, దమ్మపేట మండలం అప్పారావుపేటలో పామాయిల్ పరిశ్రమలు లక్షలాది టన్నుల గెలలను క్రషింగ్ చేస్తున్నాయి. కొత్తగా సిద్దిపేట, బీచుపల్లి, తొర్రూరు, కల్లూరిగూడెం (సత్తుపల్లి)లో పరిశ్రమల ఏర్పాటుకు అధికారులు ప్రతిపాదించారు. రెండు దశాబ్దాల క్రితం పామాయిల్ పరిశ్రమలు ఏర్పాటైన ప్రాంతంలో ఆయిల్‌పాం రిఫైనరీని నెలకొల్పకుండా.. అసలు పామాయిల్ పరిశ్రమే వృద్ధి చెందని సిద్దిపేటలో రిఫైనరీ ఏర్పాటుకు అధికారులు మొగ్గుచూపటం సరికాదనే వాదనలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రంలో ఆయిల్‌పాం తోటల విస్తీర్ణంలో భద్రాద్రి, ఖమ్మం జిల్లాలు ముందువరుసలో ఉన్నాయనేది జగమెరిగిన సత్యం.

**గణనీయంగా ముడిచమురు ఉత్పత్తి**

భద్రాద్రి, ఖమ్మం జిల్లాల్లో ఆయిల్‌పాం గెలల క్రషింగ్ ద్వారా ఏడాదికి 50వేల టన్నుల పైబడి ముడిచమురు ఉత్పత్తి అవుతోంది. అయిదేళ్లలో లక్ష టన్నులకు చేరువ కానుంది. ఆయిల్‌ఫెడ్ అధికారులు ఆయిల్ రిఫైనరీకి ప్రతిపాదించిన ప్రాంతంలో ఏడాదికి ప్రస్తుతం 1,000 టన్నుల ముడిచమురు వచ్చే అవకాశముంది. మరో అయిదేళ్లు గడిస్తే 3వేల టన్నులకు చేరినా ఖమ్మం, భద్రాద్రి జిల్లాల ముడిచమురు ఉత్పత్తిలో 3 శాతానికి మించకపోవచ్చు. సిద్దిపేటలో ఆయిల్ రిఫైనరీ ఏర్పాటుతో ఆయిల్‌ఫెడ్ నష్టాలను చవిచూడాల్సి వస్తుందని రైతు సంఘాల ప్రతినిధులు చెబుతున్నారు. మార్కెటింగ్ సౌకర్యం ప్రధానం. మార్కెట్‌కు సౌలభ్యంగా ఉంటుందని సిద్దిపేట ప్రాంతంలో రిఫైనరీని నెలకొల్పాలని ప్రతిపాదించాం. ముడిచమురు రవాణా కాసింత భారమైనా పెద్దగా ఇబ్బందులుండవు.

సుధాకర్‌రెడ్డి, జనరల్ మేనేజర్, టీఎస్ ఆయిల్‌ఫెడ్

**నీటిమూటలుగా హామీలు..**

ఆయిల్‌పాం తోటలు విస్తారంగా ఉన్న అప్పారావుపేటలో రూ.20కోట్లతో పామాయిల్ రిఫైనరీ ఏర్పాటుచేస్తామని ప్రస్తుత పాలకులు, అధికారులు అనేకసార్లు హామీ ఇచ్చారు. అయితే ఆ దిశగా చొరవ చూపటం లేదనే వాదనలు వ్యక్తమవుతున్నాయి. అప్పారావుపేటలో కాకుండా 300 కిలోమీటర్ల దూరంలోని సిద్దిపేటలో రిఫైనరీ ఏర్పాటుచేస్తే ఇక్కడి నుంచి ముడిచమురు రవాణాకు ఒక్కో లారీకి కనీసం రూ.45వేలు ఖర్చువుతుంది. భవిష్యత్తులో రవాణా ఛార్జీలు మరింత పెరిగే అవకాశం ఉంది. ఈ లెక్కన రవాణా ఖర్చులకే తడిసిమోపెడవుతుంది. భద్రాద్రి జిల్లాల్లో రిఫైనరీ ఏర్పాటుతో ఆయిల్‌ఫెడ్‌కు ఏటా రూ.10కోట్లు, అయిదేళ్లు దాటితే రూ.20కోట్ల చొప్పున ఆదా అవుతుంది. ఇప్పటికైనా అధికార యంత్రాంగం ఆయిల్ రిఫైనరీ ఏర్పాటుపై పునరాలోచించాలని రైతులు కోరుతున్నారు.

# చికిత్స కన్నా.. నివారణే మిన్న

ఖమ్మం : నేటి బాలలు తరచూ ఏదో అనారోగ్య సమస్యతో బాధపడుతున్నారు. చదువుపైనా ఏకాగ్రత చూపలేక పోతున్నారు. వారిని బాధించే రోగాలేమిటి? అందుక్కారణాలేమిటో పరిశీలిస్తే ఆహార అలవాట్లు, వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాలు, కుటుంబాల స్థితిగతుల వల్ల సంక్రమించేవే ఎక్కువగా ఉన్నట్లు తేలింది. మరికొందరు వంశపారంపర్య వ్యాధులతో బాధపడుతున్నారు. ఈ నేపథ్యంలో 'చికిత్స కన్నా.. నివారణే మిన్న' అనే సూత్రాన్ని 6-18 ఏళ్ల వయసు వారికి ఒంట పట్టించాలని వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ భావిస్తోంది. తల్లిదండ్రులు, విద్యాలయాల నిర్వాహకులూ మేలుకోవాలని సూచిస్తోంది. పుట్టుకతో వచ్చే లోపాలు, దీర్ఘకాలిక వ్యాధులు, సాధారణ అనారోగ్య సమస్యలను గుర్తించి.. బాలల ఆరోగ్యాన్ని మెరుగుపరిచేందుకు వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ అమలు చేస్తున్నదే 'రాష్ట్ర బాల స్వాస్థ్య కార్యక్రమం' (ఆర్‌బీఎస్‌కే). అంగన్‌వాడీ కేంద్రాలు, విద్యాలయాల్లో చదువుకునే 18 ఏళ్ల లోపు పిల్లల జీవన నాణ్యతను మెరుగుపరచడం, ఆరోగ్య సామర్థ్యాన్ని పెంపొందించడమే దీని ప్రధాన లక్ష్యం. ఈ క్రమంలో ఖమ్మం జిల్లాలో 12 ఆర్‌బీఎస్‌కే బృందాలు ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు 1,467 అంగన్‌వాడీ కేంద్రాలు, విద్యాలయాలను సందర్శించాయి. 89,038 మందికి స్క్రీనింగ్ చేశాయి. 2,130 మందికి ఆరోగ్య సమస్యలున్నట్లు తేలింది. భద్రాద్రి జిల్లాలోని ప్రత్యేక బృందాలు స్క్రీనింగ్ పరీక్షలను నిర్వహిస్తున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. ఉభయ జిల్లాల్లో ప్రత్యేక వైద్యం అవసరమైన వారిని సర్వజనాసుపత్రుల్లోని డీఈఐసీ(డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్‌వెన్షన్ సెంటర్)కు తరలిస్తున్నట్లు చెప్పారు. శస్త్రచికిత్సలు తప్పనిసరైతే రిఫరల్ కేంద్రాలకు సిఫార్సు చేస్తున్నారు. హృద్రోగాలు, గ్రహణం మొర్రి వంటి సమస్యలున్న వారిని కార్పొరేట్ ఆస్పత్రుల్లో చూపిస్తున్నారు.



**స్క్రీనింగ్ ప్రక్రియ కొనసాగిస్తున్నాం**

డా.ప్రమీల, ప్రోగ్రాం అధికారి, ఆర్‌బీఎస్‌కే, ఖమ్మం

ఆర్‌బీఎస్‌కే బృందాలు పిల్లల అనారోగ్య సమస్యలను గుర్తించేందుకు నిరంతరం స్క్రీనింగ్‌లు చేస్తున్నాయి. ఎవరికైనా వ్యాధులు నిర్ధారణ అయితే ఉచిత వైద్యసాయం అందిస్తున్నాం. వ్యక్తిగత పరిశుభ్రత, ఆహార అలవాట్లు మెరుగు పడటంతో పాటు పరిసరాల్లో అపరిశుభ్రత లేకుండా చూస్తే పిల్లల ఆరోగ్య సంరక్షణకు కృషిచేసిన వారవుతారు. ఈ దిశగా అందరికీ అవగాహన కల్పిస్తున్నాం.

# పెంబర్తికి పర్యాటక కిరీటం

జనగామ : జిల్లాకు కేంద్ర ప్రభుత్వం పర్యాటక కిరీటం తొడిగింది. సెప్టెంబరు 27 పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణలో రెండు గ్రామాలకు ఈ గుర్తింపు దక్కగా అందులో హస్త కళల గ్రామమైన పెంబర్తిని 'జాతీయ ఉత్తమ పర్యాటక గ్రామం'గా గుర్తించింది. పెంబర్తి పేరు చెబితేనే అద్భుతమైన హస్త కళాకృతులు మన మదిలో మెదులుతాయి. దేవుడి ఉత్సవ విగ్రహాలు, ఆలయాల్లో విగ్రహాల వెనక అలంకరించే ప్రభలు, ధ్వజస్తంభం, ఆలయ ద్వారాలకు తొడుగులు, గుడిలో ఉపయోగించే ఇత్తడి పూజా సామగ్రిని ఈ గ్రామంలోని హస్త కళాకారులు ఎంతో నైపుణ్యంతో చక్కగా తీర్చిదిద్దుతారు. పెంబర్తి కళాఖండాలను దేశవిదేశాలకు తరలిస్తారు. యాదాద్రి ఆలయంలోని కొన్ని ద్వారాలకు పెంబర్తి కళాకారులు డిజైన్లను మలిచారు. అమెరికాలో ప్రసిద్ధి చెందిన టెక్సాస్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో మూల విరాట్టుకు పెట్టిన కిరీటం ఇక్కడి కళాకారులే తయారుచేశారు. వేములవాడ రాజన్న కోవెలలో వెండి ద్వారాలు, బాసర సరస్వతీ ఆలయంలో వస్తువులు, శ్రీకాళహస్తి ధ్వజస్తంభం తొడుగు.. ఇలా ఎన్నో ఆలయాల కోసం ఇక్కడి కళాకారులు ఇత్తడి, వెండి ఆకృతులు మలిచారు. అనేక సాంస్కృతిక కార్యక్రమాల్లో జ్ఞాపికలుగా కాకతీయ తోరణాలు కూడా పెంబర్తిలో రూపొందించి ఇస్తుంటారు. పూల కుండీలు, ఇతర అలంకార వస్తువులు చేయడంలో వీరికి వీరే సాటి.




**నిజాం పాలనకు ముందే**

నిజాం నవాబుల పాలనకు ముందే ఇక్కడి విశ్వకర్మ కుటుంబీకులు వంట పాత్రలను రూపొందించేవారు. కాలక్రమేణ కళాకృతులు చేయడంలో నైపుణ్యం సంపాదించారు. ఇటీవల ఆధునికత వైపు అడుగులు వేస్తూ యువ కళాకారుల కోసం 'డెవలప్‌మెంట్ కమిషనర్ ఆఫ్ హ్యాండీ క్రాఫ్ట్స్' దిల్లీ వారు సరికొత్త యంత్రాలను అందజేసి వీరికి శిక్షణ ఇచ్చారు.

**ఉత్పత్తులకు గిరాకీ**

జాతీయ ఉత్తమ పర్యాటక గ్రామంగా పెంబర్తికి గుర్తింపు రావడం వల్ల ప్రభుత్వాలు ప్రత్యేకంగా ఇచ్చే నిధులు ఉండవు.. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరింత గుర్తింపు లభిస్తుంది.. ఒకప్పుడు జనగామలో ఏ ఒక్క పర్యాటక ప్రాంతం గుర్తింపునకు నోచుకోలేదు. ఇటీవల పాలకుర్తి, వల్మిడీ, బమ్మెర ఆలయాలు, పోతన, పాల్కుర్కి లాంటి ప్రాచీన కవులకు స్మృతివనాలు నిర్మించడంతో ఈ ప్రాంతాలు పర్యాటక కేంద్రాలుగా పేరుపొందాయి. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం పెంబర్తిని పర్యాటక వలయంలో చేర్చింది. ఇప్పుడు కేంద్రం పర్యాటక గుర్తింపు ఇవ్వడంతో ఇది సందర్శనీయ స్థలంగా మారే వీలుంది. కళాకారులు రూపొందించే ఆధునిక డిజైన్లకు గిరాకీ వచ్చే అవకాశం ఉంది.

**సంతోషంగా ఉంది**అంబాల ఆంజనేయులుగౌడ్, సర్పంచి హస్తకళారంగానికి పుట్టినిల్లైన పెంబర్తిని కేంద్ర ప్రభుత్వం ఉత్తమ పర్యాటక గ్రామంగా ఎంపిక చేయడం చాలా సంతోషంగా ఉంది. గ్రామానికి ఈ ఘనత రావడానికి కృషి చేసినవారికి రుణపడి ఉంటాం.

# ఆనందమానందమాయే..!

వరంగల్ : ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా దశాబ్ద కాల నిరీక్షణ వారిది.. బోధనా రంగంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడి స్థానానికి ఎదగడం అనేది ఉపాధ్యాయులకు ఒక జీవిత ఆశయంలాంటిది. తమ ఉద్యోగ ప్రస్థానంలో ఆ కల ఎప్పుడు నెరవేరుతుందా? అని ఎదురుచూస్తుంటారు. జిల్లాలోని పలువురు స్కూల్ అసిస్టెంట్లను ఎట్టకేలకు ఆ పదవి వరించింది. ఉపాధ్యాయుల బదిలీ, పదోన్నతుల షెడ్యూల్‌లో భాగంగా మల్టీజోన్-1కు చెందిన 19 జిల్లాల్లోని మహబూబాబాద్ జిల్లాలో ప్రభుత్వ, జడ్పీ ఉన్నత పాఠశాలలో ఖాళీగా ఉన్న 65 గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయుల పోస్టులకు పలువురు స్కూల్ అసిస్టెంట్లు గురు, శుక్రవారాల్లో వెబ్‌ఆప్షన్లు పెట్టుకున్నారు. సొంత జిల్లాకే కాకుండా ఇతర జిల్లాల్లోని బడులకు నమోదు చేసుకున్నారు. రెండు రోజుల ఉత్కంఠకు తెరదీస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. పదోన్నతి పొందిన ప్రధానోపాధ్యాయులు జిల్లాలోని ఆయా పాఠశాలల్లో సోమవారం విధుల్లో చేరారు. పదోన్నతి పొందిన వారిలో ఎక్కువగా గణితం, సాంఘిక, జీవశాస్త్ర సబ్జెక్టుల స్కూల్ అసిస్టెంట్లు, ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎంలు ఉన్నారు. కొందరికి తమ మండలాల్లోని ఉన్నత పాఠశాలలకే ప్రధానోపాధ్యాయులుగా పోస్టింగులు వచ్చాయి.

**65 పోస్టులు భర్తీ**

జిల్లాలో 65 ఉన్నత పాఠశాలల్లోని గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయుల పోస్టులు భర్తీ అయ్యాయి. వీటిల్లో 63 జడ్పీ, రెండు ప్రభుత్వ పాఠశాలలున్నాయి.

**ఇతర జిల్లాల నుంచి..**

మహబూబాబాద్ జిల్లాలోని 38 పాఠశాలలకు ప్రధానంగా ఖమ్మం జిల్లా నుంచి ఎక్కువ సంఖ్యలో ప్రధానోపాధ్యాయులుగా వచ్చారు. ఖమ్మం నుంచి 25, వరంగల్, హనుమకొండ జిల్లాల నుంచి పది మంది ఉన్నారు.

**ఇతర జిల్లాలకు..**

సొంత జిల్లాలో పోస్టులు దొరకక ఇతర జిల్లాలకు 13 మంది వెళ్లారు. వరంగల్, ములుగుతో పాటు దూర ప్రాంతాలైన కామారెడ్డి, నిజామాబాద్, మెదక్, జయశంకర్ భూపాలపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లాలకు వెళ్లాల్సివచ్చింది. మహిళా ప్రధానోపాధ్యాయులు జిల్లాలో భర్తీ అయిన 65 పాఠశాలల ప్రధానోపాధ్యాయుల పోస్టుల్లో 20 మంది మహిళా ప్రధానోపాధ్యాయులున్నారు.

**సంతోషాన్ని కలిగించింది**

రాందాస్, ఆలేరు జడ్పీ ఉన్నత పాఠశాల

ఎన్నో ఏళ్లనుంచి పదోన్నతి కోసం ఎదురు చూశాను. ఇప్పుడు నెరవేరింది. పాఠశాల సమగ్రాభివృద్ధి కోసం కృషి చేస్తాను.

**విద్యాభివృద్ధే ధ్యేయంగా..**

ఎన్.స్వప్న, మునిగలవీడు జడ్పీ ఉన్నత పాఠశాల

ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎక్కువగా చదివేది పేద కుటుంబాల విద్యార్థులే. వారి విద్యాభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తాను.

# ఇక్కడ చదివి.. జీవితంలో ఎదిగి..!

ఇల్లెందు : ఇల్లెందు మండలం సుభాష్‌నగర్‌లోని గిరిజన బాలిక గురుకుల పాఠశాలకు ఎనలేని ప్రత్యేకత ఉంది. ఈ పాఠశాలలో విద్యాభ్యాసం చేసిన వందల మంది గిరిజన మహిళలు ప్రస్తుతం ప్రభుత్వ శాఖల్లో, ప్రైవేటు రంగంలో ఉద్యోగాలు చేస్తూ స్థిరపడ్డారు. గిరిజన మహిళలలో చైతన్యం నింపి అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు ఈ పాఠశాలను ఏర్పాటు చేశారు. మొదట్లో జేకేకాలనీలోని సింగరేణి క్వార్టర్స్‌లో ప్రిన్సిపల్ చర్చిల్‌బాబు ఆధ్వర్యంలో పాఠశాలను 3వ తరగతితో ప్రారంభించారు. రెండేళ్ల తర్వాత సుభాష్‌నగర్‌లోని రేకుల షెడ్డులోకి మార్చారు. అప్పటి ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య సహకారంతో 29 ఎకరాల స్థలాన్ని పాఠశాలకు కేటాయించారు. తదనంతరం పాఠశాల భవనం, భోజనశాల, వసతిగృహం నిర్మించారు. 2000 సంవత్సరంలో ఇంటర్మీడియట్ భవనం ఏర్పాటు చేశారు. 2007 సంవత్సరంలో పాఠశాల, కళాశాల భవనాలు వేర్వేరు ప్రాంగణాల్లో ఏర్పాటు చేసి అన్నిరకాల వసతులు కల్పించారు.

**ఉన్నత స్థాయిలో గిరిజన మహిళలు**

ఈ పాఠశాల, కళాశాలల్లో మొదటి నుంచి మెరుగైన, క్రమశిక్షణతో కూడిన విద్యాబోధన కొనసాగుతోంది. మారుమూల మన్యం ప్రాంతాల నుంచి వచ్చే గిరిజన, ఆదివాసీ మహిళలు విద్యపై పట్టుసాధించేలా బోధించేవారు. ఇప్పటికీ ఈ పాఠశాలలో 2,200 మంది పదో తరగతి(25 బ్యాచ్‌లు), 3 వేల మంది ఇంటర్మీడియట్(20 బ్యాచ్‌లు) విద్యార్థినులు చదివారు. వీరిలో సుమారు 80 శాతం మంది వైద్యులు, ఉపాధ్యాయులు, ఇంజనీర్లు, వార్డెన్లుగా ఉద్యోగాలు సాధించడం విశేషం. 2015లో ఈసం తేజశ్రీ మౌంట్ రెనాక్ పర్వతాన్ని, 2021లో ఈసం సిరివెన్నెల ప్రతిష్ఠాత్మకమైన కిలిమంజారో పర్వతాన్ని




అధిరోహించారు. 2019 బ్యాచ్‌కు చెందిన లావణ్య కేవైఎల్ ఏర్పాటు చేసిన పరీక్షలో ప్రతిభ చూపించి అమెరికాలో చదివేందుకు ఎంపిక య్యారు. మన్యంలోని గిరిజన మహిళలు ఉన్నత స్థాయికి చేరుకునేం దుకు ఈ పాఠశాల పునాదిగా మారింది.

**ఈ స్థాయిలో ఉండటానికి పాఠశాలే కారణం**

**ఏటీడబ్ల్యూఓ రూపాదేవి**

తాను ఇల్లెందు ఏటీడబ్ల్యూఓగా ఉండటానికి ఈ పాఠశాలలో చదవడమే కారణం. నేలకొండపల్లి మండలంలోని మారుమూల గ్రామానికి చెందిన నేను ప్రవేశ పరీక్ష రాసి ఇల్లెందు గురుకుల బాలికల పాఠశాలలో సీటు సంపాదించాను. 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఇక్కడే చదివాను. ఉపాధ్యాయుల బోధనలు, మెరుగైన సౌకర్యాలతో విద్యపై పట్టు సాధించాను. వారి ప్రోత్సాహంతో ఇంటర్, డిగ్రీ, బీఈడీ పూర్తి చేసి ప్రభుత్వ వార్డెన్‌గా ఉద్యోగం సాధించాను. ప్రస్తుతం ఏటీడబ్ల్యూఓగా కొనసాగుతున్నా.

**జీవితం మలుపు తిరిగింది**

జర్పుల అరుణ, సాఫ్ట్‌వేర్ ఉద్యోగిఇల్లెందుకు చెందిన నేను 5వ తరగతిలో ఈ పాఠశాలలో చేరాను. ఉపాధ్యాయులు తమలో ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు నాణ్యమైన బోధన అందించారు. క్రమశిక్షణ నేర్పారు. వారి ప్రోత్సాహంతో కష్టపడి చదివి ప్రతిభా స్కాలర్‌షిప్ ద్వారా ఇంటర్, అనంతరం ఎంసెట్‌లో మెరుగైన ర్యాంకు సాధించి ఓయూలో ఇంజనీరింగ్ పూర్తి చేశాను. ప్రస్తుతం మంచి వేతనంతో హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాను.

# ఆపన్నహస్తం అందించరూ..?

కొత్తగూడెం : ఆయనో ఆటోడ్రైవర్. ఉన్నంతలో సంపాదిస్తూ కుటుంబాన్ని సంతోషంగా చూసుకుంటున్నారు. ఇంతలో అనుకోని ఉపద్రవం ఎదురైంది. రోడ్డు ప్రమాదం ఆయన ఆరోగ్యాన్ని, కుటుంబ పరిస్థితుల్ని తలకిందులు చేసింది. శస్త్రచికిత్స చేయించేందుకు చేతిలో చిల్లిగవ్వలేక కుటుంబీకులు పడుతున్న ఆవేదన అంతా ఇంతా కాదు. కొత్తగూడెం పట్టణం రామాటాకీస్ ఏరియాకు చెందిన ఎండీ మహమూద్‌కు భార్య వహిదా, ఐదో తరగతి చదివే సానియా, రెండో తరగతి చదివే చిన్న కుమార్తె సనమ్ ఉన్నారు. ఆటో డ్రైవర్‌గా పనిచేసి కుటుంబాన్ని పోషించుకొంటున్నారు. 2019లో ఇల్లెందు నుంచి కొత్తగూడెంకు ప్రయాణికులతో వస్తుండగా.. ముత్యాలంపాడు వద్ద ఓ లారీ వేగంగా వచ్చి ఢీకొంది. దీంతో కుడి కాలికి తీవ్రగాయమైంది. హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో 'ఆరోగ్యశ్రీ' ద్వారా మోకాలికి



శస్త్రచికిత్స చేయించారు. అది విజయవంతం కాలేదు. మళ్లీ ఏడాది తర్వాత ఆపరేషన్ చేశారు. అయినా పూర్తిగా కోలుకోలేకపోయారు. తొంటి భాగంలో శస్త్రచికిత్స చేస్తేనే ఉపశమనం లభిస్తుందన్నది వైద్యుల సూచన. ఇప్పుడాయన స్టాండ్ ఆధారం లేనిదే అడుగు ముందుకు వేయలేకపోతున్నారు. భర్త ఇంటికే పరిమితం కావడంతో భార్య వహిదా సమీపంలోని అప్పడాల తయారీ పరిశ్రమలో పనికి కుదిరారు. ఆమె సంపాదనే కుటుంబానికి ఆధారమైంది. చాలీచాలని ఆదాయంతో పిల్లల పోషణ, చదువులు భారంగా మారాయని వహిదా వాపోతున్నారు. 'ఇప్పటికే ఆరోగ్యశ్రీ కింద రెండుసార్లు శస్త్రచికిత్సలు జరిగాయి. మూడోసారి ప్రైవేటుగా ఆపరేషన్ చేయించాలంటే రూ. 2. 5 లక్షలకు పైగా ఖర్చు అవుతుందని వైద్యులు తెలిపారు. దాతలు స్పందించి సాయం చేస్తే కుటుంబానికి భారంగా మారకుండా తన పని తాను చూసుకుంటానని' మహమూద్ వేడుకుంటున్నారు.

# మన్యం విద్యావిధానం బెస్ట్..!




ఖమ్మం : కార్పొరేట్‌కు దీటుగా విద్యాబోధన సాగించేందుకు గిరిజన సంక్షేమశాఖ బేసిక్ ఎడ్యుకేషన్ ఫర్ ఎస్టీ (బెస్ట్) అనే కార్యక్రమాన్ని చేపట్టింది. దీన్ని 2023-24 విద్యా సంవత్సరం నుంచి అమలుచేసేందుకు యత్నిస్తోంది. ఒకటోతరగతి నుంచి ఐదోతరగతి చదువుతున్న గిరిజన బాలబాలికల్లో కనీస సామర్థ్యాలను పెంచేందుకు ఈకార్యక్రమం దోహదపడుతుందని భావిస్తోంది. వీటికి సంబంధించిన పుస్తకాల తయారీ ప్రక్రియను భద్రాచలం ఐటీడీఏ పీఓ గౌతమ్ చొరవతో డీడీ రమాదేవి పర్యవేక్షిస్తున్నారు. తెలుగు, ఇంగ్లిష్, గణితం, సైన్స్ ఎలా బోధిస్తే విద్యార్థులకు సులువుగా అర్థమవుతుందనే అంశంపై ఎంపిక చేసిన 39 మంది ఉపాధ్యాయులకు ఇప్పటికే ఒకసారి ఓఎస్డీ రాంలాల్ కార్యశాల నిర్వహించారు. పాఠ్యాంశాల తయారీపై మెలకువలు అందించారు. ఒక్కో సబ్జెక్టును తొమ్మిది లేదా పది మంది నిపుణులైన ఉపాధ్యాయులు రూపొందించారు. వీటిలో ఏ అంశం బాగుంటుందో నిర్ణయం తీసుకునేందుకు భద్రాచలంలోని విద్యా వనరుల విభాగానికి చేరుకున్నారు. శనివారం వరకు కార్యశాల కొనసాగనుంది.

**ప్రత్యేక పుస్తకంతో పాటు వర్క్ బుక్**

సాధారణంగా అందించే బుక్స్‌తో పాటు అందరికీ ఇక్కడ రూపొందించి న పుస్తకాలు ఇస్తారు. సబ్జెక్టుకు ఒక్కటి చొప్పున నాలుగు పుస్తకాలతో పాటు వాటికి సంబంధించి వర్క్ బుక్‌లను సిద్ధం చేస్తున్నారు. చదువుపై ఆసక్తి పెంచడంతో పాటు పోటీతత్వం అలవడేలా వీటి రూపకల్పన జరుగుతోంది. సొంతంగానే వర్క్ బుక్స్‌ను పూర్తి చేసేలా విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంచనున్నారు. ఉపాధ్యాయులకు హ్యాండ్ బుక్ ముద్రిస్తారు. విద్యార్థులకు ఎలా చెబితే ప్రగతి కనిపిస్తుందో పరిశోధించి చేతి పుస్తకాన్ని తయారుచేశారు. ప్రభుత్వ విద్యాలయాల్లో అమలవుతున్న 'తొలిమెట్టు'కు మించి 'బెస్ట్' కార్యక్రమం ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. మరో ప్రత్యేకత ఏంటంటే భద్రాచలం ఐటీడీఏ పరిధిలో రూపొందుతున్న ఈ పుస్తకాలను రూ.లక్షలు వెచ్చించి హైదరాబాద్‌లో గిరిజన సంక్షేమ శాఖ ముద్రించనుంది. ఏటూరునాగారం, ఉట్నూరు, మన్ననూరు ఐటీడీఏలతో పాటు రాష్ట్రంలో మిగతాచోట్ల గిరిజన సంక్షేమశాఖకు చెందిన విద్యాలయాల్లో వచ్చే విద్యా సంవత్సరం నుంచి 'బెస్ట్' అమలుకానుంది. మొత్తంగా 30 వేల మంది విద్యార్థులకు ప్రయోజనం కలగనుంది.

**కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా..**

రమాదేవి, డీడీ, ఐటీడీఏవిశాలమైన గదులు, ప్రశాంత వాతావరణంలో గిరిజన సంక్షేమశాఖ విద్యార్థులను ఉపాధ్యాయులు తీర్చిదిద్దుతున్నారు. ప్రభుత్వ పుస్తకాలతో పాటు 'బెస్ట్' పేరిట నిపుణులు రూపొందించిన బుక్స్‌ను ప్రతి విద్యార్థికి అందిస్తాం. అదేస్థాయిలో బోధన సాగించేందుకు కార్యాచరణ చేపట్టాం. 'బెస్ట్' విధానంతో కార్పొరేట్‌కు దీటుగా మన్యం విద్యాలయాలు రాణించనున్నాయి.

# అన్నదాతలకు అండదండలు



ఖమ్మం : సమాజానికి పట్టెడన్నం పెట్టే అన్నదాతకు అండగా నిలవాలన్నదే ఆ సంస్థ ఉద్దేశం. అర్హులను గుర్తించి పంట పొలాల్లో నీటి కుంటలు, చేపల చెరువులు ఉచితంగా తవ్విస్తోంది. పొలం గట్లను పటిష్ఠపరిచి పైర్లు వరదల పాలుకాకుండా ఆదుకుంటోంది. వ్యవసాయ అవసరాలకు వడ్డీ వ్యాపారులపై ఆధారపడకుండా సంఘాలు ఏర్పాటు చేయించింది. ఆ సంస్థే.. సారపాక ఐటీసీకి చెందిన 'ధాన్ ఫౌండేషన్' .రైతులకు సహకారమందించాలనే సంకల్పంతో 2015లో 'ధాన్ ఫౌండేషన్' ఏర్పాటైంది. భద్రాద్రి జిల్లాలోని పాల్వంచ, కొత్తగూడెం, జూలూరుపాడు, సుజాతనగర్, చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి, అన్నపురెడ్డిప ల్లి, చంద్రుగొండ మండలాల్లో ప్రస్తుతం కార్యకలాపాలు నిర్వహిస్తోంది. ఒక్కో మండలంలో ముగ్గురు ప్రతినిధులను నియమించింది. అర్హులైన రైతులను ప్రాధాన్య క్రమంలో ఎంపిక చేసి వారు కోరిన విధంగా నీటికుంటలు, చెరువుల నిర్మాణంతో పాటు పూడికతీత పనులు చేపడుతోంది. ఇందుకోసం ఒక్కో మండలానికి ఏడాదికి సుమారు రూ. 2 కోట్లు వెచ్చిస్తోంది. నీటి కుంటకు రూ. 20 వేలు- 40 వేలు, చెరువుకు రూ. లక్ష, ఒక చెరువులో పూడికతీతకు రూ. 50 వేలు- లక్ష వరకు ఇస్తోంది. జిల్లా వ్యాప్తంగా ఎనిమిది మండలాల్లో 1,000 నీటికుంటలు, 150 కొత్త చెరువులు, 200 చెరువుల్లో పూడికతీత పనులు చేపట్టింది. వర్షాలకు తెగిపోయే గట్లను రాతికట్టలతో పటిష్ఠపరిచేందుకూ చేయూతనందిస్తోంది. ఇప్పటివరకు 2 వేల మంది రైతులు లబ్ధి పొందారు. 390 రైతు సంఘాలను ఫౌండేషన్ ఏర్పాటు చేయించింది. వ్యవసాయ అవసరాలకు రూ. 50 వేల నుంచి రూ. 3 లక్షల వరకు బ్యాంకు రుణాలను తక్కువ వడ్డీకి మంజూరు చేయిస్తోంది. రైతు సంఘాల్లో 4వేల మంది కర్షకులు సభ్యులుగా చేరారు. 'మూడేళ్ల క్రితం నా పట్టా పొలంలో ఫౌండేషన్ ప్రతినిధులు చేపల చెరువు తవ్వించారు. నా నుంచి పైసా తీసుకోలేదు. ఏటా రూ. 70వేల నుంచి రూ. 90వేల వరకు ఆదాయం వస్తోంది.' ల్లెల వెంకట్రామయ్య, బంద్రుగొండ, పాల్వంచ మండలం 'సంస్థ తవ్వించిన నీటి కుంటలో చేపలు పెంచుతున్నాను. ఆ నీటితో కూరగాయలు పండిస్తూ ఏటా రూ. 50వేలు- 60వేల ఆదాయం పొందుతున్నా. పొలంలో రూ. 20వేలతో రాతికట్ట నిర్మించారు.'

పిల్లి శ్రీను, సంగం, పాల్వంచ మండలం

'అధిక వర్షాల కారణంగా సుమారు అరెకరం పొలం ఇసుక మేటలు వేస్తోంది. ఐదేళ్ల క్రితం ఫౌండేషన్ ప్రతినిధులు రూ. 50వేలతో మేటలు తొలగించి నీటి కుంట నిర్మించారు. ప్రస్తుతం ఎకరం పొలంలో కూరగాయలు పండిస్తున్నాను. చేపల చెరువు తవ్వాలనుకుంటున్నా.'

పోలెబోయిన వెంకటేశ్వరరావు, దంతెలబోర, పాల్వంచ మండలం

'పట్టా పొలంలో నీటికుంట ఏర్పాటు చేయించుకున్నా. చేపలు పెంచడంతో పాటు కూరగాయలు పండిస్తూ ఆర్థికంగా నిలదొక్కుకు న్నా.' భూక్యా మదన్‌సింగ్, సీతంపేటబంజర, సుజాతనగర్

ఎంపిక చేసిన పనులను వేసవిలో చేపడుతున్నాం. ఈఏడాది రైతు సంఘాల సంఖ్య పెంచుతాం. 'ఐటీసీ' ఆర్థిక సహకారంతో అన్నదాతలకు అండగా నిలుస్తున్నాం. భవిష్యత్తులో ఖమ్మం సహా రాష్ట్రంలోని మరో ఎనిమిది జిల్లాల్లో కార్యకలాపాలు విస్తరిస్తాం. భద్రాద్రిలో ఈ ఏడాది మరికొన్ని మండలాల్లో పనులు చేపడతాం. సాయం కావాల్సినవారు ఫౌండేషన్ ప్రతినిధులను సంప్రదించాలి. సయ్యద్ అలీఖాన్, జిల్లా సమన్వయకర్త, ధాన్ ఫౌండేషన్

# అకాల వర్షం.. పంటలకు నష్టం



ఖమ్మం : అకాల వర్షంతో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో వివిధ పంటలకు నష్టం వాటిల్లింది. రాబోయే నాలుగు రోజుల పాటు కొన్నిప్రాంతాల్లో మోస్తారుగా.. మరికొన్నిచోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ విభాగం అధికారులు తెలిపారు. గంటకు 30 నుంచి 40 కి.మీ.వేగంతో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురవొచ్చు. బంగ్లాదేశ్, దాని పరిసర ప్రాంతం నుంచి గంగా, పశ్చిమ బంగ, ఒడిశా మీదుగా ఆంధ్రప్రదేశ్ వరకు సముద్ర మట్టానికి 0.9 కి.మీ ఎత్తులో ఉపరితల ద్రోణి ఏర్పడింది. ఉభయ జిల్లాల్లో అక్కడక్కడ చెట్లు, విద్యుత్తు స్తంభాలు నేలకొరిగాయి. చర్ల మండలం మామిడిగూడెంలో పిడుగుపాటుకు 20 జీవాలు మృత్యువాత పడ్డాయి. రైతుల్లో ఆందోళన: అకాల వర్షం వల్ల బోనకల్లు, మధిర, రఘునాథపాలెం, చింతకాని, కొణిజర్ల, వైరా, భద్రాచలం, అశ్వాపురం, పినపాక, గుండాల, చర్ల తదితర మండలాల్లో వివిధ పంటలు దెబ్బతిన్నాయి. ఆంధ్రాకు సరిహద్దు గ్రామాలైన మల్లారం, రంపిమళ్ల, జాలిముడి, సిరిపురం, నిదానపురం, రాయన్నపేటలో మొక్కజొన్న పంటలు నేలకు ఒరగటంతో రైతులు నష్టపోయారు. కంకి కోసే సమయంలో కిందపడిపోవటం వల్ల యంత్రాలతో కోతలు కోయలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం వరి పైర్లు సుంకు దశలో ఉన్నాయి. సాగర్ ఆయకట్టులోని అనేక ప్రాంతాల్లో సుంకురాలి పోవటం వల్ల ధాన్యం తాలు అవుతుందని కర్షకులు ఆందోళన చెందుతున్నారు. మామిడి తోటలు ప్రస్తుతం పూత, పిందె రెండో దశలో ఉన్నాయి. వర్షాలు ఇదే విధంగా నాలుగైదు రోజులు కురిస్తే భూమిలో తేమ శాతం పెరగటం వల్ల పూత, పిందె రాలిపోయే ప్రమాదముంది. దీని ప్రభావం దిగుబడిపై గణనీయంగా పడొచ్చు. ఎండు మిరపకు ప్రస్తుతం విపణిలో డిమాండ్ ఉంది. ఎన్నో ఆశలతో పంటను కోసే సమయంలో వర్షం వల్ల తొడిమల్లోకి నీరుపోయి తాలుగా మారుతుందని అన్నదాతలు చెబుతున్నారు. మిరప రాసులపై టార్పాలిన్ పట్టాలు కప్పుకోవాలని, కోత దశకు వచ్చిన కూరగాయల్ని వెంటనే కోసి మార్కెట్‌కు తరలించాలని వైరా కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ హేమంత్‌కుమార్ సూచించారు.

# కట్టేదెందుకు.. కూల్చేటందుకు!

వరంగల్ : ఇది వరంగల్‌లోని పోచమ్మమైదాన్ నుంచి జేపీఎన్ రోడ్డు వరకు ఇటీవల స్మార్ట్ సిటీ పథకం కింద నిర్మించిన రహదారి. నిబంధనల ప్రకారం స్మార్ట్ సిటీ రోడ్లకు డివైడర్లు ఉండాలి. సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుచేయాలి. రోడ్డు వేసిన కొన్ని రోజుల్లోనే డివైడర్‌ను మళ్లీ కూల్చేస్తున్నారు. ఇది చూసిన జనం 'హవ్వా! ఇదేం విడ్డారం. మొన్ననే రోడ్డు వేసి మళ్లీ ఇంతలోనే డివైడర్‌ను తొలగిస్తున్నారేంటి' అంటూ ముక్కున వేలేసుకుంటున్నారు. నగరంలో బల్దియా చేపడుతున్న పలు పనులు అనాలోచితంగా ఉంటున్నాయి. నిర్మాణాలు చేపట్టడం, వెంటనే అవి స్థానిక అవసరాలకు సరిపోవడం లేదంటూ కూల్చేయడం పరిపాటిగా మారింది. ఈ క్రమంలో రూ.కోట్ల ప్రజాధనం వృథా అవుతున్నా అధికారులు తమకు పట్టనట్టు వ్యవహరిస్తున్నారు.వరంగల్‌లో రూ. 72 కోట్లతో స్మార్ట్‌సిటీ రహదారులను నిర్మించారు. అందులో ఒకటి పోచమ్మమైదాన్ నుంచి జేపీఎన్ రోడ్డు వరకు ఉన్న దారి. మూడు నాలుగు రోజులుగా రాత్రి వేళ డివైడర్‌ను జేసీబీలు పెట్టి వేగంగా తొలగిస్తున్నారు. కొందరు వ్యాపారులకు అనుకూలంగా లేదని ఈ నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం.



విభాగినులు కట్టి ఇలా తొలగించడం వల్ల ప్రజాధనం రూ. 6 లక్షల నుంచి రూ. 8 లక్షలు మట్టి పాలయ్యింది.

**డ్రైనేజీ అంతే..**

నిర్మాణాలు చేయడం, తర్వాత వాటిని కూల్చేయడం ఇదేం కొత్త కాదు.. వరంగల్‌లో నిర్మించిన భూగర్భ డ్రైనేజీ విషయంలో యథేచ్ఛగా డిజైన్లు మార్చేశారు. అండర్ గ్రౌండ్ డక్ట్ డ్రైనేజీ నిర్మించాలి. డక్ట్‌కు బదులు వరంగల్‌లో పైపులైన్లు ఏర్పాటు చేశారు. వరంగల్ తూర్పులోని పోచమ్మ మైదాన్, జేపీఎన్ రోడ్డు, స్టేషన్ రోడ్డు.. ఇలా అయిదారు చోట్ల డక్ట్‌లకు బదులు పైపులు వేసి డిజైన్ మార్చారు. ఇందులోనూ పలు చోట్ల ఛాంబర్లు కట్టి మళ్లీ తొలగించడం అప్పట్లో చర్చనీయాంశమైంది. హనుమకొండలోని నిట్ క్యాంపస్ నుంచి సుబేదారి వరకు రూ. 1.30 కోట్లతో సైకిల్ ట్రాక్‌ను అనాలోచితంగా ఏర్పాటు చేశారు. సైకిళ్ల రాకపోకలకు ఏమాత్రం అనువుగా లేకుండా నిర్మించడం, స్థానిక వ్యాపారులకు పార్కింగ్ ఇబ్బందిగా మారడంతో దీన్ని ఎవరికి వారు ఇష్టారీతిన కూల్చేస్తున్నారు. ఇక్కడ సైకిల్ ట్రాక్ నిర్మిస్తే ఎలాంటి ఇబ్బందులు వస్తాయి.. సైక్లిస్టులకు ఏ మేరకు ఉపయోగం అని దీన్ని డిజైన్ చేసిన అధికారులు, ఇంజినీర్లు అంచనా వేయలేకపోయారు. రాజకీయ ఒత్తిళ్ల వల్లే?ఒక శాశ్వత నిర్మాణం చేసే ముందు అధికారులు, ఇంజినీర్లు, ప్రజాప్రతినిధులు కలిసి చర్చించాలి. డిజైన్లపై విశ్లేషణ జరగాలి. స్థానిక అవసరాలకు అనుగుణంగా ఉండేలా చూడాలి. నగరంలో మాత్రం అధికారులు ఒకటి కట్టడం, పనులన్నీ పూర్తయ్యే దశలో ప్రజాప్రతినిధులు వ్యతిరేకించడం, అనాలోచితంగా కూల్చేయడం చూస్తుంటే బల్దియాలో ఏమాత్రం సమన్వయం లేనట్టు స్పష్టమవుతోంది. అనేక చోట్ల పలువురు ప్రజాప్రతినిధులు చెప్పిందే చెల్లుతుండడంతో గుత్తేదారులు, వారి మనుషులదే రాజ్యంగా మారింది. బల్దియా అధికారులు, ఇంజినీర్లు ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారు.

# నిబంధనల మార్పుతో 'ఉపాధి' కూలీల అవస్థలు

జనగామ : జాతీయగ్రామీణ ఉపాధిహామీ పథకం అమలులో నిబంధనలను మరింత కఠినతరం చేశారు. సాంకేతిక సమస్యలతో జిల్లాలో ఉపాధిహామీ పనులకు వెళ్లేందుకు కూలీల్లో ఆసక్తి తగ్గుతోంది. ఏటా ఉపాధి పనులకు వెళ్లే కూలీల సంఖ్య తగ్గిపోవడంతో పనులు నామ మాత్రంగా సాగుతున్నాయి. ప్రభుత్వం అందించే దినసరి కూలీ రూ. 257 కాగా జిల్లాలో సరాసరి దినసరి కూలీ రూ. 151 మాత్రమే ఇవ్వడం దీనికి కారణంగా తెలుస్తోంది. కొలతల ప్రకారం పనులు జరగకపోవడం, పనులను పూర్తి చేయడంలో ఎదురవుతున్న ఇబ్బందులు దృష్ట్యా వేతనాలు తక్కువగా ఇస్తున్నట్లు తెలుస్తోంది. జిల్లాలో 14,500 మంది ఉపాధి కూలీలు ఉన్నారు.

**ఆధార్ పూర్తయిన కూలీలు : 1,40,822**

జిల్లాలోని 281 పంచాయతీల్లో మొత్తం 1,17,419 జాబ్ కార్డుదారులు ఉండగా వీరిలో పనులు చేస్తున్న వారు 83,270 మందే ఉన్నారు. వీరిలో ఏడాదికి నగటున 1,41,939 మంది పనులకు హాజరవుతున్నారు. జిల్లాలో మొత్తం 2,35,722 మంది కూలీలు ఉ ండగా వీరిలో 1,40,822 మంది కూలీల ఆధార్ అనుసంధానం పూర్తి కాగా మిగతా వారివి చేయాల్సి ఉంది.

మార్పులు ఇలా..ప్రతి కూలీ ఉదయం, సాయంత్రం పనికి హాజరు కావాలని నిబంధనలు ఉన్నాయి. పని ప్రదేశం నుంచి రోజుకు రెండుసార్లు స్థానిక క్షేత్ర సహాయక సిబ్బంది లేదా మేట్ కూలీ ఫొటో తీసి నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం ద్వారా అప్‌లోడ్ చేయాలి. ఇలా చేస్తేనే కూలీకి మస్టర్ పడుతుంది. లేకపోతే మస్టర్ లేనట్లే. ఉదయం 6 నుంచి 11 గంటల లోపు.. మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు పని చేసిన చిత్రాలు తప్పనిసరి. చిత్రానికి చిత్రానికి మధ్య నాలుగు గంటల వ్యవధి ఉండాలి. దీంతో పలు చోట్ల ఉదయం 6 గంటలకు ఒకసారి, మళ్లీ 11 గంటలకు ఒకసారి ఫొటో తీస్తూ కూలీలకు వెసులుబాటు కల్పిస్తూ పనులకు హాజరయ్యేలా చొరవ తీసుకుంటున్నారు.

ఆధార్ అనుసంధానం కీలకమే..జిల్లాలోని 12 మండలాల్లో ఆధార్ అనుసంధాన ప్రక్రియ కొనసాగుతోంది. ఇలా ప్రతి జాబ్ కార్డుదారుడిని ఆధార్‌తో అనుసంధానం చేస్తేనే పని కల్పిస్తారు. అదే విధంగా ఆధార్ ఆధారిత చెల్లింపుల కోసం జాతీయ బ్యాంకు ఖాతాదారులైతే ఎన్‌పీసీఐ (నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) చేయించుకోవాల్సి ఉంటుంది. లోకల్ బ్యాంక్ ఖాతాదారులు తపాలా ఖాతాలతో అనుసంధానం చేసుకోవాల్సి ఉంటుంది. ప్రతి కూలీ బ్యాంకుకు వెళ్లి ఈకేవైసీ చేయించుకోవాలని అధికారులు గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన కల్పిస్తున్నారు.రోజుకు ఐదు గంటలు పని చేయాలి- గూడూరు రాంరెడ్డి, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి, జనగామ కేంద్ర ప్రభుత్వ ఆదేశానుసారం ఉపాధిహామీ పథకంలో నిబంధనలు మారాయి. రోజుకు కనీసం ఐదు గంటలు పని చేయాలి.



## అల్లాహ్ దీవెనలు మన రాష్ట్రంపై ఉండి..అందరికీ మంచి జరగాలి

### ముస్లింలకు సీఎం వైయస్ జగన్ మిలాద్ ఉన్ నబీ శుభాకాంక్షలు

తాడేపల్లి: ముస్లింలకు ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి మిలాద్ ఉన్ నబీ శుభాకాంక్షలు తెలిపారు.

"ప్రపంచ శాంతి కోసం మానవాళికి విలువైన సందేశాలు ఇచ్చిన మహోన్నత వ్యక్తి మహ్మద్ ప్రవక్త. నేడు ఆయన జన్మదినం సందర్భంగా ఆ అల్లాహ్ దీవెనలు మన రాష్ట్రంపై ఉండి, అందరికీ మంచి జరగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.

ముస్లిం సోదరసోదరీమణులకు మిలాద్ ఉన్ నబీ శుభాకాంక్షలు" అంటూ సీఎం వైయస్ జగన్ మోహన్ రెడ్డి ట్వీట్ చేశారు.

## ఎంఎస్ స్వామినాథన్ మృతి పట్ల సీఎం జగన్ సంతాపం



తాడేపల్లి: హరిత విప్లవ పితామహుడు ఎంఎస్ స్వామినాథన్ మృతిపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. "వ్యవసాయ శాస్త్రవేత్త అయిన స్వామినాథన్ గ్రామీణ రూపురేఖలను సమూలంగా మార్చారు. పద్మవిభూషణ్, మెగసెసె అవార్డు గ్రహీత ఎంఎస్ స్వామినాథన్ వ్యవసాయ రంగానికి ఆయన చేసిన కృషి అభినందనీయం. స్వామినాథన్ కృషి దేశాన్ని ఆహారోత్పత్తిలో బలోపేతం చేసి గ్రామీణ ఆర్థిక వ్యవస్థను సుసంపన్నం చేసింది" అని సీఎం జగన్ పేర్కొన్నారు. భారత హరిత విప్లవ పితామహుడిగా ప్రఖ్యాతిగాంచిన ఎమ్.ఎస్ స్వామినాథన్(98) కన్నుమూశారు. గత కొంతకాలంగా వృద్ధాప్య సమస్యలతో పోరాడుతున్న ఆయన.. చెన్నైలో తుదిశ్వాస విడిచారు. ఆహారాభివృద్ధిలో భారత్ స్వయం సమృద్ధి సాధించేందుకు స్వామినాథన్ ఎనలేని సేవ చేశారు. దేశంలో ఆహార కొరతను ఎదుర్కొనడానికి మేలైన వరి వంగడాలను స్వామినాథన్ సృష్టించారు. 1960 నుంచి 1970ల్లో స్వామినాథన్ చేసిన కృషి భారత వ్యవసాయ రంగాన్ని విప్లవాత్మకంగా మార్చింది. కరువు కోరల్లో చిక్కుకున్న భారత వ్యవసాయ రంగాన్ని స్వయం సమృద్ధివైపుకు మరలించారు. అధిక దిగుబడినిచ్చే గోధుమ, వరి వంగడాలను సృష్టించి వ్యవసాయ ఉత్పాదకతను అమాంతం పెంచారు.




దిల్లీ: ఈశాన్య రాష్ట్రం మణిపుర్‌లో మరోసారి కల్లోల పరిస్థితులు నెలకొన్నాయి.

విద్యార్థుల హత్యతో ఆందోళనలు చెలరేగాయి. ఈ నేపథ్యంలో కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. జమ్మూకశ్మీర్‌లోని శ్రీనగర్ ఎస్ఎస్పీ రాకేశ్ బల్వాల్‌ను తన సొంత కేడర్ అయిన మణిపుర్‌కు బదిలీ చేసింది. ఈ మేరకు కేంద్ర హోంశాఖ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో అల్లర్ల కట్టడి కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

**పుల్వామా దాడిని దర్యాప్తు చేసిన రాకేశ్..! :** రాజస్థాన్‌కు చెందిన రాకేశ్ బల్వాల్ 2012 బ్యాచ్ ఐపీఎస్ అధికారి. మణిపుర్ కేడర్‌లో ఐపీఎస్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆయన.. 2018లో ఎన్ఐఏలో ఎస్పీగా పదోన్నతి పొందారు. 2019లో పుల్వామాలో జరిగిన భీకర ఉగ్రదాడిలో 40 మంది సీఆర్పీఎఫ్ జవాన్లు ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ఈ ఘటనను దర్యాప్తు చేసిన ఎన్ఐఏ బృందంలో రాకేశ్ సభ్యుడిగా ఉన్నారు. ఆ తర్వాత 2021 డిసెంబరులో పదోన్నతిపై AGMUT (అరుణాచల్ ప్రదేశ్, గోవా, మిజోరం, కేంద్ర పాలిత ప్రాంతాలు) కేడర్‌కు బదిలీ అయ్యారు. శ్రీనగర్ సీనియర్ ఎస్పీగా బాధ్యతలు చేపట్టారు. గత కొన్నిరోజులుగా మణిపుర్‌లో ఉద్రిక్తతల నేపథ్యంలో ఆయన తిరిగి సొంత కేడర్ పంపించాలని కేంద్ర హోంశాఖ నిర్ణయించింది. తాజాగా దీనిపై ఉత్తర్వులు వెలువడ్డాయి. మణిపుర్‌లో శాంతి భద్రతలను పునరుద్ధరించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు హోంశాఖ వర్గాలు వెల్లడించాయి.




భారత్‌లో అమెరికా ఎంబసీ సరికొత్త రికార్డు సృష్టించింది. ప్రస్తుత సంవత్సరంలో అన్ని రకాల కలిపి మిలియన్ వీసాల ను జారీ చేయాలన్న తమ లక్ష్యాన్ని చేరుకుంది. ఈ ఏడాది ఇప్పటి వరకు భారతీయులకు జారీ చేసిన వీసాల సంఖ్య 10లక్షలు దాటింది. ఈ విషయాన్ని అమెరికా రాయబార కార్యాలయం తన అధికారిక సోషల్ మీడియా వేదికగా వెల్లడించింది. భారత్‌లో ఈ ఏడాది వీసాల ప్రక్రియలో మేం పెట్టుకున్న 'మిలియన్ వీసాల జారీ' లక్ష్యాన్ని దాటేశాం. అయితే, ఇక్కడితో మేం ఆగిపోం. రాబోయే నెలల్లో మరింత వృద్ధి సాధిస్తాం. అమెరికాలో పర్యటించేందుకు మరింత మంది భారతీయులకు అవకాశం కల్పిస్తాం" అని అమెరికా ఎంబసీ తమ పోస్ట్‌లో రాసుకొచ్చింది. దీనికి ఓ వీడియో కూడా జత చేసింది. ఆ వీడియోలో భారత్‌కు అమెరికా రాయబారి ఎరిక్ గార్సెట్టి మాట్లాడుతూ ఈ రికార్డుపై హర్షం వ్యక్తం చేశారు. "మా ద్వైపాక్షిక సంబంధాల్లో ముఖ్యమైన దేశాల్లో భారత్ ఒకటి. ప్రపంచంలోనే అత్యంత కీలకమైన బంధం మాది. మా రెండు దేశాల మధ్య భాగస్వామ్యం మరింత బలోపేతమైంది. ఈ బంధాన్ని ప్రత్యక్షంగా చూసేందుకు రాబోయే రోజుల్లో మరింత మంది భారతీయులకు రికార్డు స్థాయిలో వీసాలు అందజేస్తాం" అని గార్సెట్టి తెలిపారు. 2022 ఏడాది మొత్తంలో జారీ చేసిన వీసాలను మించి.. ఈ ఏడాది ఇప్పటికే వీసాలు జారీ అయ్యాయని యూఎస్ ఎంబసీ వెల్లడించింది. ఇక 2019 నాటితో పోలిస్తే ఇది 20శాతం ఎక్కువ అని తెలిపింది. ప్రస్తుతం అమెరికా ప్రపంచవ్యాప్తంగా జారీ చేసిన వీసాల్లో 10 శాతం భారతీయులకే దక్కాయి. ఇక విద్యార్థి వీసాల్లో 20శాతం, హెచ్, ఎల్ కేటగిరీ ఉద్యోగ వీసాల్లో 65శాతం భారతీయులకే జారీ అయ్యాయి.



## రంపం పట్టిన రాహుల్.. వడ్రంగి పనివారితో చిట్‌చాట్

దిల్లీ: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మరో కొత్త అవతారం ఎత్తారు. మొన్నటికి మొన్న ట్రాక్టర్ దుక్కి దున్ని వరినాట్లు వేసిన రాహుల్.. ఇటీవల రైల్వే స్టేషన్‌లో హమాలీలతో ముచ్చటించడంతో పాటు కూలీ అవతారమూ ఎత్తారు. తాజాగా దిల్లీలోని అతిపెద్ద ఫర్నీచర్ మార్కెట్ కృతి నగర్‌లో పర్యటించారు. అక్కడి వడ్రంగి పనివారిని కలిసి వారితో మాట్లాడారు. వారి కష్టాలను అడిగి తెలుసుకున్నారు.

పనిలో పనిగా ఫర్నీచర్ తయారీలో తాను ఓ చేయి వేశారు. ఫర్నీచర్ మార్కెట్ పర్యటనకు సంబంధించిన చిత్రాలను రాహుల్ స్వయంగా పోస్ట్ చేశారు. "ఈ రోజు దిల్లీలోని కీర్తినగర్‌లో ఉన్న ఆసియాలోనే అతిపెద్ద ఫర్నీచర్ మార్కెట్‌కి వెళ్లి కార్పెంటర్ సోదరులను కలిశాను. వారు హార్డ్ వర్కర్లే కాకుండా కాదు.. అద్భుతమైన కళాకారులు కూడా. వారి నుంచి కొన్ని నైపుణ్యాలు తెలుసుకోవడంతో పాటు నేర్చుకోవడానికి ప్రయత్నించా" అంటూ రాసుకొచ్చారు. కాంగ్రెస్‌పార్టీ ఈ చిత్రాలను పోస్ట్ చేస్తూ 'భారత్ జోడో యాత్ర' కొనసాగుతోంది అని క్యాప్షన్ ఇచ్చింది.




## అమిత్‌షాకు తెదేపా ఎంపీ రామ్మోహన్ ఫిర్యాదు

అమరావతి: ఏపీ సీఐడీ చీఫ్ సంజయ్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు తెదేపా ఎంపీ రామ్మోహన్‌నాయుడు ఫిర్యాదు చేశారు. సర్వీస్ రూల్స్‌ను అతిక్రమించి వైకాపాకు తొత్తుగా సీఐడీ చీఫ్ పనిచేస్తున్నారని ఆయన తన ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఈ మేరకు ఎంపీ లేఖ రాశారు. సంజయ్‌పై చర్యలు తీసుకోవాలంటూ సంబంధిత ఆధారాలను జతచేశారు. "విచారణ లేకుండా స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో తెదేపా అధినేత చంద్రబాబును అరెస్ట్ చేశారు. రాజకీయ పక్షపాతాలు లేకుండా పనిచేయాల్సిన సీఐడీ చీఫ్ అన్నీ ఉల్లంఘించారు. సీఎం జగన్ మెప్పు కోసం ప్రతిపక్షాలపై బురద చల్లుతున్నారు. సర్వీసు నిబంధనలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ప్రెస్‌మీట్లు పెడుతున్నారు.

దర్యాప్తు అంశాలను గోప్యంగా ఉంచాల్సిన సీఐడీ అధికారులు ఉద్దేశపూర్వకంగానే చంద్రబాబు పరువు ప్రతిష్ఠలకు భంగం కలిగిస్తున్నారు" అని రామ్మోహన్‌నాయుడు తన ఫిర్యాదులో పేర్కొన్నారు.




## చంద్రబాబు అక్రమ అరెస్టుపై టీడీపీ ఫైర్

తిరుపతి: చంద్రబాబు అక్రమ అరెస్టుపై తెలుగుదేశం మండిపడుతోంది. ఏపీ వ్యాప్తంగా ఆందోళనలను ఉధృతం చేసింది. సీఎం జగన్ నియంతలా వ్యవహరిస్తున్నారని గురువారం తిరుపతిలో టీడీపీ నేతలు ఆరోపించారు. అభివృద్ధికి సంకెళ్లా అంటూ టీడీపీ నేతలు, కార్యకర్తలు నిప్పులు చెరిగారు. ప్రాథమిక హక్కులకు భంగం కలిగించేలా వైసీపీ వ్యవహరిస్తోందని మాజీ మంత్రి పనబాక లక్ష్మి విమర్శించారు. జగన్ సర్కార్ టీడీపీ నేతలపై ఎన్ని అక్రమ కేసులు పెట్టినా జనం నమ్మరని అన్నారు. సర్కార్ తీనును నిరసిస్తూ టీడీపీ కార్యకర్తలు సంకెళు వేసుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి పనబాక లక్ష్మి మాట్లాడుతూ రాష్ట్రంలో ఫండమెంటల్ రైట్స్‌కు సంకెళ్లు వేసిన ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలనే తామంతా ఈరోజు సంకెళ్లు వేసుకుని నిరసన చేపట్టామన్నారు. రాష్ట్రంలో వాక్ స్వాతంత్ర్యం లేదని, నిరసన తెలపడానికి కూడా తమకు హక్కులేదని.. తమ హక్కులను కాలరాస్తున్న జగన్ ప్రభుత్వానికి త్వరలోనే బుద్ధి చెప్పే రోజు వస్తుందని అన్నారు. నిన్న నెల్లూరు జిల్లాలో విక్రమసింహపురి యూనివర్శిటీకి వెళ్లి స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాన్ని సందర్శించామని, అనేకమంది అక్కడ శిక్షణ పొందుతున్నారని, వందలాదిమంది శిక్షణ పొందినవాళ్లు ఉద్యోగాల్లో ఉన్నామని చెప్పారని పనబాక లక్ష్మి అన్నారు.




భారత హరిత విప్లవ పితామహుడు, ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్ కన్నుమూశారు. వృద్ధాప్య సమస్యలతో గురువారం (సెప్టెంబరు 28) ఉదయం 11 గంటల ప్రాంతంలో తన నివాసంలో తుదిశ్వాస విడిచినట్లు ఆయన కుటుంబ సన్నిహిత వర్గాలు వెల్లడించాయి. స్వామినాథన్ 1925 ఆగస్టు 7న అప్పటి మద్రాసు ప్రెసిడెన్సీలోని కుంభకోణంలో జన్మించారు. ఆయన తండ్రి ఎంకే సాంబశివన్ సర్జన్. మెట్రిక్యులేషన్ పూర్తయిన తర్వాత స్వామినాథన్ కూడా తండ్రి బాటలోనే మెడికల్ స్కూల్లో చేరారు. కానీ, 1943లో బెంగాల్ కరవును కళ్లారా చూసిన ఆయన చలించిపోయారు. దేశాన్ని ఆకలి నుంచి కాపాడాలన్న లక్ష్యంతో వైద్య రంగం నుంచి తన మనసు మార్చుకుని వ్యవసాయ పరిశోధనల వైపు అడుగువేశారు. త్రివేండ్రంలోని మహారాజా కాలేజీలో జువాలజీ నుంచి యూజీ డిగ్రీ పట్టా పొందిన ఆయన.. ఆ తర్వాత మద్రాసు అగ్రికల్చరల్ కాలేజీలో చేరారు. అగ్రికల్చరల్ సైన్స్‌లో బ్యాచిలర్ డిగ్రీ పూర్తి చేశారు. ఆ తర్వాత దిల్లీలోని భారత వ్యవసాయ పరిశోధనా సంస్థలో పీజీ చదివారు. పీజీ పూర్తయిన తర్వాత స్వామినాథన్ యూపీఎస్సీ పరీక్ష రాసి ఐపీఎస్‌కు అర్హత సాధించారు. కానీ, ఆ అవకాశాన్ని వదులుకుని యునెస్కో ఫెలోషిప్‌తో నెదర్లాండ్స్‌లోని అగ్రికల్చరల్ యూనివర్సిటీలో చేరారు. అక్కడ బంగాళదుంప జన్యు పరిణామంపై అధ్యయనం చేశారు. అక్కడి నుంచి కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్‌లో చేరి పీహెచ్‌డీ పూర్తిచేశారు. కొంతకాలం అక్కడ పనిచేసిన ఆయన.. 1954లో భారత్‌కు తిరిగొచ్చి IARIలో శాస్త్రవేత్తగా రీసెర్చ్ కొనసాగించారు. 1972-79 మధ్య ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ డైరెక్టర్ జనరల్‌గా, డిపార్ట్‌మెంట్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్, ఎడ్యుకేషన్ సెక్రటరీగా వ్యవహరించారు. 1979లో కేంద్ర ప్రభుత్వం ఆయన్ను వ్యవసాయ శాఖకు ప్రిన్సిపల్ సెక్రటరీగా నియమించింది.

**భారత్‌లో హరిత విప్లవానికి నాంది పలికి..** భూములకు నీటిపారుదల సౌకర్యాన్ని కల్పించి, యాంత్రీకరణను ప్రవేశపెట్టి, రసాయనిక ఎరువులను, క్రిమిసంహారక మందులను వాడి, సంకర జాతి వంగడాలతో స్వల్పకాలంలో అధిక దిగుబడిని సాధించే విధానాలు అనుసరించడం మొదలుపెట్టడాన్ని హరిత విప్లవం అంటారు. ఇది తొలిసారి మెక్సికోలో 1945లో ప్రారంభమైంది. పెరుగుతున్న జనాభా అవసరాలను తీర్చడానికి మెక్సికో ప్రభుత్వం వివిధ రకాలైన గోధుమ వంగడాలను అభివృద్ధి చేసింది. మెక్సికోలో నార్మన్ బోర్లాగ్ నేతృత్వంలో సాధించిన విజయాన్ని స్ఫూర్తిగా తీసుకుని రాక్‌ఫెల్లర్ ఫౌండేషన్ ఈ విప్లవాన్ని ఇతర దేశాలను విస్తరించడానికి నిర్ణయించింది. అదే సమయంలో 1960ల్లో భారత్ తీవ్ర కరవు పరిస్థితులు ఎదుర్కొంది. ఆ సమయంలో కేంద్ర వ్యవసాయ శాఖకు సలహాదారుగా ఉన్న ఎంఎస్ స్వామినాథన్.. మెక్సికో హరిత విప్లవ పితామహుడు నార్మన్ బోర్లాగ్‌ను దేశానికి ఆహ్వానించారు.

ప్రభుత్వ పరంగా ఇబ్బందులున్నప్పటికీ.. మెక్సికో ప్రయోగశాల నుంచి గోధుమను దిగుమతి చేసుకుని ప్రయోగాత్మకంగా పంజాబ్‌లో పండించారు. అవి మంచి దిగుబడి రావడంతో భారత్‌లో హరిత విప్లవానికి నాంది పలికినట్లయింది. దీంతో స్వామినాథన్‌ను భారత హరిత విప్లవ పితామహుడిగా అభివర్ణిస్తారు.

**పద్మవిభూషణ్‌తో సత్కారం..** దేశంలో ఆహార ధాన్యాల ఉత్పత్తిని గణనీయంగా పెంచడంలో స్వామినాథన్ విశేష కృషి చేశారు. అధిక దిగుబడినిచ్చే వరి, గోధుమ వంగడాల రూపకల్పనలో కీలక పాత్ర పోషించారు. ఆయన సేవలకు గుర్తింపుగా అనేక అవార్డులు వరించాయి. 1971లో రామన్ మెగసెసే అవార్డు అందుకున్నారు. 1999లో ఇందిరాగాంధీ శాంతి బహుమతి, 1987లో వరల్డ్ ఫుడ్ ప్రైజ్ అందుకున్నారు. ఆయన సేవలకుగానూ కేంద్ర ప్రభుత్వం 1967లో పద్మశ్రీ, 1972లో పద్మభూషణ్, 1989లో పద్మవిభూషణ్ పురస్కారంతో సత్కరించింది. 2007 నుంచి 2013 మధ్య పార్లమెంట్‌కు నామినేట్ ఎంపీగా సేవలందించారు. 1988లో ఎంఎస్ స్వామినాథన్ లాభాపేక్ష లేని రీసెర్చ్ ఫౌండేషన్‌ను స్థాపించారు.

**డబ్ల్యూహెచ్‌వోలో స్వామినాథన్ కుమార్తె..** స్వామినాథన్‌కు ముగ్గురు కుమార్తెలు. వీరిలో ఒకరైన సౌమ్య స్వామినాథన్ ప్రపంచ ఆరోగ్య సంస్థలో 2019 నుంచి 2022 వరకు చీఫ్ సైంటిస్ట్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. కరోనా సమయంలో ప్రపంచవ్యాప్తంగా వైరస్ వ్యాప్తి కట్టడి కోసం ఆమె ఎంతో కృషి చేశారు.

## భగత్‌సింగ్‌ను అసేతు హిమాచలం గుండెల్లో పెట్టుకొంది



అమరావతి: షహీద్ భగత్‌సింగ్ ఇంక్విలాబ్ జిందాబాద్ అని నినదించి యావత్ భరత జాతిలో పోరాట స్ఫూర్తిని రగిలించిన యోధుడని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ వ్యాఖ్యానించారు. గురువారం నాడు జనసేన పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ..."భగత్ సింగ్‌ను అసేతు హిమాచలం గుండెల్లో పెట్టుకొంది. ఆ వీరుని జయంతి సందర్భంగా అంజలి ఘటిస్తున్నాను. యవన ప్రాయంలో ఉరికొయ్యను ముద్దాడినా... ఆ యోధుడు భరత జాతికి అందించిన చైతన్యం అమూల్యమైనది.

భగత్‌సింగ్ జీవితం నుంచి ప్రతి ఒక్కరూ స్ఫూర్తి పొందాలి. మనం అనుభవిస్తున్న స్వేచ్ఛా, స్వాతంత్రాలు భగత్‌సింగ్ లాంటి ఎందరో వీరుల ప్రాణ త్యాగాల ఫలం అని యువత ఎల్లవేళలా గుర్తుంచుకోవాలి" అని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు.

## నటి కాకపోతే జాన్వీ సంచార జీవితం!

అతిలోక సుందరి శ్రీదేవి వారసురాలిగా తెరంగేట్రం చేసిన జాన్వీకపూర్ కెరీర్ బాలీవుడ్ లో దేదీప్యమానంగా సాగిపోతుంది. యువ హీరోలకు పర్ఫెక్ట్ జోడీగా రాణిస్తుంది. బయోపిక్ ల్లో సైతం నటిస్తూ సత్తా చాటుతుంది. ఇటీవలే టాలీవుడ్ లో నూ లాంచ్ అయింది. యంగ్ టైగర్ ఎన్టీఆర్ 30వ సినిమా తో తెలుగు ప్రేక్షకుల్ని పలకరించబోతుంది. నిజ జీవితంలో జాన్వీ ఊహించిందే. తల్లి అగ్ర తారగా కొనసాగారు. తండ్రి పెద్ద నిర్మాత. అలాంటి బ్యాక్ గ్రౌండ్ నుంచి వచ్చే వారసులు తప్పకుండా నటులే అవుతారని ఎవరైనా ఊహిస్తారు. దాదాపు అలాంటి వారి అందరి జీవితాలు తాము కొరుకున్న విధంగానే ఉంటాయి. అయితే ఒకవేళ జాన్వీ నటికాకపోతే మరో ఆప్షన్ ఏదైనా పెట్టుకుందా? అంటే అవుననే అంటుంది. జాన్వీ నటికాకపోతే ప్రపంచమంతా సంచారిలో చుట్టేసిదిట. సంచార జీవితం అంటే ఎంతో ఇష్టమట. నటి కాకపోతే ప్రపంచం చుట్టేసి కొత్త



వ్యక్తుల్ని కలుసుకునే దాన్ని. అదీ కుదరకపోతే రచయిత్రి అయ్యే దాన్ని అని తెలిపింది. సంచార జీవితం అన్నది సాహసంతో కూడుకున్నది. ప్రపంచాన్ని సాధారణంగా చుట్టేయడం వేరు. అడ్వెంచర్స్ గా మలుచుకోవడం వేరు. ఇక్కడ కూడా జాన్వీ అడ్వెంచర్ గానే ప్రయాణం సాగించడాన్ని ఇష్టపడింది. ఎక్కువగా ప్రకృతితో గడపాలని ఇష్టపడుతుందిట. వాయు కాలుష్యానికి దూరంగా చుట్టూ పచ్చిన వాతావరణ ఉంటే ఎంతో ఇష్టమట. అందుకోసం ఎక్కువగా మాల్దీవులకు వెళ్తుందిట. అలాగే ప్రశాంతత కోసం మూడు నెలలకు ఒకసారైనా తిరుపతి శ్రీవారి దర్శనం చేసుకుంటుందిట. మొత్తానికి అమ్మడిలో కొన్ని మంచి క్వాలిటీలు ఉన్నాయని తెలుస్తోంది. ఇలా ప్రపంచాన్ని చుట్టేయడం అంటే డ్యాషింగ్ డైరెక్టర్ పూరి జగన్నాథ్ కి ఎంతో ఇష్టం. ఖాళీగా ఉంటే బ్యాగేసుకుని ప్రపంచ దేశాలన్ని చుట్టడం ఆయనకు అలవాటు. ఆ అలవాటు నుంచి పుట్టిందే హార్ట్ ఎటాక్ లో నితిన్ క్యారెక్టర్. ఆ సినిమా ప్రచార సమయంలోనే పూరికి ప్రపంచ యాత్ర చేయాలని ఉందన్న విషయాన్ని రివీల్ చేసారు. కొత్త అన్వేషణలు అంటే ఆయనకు ఎంతో ఇష్టం.

## రెండు బ్లాక్ బస్టర్ హిట్లు కొట్టి ఫోటోలకి పరిమితమైన హీరోయిన్..!

కన్నడ సెన్సేషనల్ మూవీ కె.జి.ఎఫ్ తో వెండితెరకు పరిచయమైంది శ్రీనిధి శెట్టి. మొదటి సినిమానే హిస్టరీ క్రియేట్ చేసింది. ఆ తర్వాత ఆ సినిమా సీక్వెల్ లో కూడా అమ్మడు భాగమైంది. కె.జి.ఎఫ్ 1 2 సినిమాల హిట్లకు తను కూడా భాగమైంది. అయితే అంత పెద్ద హిట్లు కొట్టిన శ్రీనిధి కెరీర్ లో ఆ దూకుడు చూపించట్లేదని చెప్పొచ్చు. కె.జి.ఎఫ్ 2 తర్వాత విక్రం తో కోబ్రా సినిమా చేసింది శ్రీనిధి కానీ ఆ సినిమా రిజల్ట్ తేడా కొట్టడంతో అమ్మడు సైలెంట్ అయ్యింది. ఎంట్రీ గ్రాండ్ గా ఇచ్చినా తర్వాత సినిమాల విషయంలో కన్ ఫ్యూజ్ అవుతుంది శ్రీనిధి. అంతేకాదు తన దగ్గరకు వచ్చిన నిర్మాతలకు రెమ్యునరేషన్ పరంగా కూడా ఎక్కువ అడిగి షాక్ ఇస్తుందట. శ్రీనిధి ఇదంతా తెలిసి చేస్తుందా లేక తెలియక చేస్తుందా అన్నది చెప్పడం



కష్టం. సినిమాలు చేయకుండా ఫోటో షూట్స్ తో కాలం వెళ్లదీస్తుంది అమ్మడు. కె.జి.ఎఫ్ లాంటి సినిమా చేసిన హీరోయిన్ వరుసగా ఐదారు సినిమాలతో బిజీగా ఉంటుందని అనుకుంటే ఇలా ఖాళీగా ఉంటూ ఫోటోలు షేర్ చేస్తుంది. కెరీర్ గైడెన్స్ లో ఆమెకు ఎవరు సపోర్ట్ గా నిలవట్లేదా ఏంటో కానీ శ్రీనిధి క్రేజ్ ఉన్నప్పుడే క్యాష్ చేసుకోవాలని తెలియట్లేదు. తెలుగులో ఒకటి రెండు సినిమాల డిస్కషన్స్ జరిగినా అమ్మడికి నచ్చలేదో లేక ఏమైందో కానీ ఆ అవకాశాలను మిస్ చేసుకుందట. కోబ్రా తర్వాత శ్రీనిధి మరే సినిమాకు సైన్ చేయలేదు. అయితే ఆడియన్స్ కు మాత్రం తన ఫోటో షూట్స్ తో అలరిస్తుంది. సినిమాలు చేయాలి కానీ ఇలా ఫోటో షూట్స్ ఎంత చేసినా ఏం లాభమని కొందరు అంటున్నారు. జీరో సైజ్ పర్ఫెక్ట్ అవుట్ ఫిట్ తో కుర్రాళ్ల హృదయాలను గాయం చేస్తున్న శ్రీనిధి వరుస సినిమాలు చేస్తే ఎంకరేజ్ చేసేందుకు ప్రేక్షకులు రెడీగా ఉన్నారు. సినిమాల విషయంలో అమ్మడు సీరియస్ గా ఉంటే బెటర్ ఇలా సైలెంట్ గా ఉంటే ఫేడవుట్ అయ్యే ఛాన్స్ కూడా ఉంటుంది.




## ఒక్క సాలిడ్ హిట్ కూడా లేని అషురెడ్డి ఇన్ని దేశాలు ఎలా తిరిగేస్తోందబ్బా?





బుల్లితెర మీద అషురెడ్డి చేసే సందడి అంతా ఇంతా కాదు. బిగ్ బాస్ ద్వారా బుల్లితెర ఎంట్రీ ఇచ్చిన ఆమె ఆ తర్వాత అనేక రకాల మాటీవీ షోలలో కనిపిస్తూ ఉండేది. అయితే ఇప్పుడు కాస్త షోలలో కనిపించడం తగ్గించిన సోషల్ మీడియాలో మాత్రం రచ్చ చేస్తూ వస్తోంది. అషు రెడ్డి తల్లిదండ్రులు అమెరికాలో నివసిస్తారని సంగతి తెలిసిందే. అమెరికాలో కొన్నాళ్లు ఇండియాలో కొన్నాళ్ళు అన్నట్టుగా అషు రెడ్డి షెడ్యూల్ సర్వీస్ చేస్తోంది. అయితే నిజంగా అషురెడ్డి అంత రిచ్చా ఒకరోజు అమెరికాలో ఉన్నాను అని పోస్ట్ పెడుతుంది మరుసటి రోజు దుబాయ్ లో ఉన్నాను అని పోస్ట్ పెడుతుంది ఆ తర్వాత థాయిలాండ్ లో ఉన్నానని లేదా మాల్దీవులలో ఉన్నానని ఇలా రకరకాల పోస్టులు రకరకాల ప్రదేశాల నుంచి పెడుతూ ఉంటుంది. అయితే ఒక టీవీ నటి అది కూడా సినిమాలు చేసిన చిన్నా చేతగా సినిమాలు తప్ప పెద్ద సినిమా ఆఫర్ ఒక్కటి కూడా రాని నటి ఇంతలా ఎలా ఖర్చు పెడుతుంది. ఆమె ఆదాయం మార్గం ఏమిటి అని పెద్ద ఎత్తున ఇప్పుడు చర్చ జరుగుతోంది. వాస్తవానికి అషురెడ్డి చిన్నప్పుడే ఆమె తల్లిదండ్రులు విశాఖపట్నం నుంచి అమెరికా వెళ్లి అక్కడే స్థిరపడ్డారు అమెరికాలోని కొన్నాళ్లపాటు సాఫ్ట్ వేర్ ఉద్యోగం చేసిన అషు సినీ రంగం మీద ఉన్న మక్కువతో అప్పట్లో డబ్ స్మాష్ చేస్తూ జూనియర్ సమంత గా పేరు తెచ్చుకుంది. అలా ఒక సినిమా అవకాశం దక్కించుకుంది. సినిమా రంగంలో పరిచయాలు పెరిగిన తర్వాత కూడా కొన్నాళ్లు ఇక్కడ కొన్నాళ్ళు అమెరికాలో గడుపుతూ వస్తోంది. అయితే ఆమె ఇంతలా ఖర్చు పెట్టడానికి ఇన్ స్టాగ్రామ్ ద్వారా ఆదాయం వస్తుందని అంటున్నారు. ఎప్పటికప్పుడు ఇన్ స్టాగ్రామ్ ద్వారా హాట్ ఫోటోలు షేర్ చేస్తూ ఉండే ఈ భామ ఫాలోవర్లను పెంచుకుంటూ కొన్ని ప్రోడక్టను మార్కెటింగ్ చేస్తోందని ఆయా సంస్థలు రెమ్యూనరేషన్ కింద ఇచ్చే డబ్బుతోనే ఇంత హ్యాపీగా కావలసిన చోటికి తిరుగుతుందని తెలుస్తోంది.

## తమన్నా బికినీ అందాలు.. మైండ్ బ్లోయింగ్!



అందంతో ఒంపుసొంపులతో తక్కువ సమయంలోనే మంచి క్రేజ్ సంపాదించుకుంది మిల్కీ బ్యూటీ తమన్నా భాటియా. సూపర్ స్ట్రక్చర్ కళ్లు చెదిరే అందం శిల్పి చెక్కినట్లుగా ఒంపులు తిరిగిన శరీరంతో కుర్రాళ్లలో మంచి ఫాలోయింగ్ సంపాదించుకున్న బ్యూటీ తమన్నా. ఈ బ్యూటీ ఈ మధ్యకాలంలో సోషల్ మీడియాలో తన అందచందాలతో రచ్చ లేపుతోంది. గ్లామర్ షోలో ఏమాత్రం తగ్గడం లేదు. చిట్టి పొట్టి డ్రెస్సులతో థైస్ షో డీప్ లోనెక్ లో ఎద ఎత్తులతో కుర్రాకారును కవ్విస్తోంది. ఈ స్టార్ హీరోయిన్ అందాల ఆరబోతతో కుర్రాళు పిచ్చెక్కిపోతున్నారు. తాజాగా ఈ బ్యూటీ పిక్స్ సోషల్ మీడియోలో వైరల్ గా మారాయి. ట్రావెల్ అండ్ లీజర్ ఇండియా సంస్థ కోసం తమన్నా ఫోటో షూట్లో పాల్గొంది. సింగపూర్ లోని సెంటోసాలో అదిరిపోయే లుక్స్ తో దర్శనమిచ్చింది. చేతిలో సర్ఫ్ బోర్డు పట్టుకుని అలా నీటిలో నుండి నడుస్తూ ఫోటోలకు ఫోజులిచ్చింది. ఈ పిక్స్ లో తమన్నా అచ్చం జలకన్యలాంటి అందంతో మైమరిపిస్తోంది. మల్టీ కలర్ ఔట్ ఫిట్ నుండి థైస్ అందాలు కుర్రాళ్లను పిచ్చెక్కిస్తున్నాయి. క్లీవేజ్ షోతో అల్లాడించేస్తున్నాయి. అలా నీటిలో నడిచి వస్తూ తన ఒంపు సొంపులను ప్రదర్శిస్తూ తన ఫాలోవర్స్ ను ఆగమాగం చేసేస్తోంది ఈ హాట్ బ్యూటీ. ట్రావెల్ అండ్ లీజర్ ఇండియా సంస్థ తమన్నాను తమ కవర్ స్టార్ గా పేర్కొంది. ఈ గ్లామరస్ బ్యూటీతో ఈ సంస్థ తమ సేవలను ప్రచారం చేస్తోంది. ఇక ప్రస్తుతం తమన్నా చేతిలో ఒకటీ అర సినిమాలు తప్ప పెద్దగా అవకాశాలు రావడం లేదు. ప్రస్తుతం తెలుగులో భోళా శంకర్ సినిమాలో చిరు సరసన నటిస్తోంది. హిందీలో పలు వెబ్ సిరీస్ లు చేస్తున్నట్లు సమాచారం. తమిళంలో సూపర్ స్టార్ రజినీ కాంత్ జైలర్ సినిమాలో కూడా తమన్నాకు ఛాన్స్ వచ్చింది. తెలుగులో రీసెంట్ గా సత్యదేవ్ తో కలిసి గుర్తుందా శీతాకాలం సినిమా చేసిన తమన్నా.. ఆ తర్వాత వేరే ప్రాజెక్టులు ఒప్పుకున్నట్లు లేదు.

## ఎంట్రీకి ముందే పర్ఫెక్ట్ ప్లాన్.. సంయుక్త స్కెచ్ అదుర్స్..!

మలయాళ భామ సంయుక్త మీనన్ తెలుగులో సూపర్ ఫాం లో ఉంది. తన సినిమా ఎంట్రీ అంతా అలా జరిగిపోయిందని తన ఫేస్ బుక్ ఫోటోని చూసి ఒక డైరెక్టర్ కు ఒక కెమెరా మెన్ రిఫర్ చేయగా ఆడిషన్ కు పిలిచి సినిమా ఛాన్స్ ఇచ్చారని అన్నది. అంతేకాదు ఒక సినిమా చేసి సినిమాలు ఆపేద్దామనుకున్నా కానీ ఇక్కడ ప్రేక్షకుల ఆదరణ చూసి వరుసగా చేస్తూ వస్తున్నా అన్నది సం యుక్త. భీమ్లా నాయక్ సినిమాతో తెలుగు తెరకు పరిచయమైన అమ్మడు ఆ సినిమా ఆఫర్ రాగానే ట్యూటర్ ని పెట్టుకుని మరీ తెలుగు నేర్చుకున్నానని అన్నది. భీమ్లా నాయక్ ఈవెంట్ లో తెలుగు లో మాట్లాడటం చూసిన పవన్ కళ్యాణ్ చాలా బాగా మాట్లాడారని చెప్పారు. ఇక భీమ్లా నాయక్



సినిమా తర్వాత తనని అందరు డ్యానియల్ భార్య అని పిలుస్తున్నారని. పవన్ కళ్యాణ్ సిస్టర్ అంటున్నారని చెప్పుకొచ్చింది. తనకు ట్రావెలింగ్ చాలా ఇష్టమని ఒక్కదాన్నే ఎక్కడికైనా వెళ్తుంటానని అన్నది. హిమాలయాలకు వెళ్లొచ్చానని చెప్పింది సంయుక్త. అమ్మ నాన్న చిన్నప్పుడే విడిపోవడం వల్ల తన మదర్ దగ్గరే తను పెరిగానని. అందుకే తన తండ్రి ఇంటి పేరు మీనన్ ను ఇక మీదట వాడకూడదని అనుకున్నానని అన్నారు. ఇక హీరోయిన్ గా సెటిల్ అవకపోతే ట్రావెలర్ గా కెరీర్ ఎంచుకునే దాన్ని అని చెప్పింది అమ్మడు. అంతేకాదు ట్రావెలింగ్ అంటే ఇష్టం ఉండటం వల్ల తన వీపు మీద ట్రావెలర్ అనే ట్యాటూ కూడా వేయించుకున్నా అన్నది. కాలేజ్ డేస్ లో ధనుష్ ఆడుకాలం సాంగ్ కు ఫ్రెండ్స్ తో కలిసి డ్యాన్స్ చేశా ఇప్పుడు అదే ధనుష్ తో కలిసి స్క్రీన్ షేర్ చేసుకున్నా ఇది నిజంగా తను ఊహించలేదని అని చెప్పారు సంయుక్త. తెలుగులో మంచి ఫాం లో ఉన్న అమ్మడు తన ప్రతి సినిమాతో హిట్ అందుకోవడంతో సూపర్ క్రేజ్ తెచ్చుకుంది. సంయుక్త ఉంటే సినిమా హిట్ అన్న క్రేజ్ రావడంతో ఆమెతో సినిమాకు దర్శక నిర్మాతలు క్యూ కడుతున్నారు. ప్రస్తుతం మరో రెండు సినిమాలకు సైన్ చేసిన సంయుక్త తన లక్కీ ఫాం కొనసాగిస్తుందని చెప్పొచ్చు. సంయుక్త ను తెలుగు తెరకు పరిచయం చేసిన సితార బ్యానర్ లోనే మరో సినిమా కూడా ఆమె చేస్తుందని తెలుస్తుంది.

## అనసూయ వెబ్ సీరీస్ ఒక్క అడుగైనా పడిందా..?

జబర్దస్త్ యాంకర్ అనసూయ ప్రముఖ దర్శకుడు క్రిష్ డైరెక్షన్ లో ఒక మెగా వెబ్ సీరీస్ ప్లాన్ చేశారని తెలిసిందే. జబర్దస్త్ చేస్తూనే అడపాదడపా సినిమాలు చేస్తూ వచ్చిన అను సినిమాల్లో బిజీ అవడం వల్ల జబర్దస్త్ కు గుడ్ బై చెప్పేసింది. అయితే అనసూయ జబర్దస్త్ కు బై బై చెప్పడానికి వెనుక రీజన్ క్రిష్ తో చేసే వెబ్ సీరీస్ అని టాక్ వచ్చింది. గురజాడ అప్పారావు రచించిన కన్యాశుల్కం నవల ఆధారంగా ఈ వెబ్ సీరీస్ రాబోతుంది. వెబ్ సీరీస్ గురించి సోషల్ మీడియా లీకులు తప్ప అఫీషియల్ ఎనౌన్స్ మెంట్ అయితే రాలేదు. ఈ వెబ్ సీరీస్ లో అనసూయ వేశ్య పాత్రలో నటించనుంది. సోషల్ మీడియా హడావిడే తప్ప ఈ వెబ్ సీరీస్ ఇప్పటివరకు సెట్స్ మీదకు వెళ్లింది లేదు. అనసూయ కూడా సినిమా ఆఫర్లు వస్తున్నాయి కదా అని రెగ్యులర్ గా వచ్చే జబర్దస్త్ పేమెంట్ ని వదిలేసుకుంది.



అనసూయతో క్రిష్ వెబ్ సీరీస్ ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. అనసూయ మాత్రం రంగస్థలం పుష్ప లాంటి సినిమాల్లో ప్రత్యేక పాత్రలో నటిస్తూ వస్తుంది. బుల్లితెర మీద హాట్ ఇమేజ్ తెచ్చుకున్న అనసూయ వేశ్య పాత్రలో నటిస్తుందని అనగానే ఆడియన్స్ లో ఆసక్తి మొదలైంది. ఈ వెబ్ సీరీస్ మొదలవ్వాలి అంటే పవన్ తో క్రిష్ చేస్తున్న వీరమల్లు సినిమా పూర్తి కావాలి. రెండేళ్లుగా సెట్స్ మీద ఉన్న ఈ సినిమాకు పవన్ డేట్స్ అడ్జెస్ట్ అవకపోవడం తో ఇప్పటికీ పూర్తి కాలేదు. పవన్ దీనితో పాటుగా మిగతా సినిమాలు కూడా చేస్తుండటం వల్ల వీరమల్లు సినిమా ఇంకా పెండింగ్ ఉంది. క్రిష్ పవన్ సినిమా పూర్తి చేసి అది రిలీజ్ అయ్యాకనే అనసూయ వెబ్ సీరీస్ పై ఫోకస్ చేసే అవకాశం ఉంది. అప్పటివరకు అనసూయ ఎదురుచూడక తప్పదు. అనసూయ కన్యాశుల్కం వెబ్ సీరీస్ పై ఆడియన్స్ లో ఇంట్రెస్ట్ ఏర్పడింది. ప్రముఖ ఓటీటీ సంస్థ ఈ వెబ్ సీరీస్ ను ప్లాన్ చేస్తున్నారు. ఈ వెబ్ సీరీస్ కోసం అనసూయ భారీ రెమ్యునరేషన్ అందుకుంటుందని తెలుస్తుంది.




## గంగమ్మ ఒడికి ఖైరతాబాద్ గణేశుడు.. ఘనంగా నిమజ్జనోత్సవం

హైదరాబాద్: ఈ ఏడాది దశ మహా విద్యా గణపతిగా భక్తకోటికి దర్శనమిచ్చిన.. ఖైరతాబాద్ మహాగణపతి గంగమ్మ ఒడికి చేరాడు. భక్తజన కోలాహలం మధ్య శోభాయాత్రగా హుస్సేన్‌సాగర్‌కు తరలివచ్చిన విఘ్నేశ్వరుడి నిమజ్జనం పూర్తయింది.

ట్యాంక్‌బండ్‌పై ఎన్టీఆర్ మార్గ్ వద్ద ఏర్పాటు చేసిన నాలుగో నంబర్ క్రేన్ వద్ద బడా గణేశుడిని గంగమ్మ ఒడికి నిర్వాహకులు చేర్చారు. ఉదయం 6 గంటలకు మొదలైన గణేశ్ శోభాయాత్ర.. భక్తుల కోలాహలం మధ్య సందడిగా కొనసాగింది. మరోవైపు బాలాపూర్ గణపతి శోభాయాత్ర కూడా హుస్సేన్‌సాగర్ వైపు కొనసాగుతోంది. హైదరాబాద్ వ్యాప్తంగా వస్తున్న బొజ్జ గణపయ్యల విగ్రహాలతో ట్యాంక్‌బండ్, నెక్లెస్‌రోడ్డు సందడిగా మారాయి.

నిమజ్జనాన్ని తిలకించేందుకు భారీ సంఖ్యలో భక్తుల తరలివస్తున్నారు. 'గణపతి బప్పా మోరియా', 'జై బోలో గణేశ్ మహరాజ్' నినాదాలతో ట్యాంక్‌బండ్ పరిసరాలు మార్మోగుతున్నాయి.

## రైతుల గుండెల్లో స్వామినాథన్ చిరస్థాయిగా నిలిచిపోతారు : సీఎం కేసీఆర్



హైదరాబాద్ : భారత హరిత విప్లవ పితామహుడు ఎంఎస్ స్వామినాథన్ మృతి పట్ల ముఖ్యమంత్రి కేసీఆర్ సంతాపం వ్యక్తం చేశారు. దేశ వ్యవసాయ రంగం పెద్ద దిక్కును కోల్పోయిందని కేసీఆర్ అన్నారు. వ్యవసాయ రంగంలో స్వామినాథన్ వినూత్న పద్ధతులు చేర్చారు. స్వామినాథన్ కృషి వల్లే ఆహారాభివృద్ధిలో భారత్ స్వయం సమృద్ధి సాధించింది. రైతుల గుండెల్లో స్వామినాథన్ చిరస్థాయిగా నిలిచిపోతారని కేసీఆర్ పేర్కొన్నారు. భారతీయ హరిత విప్లవానికి జాతిపితగా కీర్తించబడే ప్రఖ్యాత వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్ గురువారం మధ్యాహ్నం కన్నుమూసిన సంగతి తెలిసిందే. భారతీయ వ్యవసాయ రంగంలో ఆయన అనేక విప్లవాత్మక మార్పులను సృష్టించారు. అత్యధిక స్థాయిలో దిగుబడిని ఇచ్చే అనేక వరి వంగడాలను ఆయన డెవలప్ చేశారు. తక్కువ ఆదాయం ఉన్న రైతులకు .. దిగుబడిని పెంచే అనేక పద్ధతులను ఆయన నేర్పారు. 1987లో స్వామినాథన్‌కు వరల్డ్ ఫుడ్ ప్రైజ్ అవార్డు దక్కింది. ఆ తర్వాత ఆయన చెన్నైలో ఎంఎస్ స్వామినాథన్ రీసర్చ్ ఫౌండేషన్‌ను ఏర్పాటు చేశారు. స్వామినాథన్ అనేక అంతర్జాతీయ అవార్డులను గెలుచుకున్నారు. 1971లో ఆయన రామన్ మెగస్సేసే అవార్డును సొంతం చేసుకున్నారు. 1986లో ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ వరల్డ్ సైన్స్ అవార్డు ఆయన్ను వరించింది. స్వామినాథన్‌కు భార్య మీనాతో పాటు ముగ్గురు కుమార్తెలు సౌమ్యా స్వామినాథన్, మధురా స్వామినాథన్, నిత్యా స్వామినాథన్ ఉన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థలో సౌమ్యా స్వామినాథన్.. చీఫ్ సైంటిస్టుగా ఉన్న విషయం తెలిసిందే.

## తెలంగాణలో వైద్య విప్లవం సృష్టించింది సీఎం కేసీఆరే : మంత్రి హరీశ్‌రావు



ములుగు : తెలంగాణ రాష్ట్రంలో వైద్య విప్లవం సృష్టించింది ముఖ్యమంత్రి కేసీఆర్ మాత్రమే అని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు స్పష్టం చేశారు. ప్రతి జిల్లాకు ఒక మెడికల్ కాలేజీ ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. ములుగు జిల్లాలో మెడికల్ కాలేజీ, డిగ్రీ కాలేజ్, 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణ పనులకు మంత్రులు ఎర్రబెల్లి దయాకర్ రావు, సత్యవతి రాథోడ్‌తో కలిసి మంత్రి హరీశ్‌రావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన సభలో హరీశ్‌రావు ప్రసంగించారు. ములుగులో మెడికల్ కాలేజీ కోసం శంకుస్థాపన చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. ములుగు జడ్పీ చైర్మన్ జగదీశ్ బతికి ఉంటే మెడికల్ కాలేజీ రావడం చూసి సంతోష పడేవారని మంత్రి పేర్కొన్నారు. కేసీఅర్ లేకుంటే ములుగు జిల్లా అయ్యేదా..? మెడికల్ కాలేజీ వచ్చేదా..? అని అడిగారు. కేసీఆర్ వల్లే కొత్త జిల్లా, కొత్త మెడికల్ కాలేజీ సాధ్యమైందన్నారు. కళ్యాణ లక్ష్మి పథకం అమలుకు స్ఫూర్తి ఈ ములుగు జిల్లానే అని హరీశ్‌రావు గుర్తు చేశారు. గుత్తూరు తండాలో 12 ఇండ్లు కాలిపోయాయి. బిడ్డకు పెళ్లి చేయలేని పరిస్థితిలో ఆ తండ్రి ఉంటే, ఆ పరిస్థితి చూసి కేసీఆర్ చలించి పోయారు. ఆ పెళ్లికి అండగా నిలబడి కేసీఆర్ ఆర్థిక సాయం చేశారు. రాష్ట్రం ఏర్పడ్డాక అదే స్ఫూర్తితో రాష్ట్ర వ్యాప్తంగా కళ్యాణ లక్ష్మి ప్రారంబించారు. కులం లేదు.. మతం లేదు.. పార్టీ లేదు.. 12 లక్షల మంది అర్హులకు, రూ. 11 వేల కోట్లు ఇచ్చామని తెలిపారు. పోడు భూముల విషయంలో 4 లక్షల 6 వేల ఎకరాలకు పోడు పట్టాలు ఇచ్చామని మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. ములుగు జిల్లాలోనే 14 వేల ఎకరాలకు పట్టాలు ఇచ్చామని చెప్పారు. అతి ఎక్కువ పోడు పట్టాలు ఇచ్చిన ఏకైక రాష్ట్రం తెలంగాణ. రైతు బంధు, రైతు బీమా, రుణ మాఫీ ఇలా రైతులకు ఎన్నో చేశారు. ఉన్న కేసులు ఎత్తివేశారు. నాడు ఎన్‌కౌంటర్లు, రైతు చావులు, ఎరువుల కొరత, కరెంట్ కొరత ఉండేది. కేసీఆర్ నాయకత్వంలో ఈ ప్రాంతం అభివృద్ధి చెందింది. నేడు ఇంటింటికీ తెలంగాణ ప్రభుత్వం పథకాలు చేరువ అయ్యాయని హరీశ్‌రావు తెలిపారు. అతి ఎక్కువ ప్రభుత్వ డెలివరీలు ఉన్న రెండో జిల్లాగా ములుగు నిలిచిందని మంత్రి పేర్కొన్నారు. మొదటిది నారాయణ్ ఖేడ్ అని తెలిపారు. 83 శాతం డెలివరీలు ప్రభుత్వ ఆసుపత్రుల్లో జరగటం సంతోషం. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు వరద సమయంలో ఏటూరు నాగారంలో డయాలసిస్ సెంటర్ పెట్టామని చెప్పారు. నాడు ములుగులో డాక్టర్ ఉండటం గొప్ప, నేడు డాక్టర్లను తయారు చేసే మెడికల్ కాలేజీ ఇచ్చింది కేసీఆర్ అని పేర్కొన్నారు. ములుగు దవాఖానలో దాదాపు వంద మంది వైద్యులు ఉంటారని తెలిపారు. ఎస్టీలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించడం వల్ల.. నీట్‌లో 2లక్షల ర్యాంకు వచ్చినా ఎంబీబీఎస్ సీటు వచ్చిందని మంత్రి హరీశ్‌రావు తెలిపారు.

## గ్రూప్-1 ప్రిలిమ్స్‌లో ఎలాంటి అవకతవకలు జరగలేదు : టీఎస్‌పీఎస్సీ




హైదరాబాద్ : ఈ ఏడాది జూన్ 11న జరిగిన ప్రిలిమ్స్ పరీక్షపై టీఎస్‌పీఎస్సీ వివరణ ఇచ్చింది. 258 పేపర్లు అదనంగా వచ్చాయన్న ఆరోపణలపై స్పష్టత ఇచ్చింది. పరీక్ష రోజు కలెక్టర్ల ఇచ్చిన సమాచారం ఆధారంగా ప్రకటన ఇచ్చామని తెలిపింది. 2,33,248 మంది పరీక్ష రాసినట్టు ప్రకటన చేశాం. పారదర్శకత కోసం అదే విషయం మీడియాకు కూడా చెప్పాం. ఓఎంఆర్ స్కానింగ్‌లో 2,33,506 మంది పరీక్ష రాసినట్లు తేలింది. గ్రూప్-1 ప్రిలిమ్స్ 33 జిల్లాల్లో 994 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించాం. అనేక జిల్లాల్లో లక్షల మంది అభ్యర్థులు పరీక్ష రాశారు. లక్షల మంది పరీక్ష రాసినప్పుడు అంకెల్లో స్వల్పమార్పులు సహజమే. స్కానింగ్ తర్వాత తుది సంఖ్య ప్రకటించాం. పరీక్ష తర్వాత కొన్ని పేపర్లు కలిపేందుకు ఆస్కారమే లేదు. గ్రూప్-1 ప్రిలిమ్స్ నిర్వహణలో ఎలాంటి అవకతవకలు జరగలేదు అని టీఎస్‌పీఎస్సీ స్పష్టం చేసింది.

## పల్లా రాజేశ్వర్‌రెడ్డి జనగామ బరి నుంచి తప్పుకోవాలి



సిద్దిపేట: జనగామ నియోజకవర్గ బీఆర్ఎస్ అసెంబ్లీ అభ్యర్థి కోసం సీఎం కేసీఆర్ సర్వేలు నిర్వహించి టికెట్ కేటాయించాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మండల శ్రీరాములు పేర్కొన్నారు. చేర్యాల మండలం ఆకునూర్‌లో గురువారం నాడు బీఆర్ఎస్ కార్యకర్తలతో రహస్య సమావేశాన్ని ఏర్పాటు చేసి, భవిష్యత్ కార్యాచరణపై కార్యకర్తలతో చర్చించారు. ఈ సందర్భంగా శ్రీరాములు మీడియాతో మాట్లాడుతూ.."జనగామ టికెట్ కేటాయించకపోతే 50 వేల మంది కార్యకర్తలతో సభ ఏర్పాటు చేసి జనగామ బరిలో ఉ ంటానని సీఎం కేసీఆర్‌ను హెచ్చరించారు. పల్లా రాజేశ్వర్‌రెడ్డికి ఎమ్మెల్సీగా నాలుగేళ్లు సమయం ఉంది, కాబట్టి జనగామ బరిలో నుంచి తప్పుకోవాలి. బీసీలు ఎక్కువగా ఉన్న నియోజకవర్గం జనగామ కాబట్టి బీసీ బిడ్డనైన నాకు జనగామ టికెట్ కేటాయించాలి" అని శ్రీరాములు పేర్కొన్నారు.

## చోరీయత్నానికి పాల్పడిన నిందితులను, కటకటాల పాలు చేసిన షామీర్పేట పోలీసులు...

**అభినందించి, క్యాష్ రివార్డును అందజేసిన మేడ్చల్ డిసిపి డాక్టర్ పి శబరిష్, ఏసిపి రఘునందన్ రావు...**




శామీర్పేట : నిత్యం తమ విధుల్లో తలమునుకలై ఉండే పోలీసులు, చోరీ జరగలేదు కదా, చోరీకి యత్నం మాత్రమే జరిగింది కదా అంటూ ఆలోచిం చకుండా, చోరీకి యత్నించిన దొంగలను, సీసీ కెమెరాల సహాయంతో షామీర్పేట్ పోలీసులు చాకచక్యంగా పట్టుకుని రిమాండ్కు తరలించారు. ఇక వివరాల్లోకి వెళితే... ఈనెల 24వ తేదీన ఉదయం 11:30 ప్రాంతంలో, జగన్ కూడా గ్రామానికి చెందిన మహిళ, తోటి మహిళలతో కలిసి కూలి పని కొరకు, లాల్ గడి మలక్పేట గ్రామం వైపు రోడ్డు మీద నడుచుకుంటూ వెళుతుండగా, ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ద్విచక్ర వాహనం పై వచ్చి, సదరు మహిళను మేడ్చల్ వైపుకు దారి ఎటు అంటూ అడిగినట్టుగా నటిస్తూ, ఒక్కసారిగా మహిళ మెడలో నుండి బంగారు గొలుసును లాక్కొని పారిపోయేందుకు యత్నించారు, కాగా అట్టి మహిళా ధర్యంగా ప్రతిఘటిస్తూ, గట్టిగా అరుస్తూ తన మెడలోని గొలుసును పట్టుకోవడంతో, అట్టి వ్యక్తులు అక్కడి నుండి పరాయి పరార య్యారు. దీంతో శామీర్పేట పోలీసులు గొలుసు దొంగతన ఎత్నింపై కేసు నమోదు చేశారు. ఇక విషయం తెలుసుకున్న షామీర్పేట డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ రాజు ఆధ్వర్యంలో ఎస్సై మునిందర్, కానిస్టేబుల్ మహేష్, హొంగార్డ్ సుబ్బారెడ్డి, సిఐ నిరంజన్ రెడ్డి పర్యవేక్షణలో ఓ ప్రత్యేక బృందంగా ఏర్పడి, సీసీ కెమెరాల సహాయంతో అట్టి గుర్తుతెలియని వ్యక్తుల జాడను ఛేదించి, ఈ నెల 27వ తేదీన ఉదయం అదుపులో తీసుకొని, అట్టి వ్యక్తులను జ్యూడిషియల్ రిమాండ్ కు తరలించారు. నేరస్తులను పట్టుకోవడంలో చాకచక్యం వహించిన శామీర్పేట పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఎం నిరంజన్ రెడ్డి, డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ సిహెచ్ రాజు, ఎస్సై మునీందర్, కానిస్టేబుల్ మహేష్, హొంగార్డ్ సుబ్బారెడ్డిలను మేడ్చల్ డిసిపి డాక్టర్ పి శబరిష్, ఏసిపి రఘునందన్ రావు అభినందించి, సిబ్బందికి క్యాష్ రివార్డును అందజేశారు.




హైదరాబాద్: దేశవ్యాప్తంగా పేరుగాంచిన బాలాపూర్ లడ్డూ అత్యధిక ధర పలికింది. ఈసారి లడ్డూను తుర్కయాంజల్‌కు చెందిన దాసరి దయానంద రెడ్డి రూ.27లక్షలకు దక్కించుకున్నారు. ఈ వేలం పాటలో 20 మంది స్థానికులు సహా మొత్తం 36 మంది పోటీపడ్డారు. బాలాపూర్ ఉత్సవ సమితి రూ.1,116తో వేలం పాట ప్రారంభించింది. వేలంపాట కార్యక్రమంలో మంత్రి సబితా ఇంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డితో పాటు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. వేలం పూర్తి కావడంతో బాలాపూర్ గణేశుడి శోభాయాత్ర ప్రారంభమైంది. ప్రత్యేక వాహనంలో విఘ్నేశ్వరుడిని హుస్సేన్ సాగర్‌కు తరలిస్తున్నారు. బాలాపూర్ గణేశుడి శోభాయాత్ర చాంద్రాయణగుట్ట, షాలిబండ, ఫలక్‌నుమా, చార్మినార్ మీదుగా హుస్సేన్‌సాగర్‌కు చేరుకోనుంది.

**వేలం ప్రారంభించి 30 ఏళ్లు..** బాలాపూర్ లడ్డూ వేలాన్ని ప్రారంభించి ఈ ఏడాదికి 30 ఏళ్లు కావస్తోంది. ప్రప్రథమంగా 1994లో ఏకదంతుడి చేతిలోని లడ్డూను వేలం వేయగా.. స్థానిక రైతు కొలను మోహన్‌రెడ్డి రూ.450కు కైవసం చేసుకున్నారు. సుమారు 17 ఏళ్ల వరకు లడ్డూ కొనుగోలుకు స్థానికులకే అవకాశం లభించగా.. తరువాత బయట వ్యక్తులు పాల్గొని దక్కించుకోవడం ప్రారంభమైంది. ఇప్పటివరకు లడ్డూను 28 సార్లు వేలం వేయగా.. కరోనా నేపథ్యంలో 2020లో మాత్రం ముఖ్యమంత్రి కేసీఆర్‌కు అందించారు. లడ్డూ ద్వారా వచ్చిన మొత్తంతో ఉత్సవసమితి అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతూ వస్తోంది.




బండ్లగూడ జాగీర్: గణేశ్ ఉత్సవాల్లో చివరి రోజైన నిమజ్జనం రోజు లడ్డూ వేలం పాటలు పోటాపోటీగా సాగుతున్నాయి. హైదరాబాద్‌లోని బండ్లగూడ జాగీర్‌లో లంబోదరుడి చేతిలోని లడ్డూ రికార్డు ధర పలికింది. కీర్తి రిచ్మండ్ విల్లాస్‌లో జరిగిన వేలంలో వినాయకుడి లడ్డూ ఏకంగా రూ.1.26 కోట్లు పలికింది. విల్లాలోని కమ్యూనిటీ మొత్తం కలిసి ఆ లడ్డూను సొంతం చేసుకుంది.

## స్వామినాథన్ మృతి వ్యవసాయ రంగానికి తీరని లోటు



హైదరాబాద్: ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్ మృతి బాధాకరం. ఆయన మరణం వ్యవసాయ రంగానికి తీరని లోటని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్ వ్యాఖ్యానించారు. గురువారం నాడు బీజేపీ పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ... "వ్యవసాయంలో రైతు పెట్టే పెట్టుబడికి వ్యయం తగ్గేలా చేశారు. రైతులు పండించే పంటలకు కనీస మద్దతు ధర(%మీఎస్పీ%) ను నిర్ణయించాలని సిఫారసు కోసం పోరాటం చేశారు. నిరంతరం రైతు సంక్షేమానికి పాటుపడ్డారు. స్వామినాథన ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబానికి మనోధైర్యం కల్పించాలని భగవంతుడిని వేడుకుంటున్నా" అని బండి సంజయ్ పేర్కొన్నారు.

## గణేశ్ నిమజ్జనంలో పోలీసుల డ్యాన్సులు.. జనం ఫిదా

హైదరాబాద్: నగరంలో వినాయక నిమజ్జన ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. వేలాదిగా గణేశుని విగ్రహాలు ట్యాంక్‌బండ్‌కు తరలివస్తున్నాయి. గణేశ్ నిమజ్జనం సందర్భంగా యువత డ్యాన్సులతో అదరగొడుతున్నారు. అయితే భక్తులతో పాటు పోలీసులు కూడా కాలు కదిపారు. గణేశ్ నిమజ్జనం సందర్భంగా భద్రతా ఏర్పాట్లలో పాల్గొన్న పలువురు పోలీసులు ఎంతో ఉత్సాహంతో భక్తులతో కలిసి డ్యాన్స్‌లు చేశారు. ఓ కానిస్టేబుల్ డివైడర్‌పై నిలబడి డీజే సాంగ్స్‌కు స్టెప్పులు వేశారు. గణేశ్ నిమజ్జనోత్సవంలో సదరు కానిస్టేబుల్ డ్యాన్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కానిస్టేబుల్ డ్యాన్సుకు అక్కడి జనం ఫిదా అయ్యారు. మరికొందరు పోలీసు అధికారులు కూడా భక్తులతో కలిసి స్టెప్పులు వేస్తూ ఎంజాయ్ చేశారు. నిత్యం భద్రతా చర్యలో నిమగ్నమయ్యే పోలీసులు ఇలా స్టెప్పులు వేయడంపై భక్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com